ప్రజలే ప్రభువులు

# జనబలం

ఆగస్టు 2022 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-

## స్వతంత్ర భారతం

Azadi Ka Amrit Mahotsav



LOK SATTA People Power 25 YEARS

లోక్‌సత్తా



## విద్యా ప్రమాణాలను పెంచేందుకు డిజి కంటెంట్ ఉమ్మడి వేదికగా FDR - లోక్‌సత్తా

## 'భారత్ 75-
## లోక్‌సత్తా 25'
## శుభాకాంక్షలు

1996లో ప్రారంభించిన ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) నుండి 1997లో ఆవిర్భవించిన లోక్‌సత్తా రాజకీయ ఉద్యమం ఈ ఆగస్టు 3న 25 ఏళ్ల మైలురాయిని దాటుతోంది. భారత్‌లో 'పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందించేందుకు, నివారించదగ్గ బాధలను తొలగించేందుకు' రాజీలేని బహుముఖ పోరాటం చేస్తున్న లోక్‌సత్తా రజతోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలోనే భారతదేశం 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకోవటం స్ఫూర్తిని మరింత పెంచుతోంది. ఈ చరిత్రాత్మక సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులకు, లోక్‌సత్తా సభ్యులు, అభిమానులు అందరికీ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు

---




# రెండు రాష్ట్రాల్లో సరికొత్త ఉద్యమ కార్యక్రమాలకు సిద్ధమవ్వండి: లోక్‌సత్తా శ్రేణులకు జేపీ పిలుపు

లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ సంస్థను ప్రారంభించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, పార్టీ తరపున ప్రజా సమస్యలపై సరికొత్త తరహా ఉద్యమాన్ని రూపొందించాలని డా॥ జయప్రకాష్ నారాయణ్ పార్టీ, ఉద్యమ సంస్థ నేతలకు సూచించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉద్యమ కార్యక్రమాలకు మూడు అంశాలపై సన్నద్ధం కావాలని సూచించారు. యువత, పట్టణాలు-సమగ్ర అభివృద్ధి, ఆరోగ్యం - హక్కుగా వైద్య సేవలపై లోతైన చర్చ చేసి కార్యాచరణను ప్రారంభించాలన్నారు. కర్ణాటకలో పట్టణీకరణ సంస్కరణల్ని తెలుసుకునేందుకు రెండు రాష్ట్రాల బృందం వెళ్లి పరిశీలించాలన్నారు. రాజకీయాల తీరుతెన్నులపై తర్వాత దృష్టి సారిద్దామని, ముందు రాజకీయాల లక్ష్యమైన అంశాలపైన లోతైన అధ్యయనంతో, నూతన పంథాలో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ వర్గాలకు జేపీ పిలుపునిచ్చారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు, ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్, నేతలు ఉప్పలపాటి మాచిరాజు, గఫార్, ఎం.నర్సింహారెడ్డి, బాలనర్సయ్య, వంశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 సంచిక 08

ఆగస్టు 2022

సంపాదకవర్గం
**బండారు రామ్మోహనరావు**
**శిరమని నరేష్**

వర్కింగ్ ఎడిటర్
**దూసనపూడి సోమసుందర్**


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




దానికి వ్యాక్సిన్.. మా వల్ల కాదని కంపెనీలన్నీ చేతులెత్తేశాయ్ సార్!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

# స్వరాజ్యం- సురాజ్యం

సంపాదకీయం

పరాయి పాలన నుండి మనం స్వరాజ్యం సాధించుకుని 75 సంవత్సరాలు పూర్తయ్యింది. ఆధునిక, ప్రజాస్వామ్య, నాగరిక దేశంలో భారత్ పురోగమనాన్ని సమీక్షించుకోవడానికీ, ఆత్మవిమర్శ చేసుకోవడానికీ, భవిష్యత్ మార్గదర్శనానికీ వీలు కల్పించిన ఉదాత్తమైన, స్ఫూర్తిదాయకమైన సందర్భమిది. కేంద్రప్రభుత్వం చొరవతో గత సంవత్సరం మార్చి 12న ప్రారంభమైన 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాలు దేశవ్యాప్తంగా 75 వారాల పాటు కొనసాగాయి.

సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో భారత్ సాధించిన ప్రగతిశీల అస్థిత్వాన్ని ప్రతిబింబించే విధంగా అమృత్ మహోత్సవ్ కార్యకలాపాలు నిర్వహించాలని ప్రభుత్వం పిలుపు ఇచ్చింది. స్వాతంత్రోద్యమంలో పాల్గొని పెద్దగా గుర్తింపునకు నోచుకోని యోధుల చరిత్రలను, ముఖ్యంగా మహిళామూర్తుల చరిత్రలను వెలుగులోనికి తీసుకురావాలని సంకల్పించింది. స్వాతంత్ర్య సమరంలోని కీలక ఘట్టాలకు వేదికలుగా నిలిచిన ప్రాంతాలలో స్మారక స్థలాలను అభివృద్ధి చేయాలని తలపెట్టింది. దేశ ఆర్థి వ్యవస్థను గాడిలో పెట్టి 'ఆత్మనిర్భర్ భారత్ 2.0' ను సాధించాలని కూడా ప్రభుత్వం లక్ష్యనిర్దేశం చేసింది. ప్రతీఏటా ఆగస్టు 15వ తేదీనాటికి నిర్వహించే రకరకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరపాలని ఆదేశించింది. ఉత్సవాల నిర్వహణకు ఒక విశాలమైన ప్రాతినిధ్యం కలిగిన కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

ఉత్సవాల ప్రారంభం సందర్భంగా కొంత హడావుడి కనిపించినా ఏడాది పొడవునా అమృత్ మహోత్సవ్ స్ఫూర్తిని కొనసాగించడంలో పెద్దగా ఆసక్తి కన్పించలేదు. ఏడాది అంతా బహిరంగ చర్చలో రాజకీయ వివాదాలే ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. తక్షణ రాజకీయ ప్రయోజనాల చుట్టూ చర్చను పరిమితం చేయడం ద్వారా రాజకీయ పక్షాలు తమ వివేకాన్ని, దూరదృష్టినీ ప్రదర్శించలేకపోవడం అత్యంత విచారకరం. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరుతో చేపట్టిన కొన్ని కార్యకలాపాలు వివాదాలకు ఆస్కారం ఇవ్వడం కూడా మన నేతల సంకుచిత ధోరణికి అద్దం పట్టింది. వాయిస్ ఆఫ్ ఇండియా పేరుతో వస్తున్న డిజిటల్ ప్రచారం గత ఎనిమిదేళ్ల విజయాలను కీర్తించే ప్రభుత్వ ప్రచారంగా మాత్రమే మిగిలిపోయింది. ఘర్ ఘర్ తిరంగా జాతీయ పతాకాన్ని సామాజిక మాధ్యమాలలో డీపీగా ప్రదర్శించే కార్యక్రమం కొంతమేరకు ఉత్సాహాన్ని తెచ్చినా అందులో ప్రచారోత్సాహమే తప్ప నిజమైన స్ఫూర్తిని రగిలించడంలో జాతీయ నాయకత్వం విఫల మయ్యిందని చెప్పాలి.

భారతజాతీయోద్యమ పితామహునిగా కీర్తి పొందిన బాలగంగాధర తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు' నినాదాన్నిచ్చారు. గాంధీజీ తొలుత 'స్వరాజ్య ' నినాదం ఇచ్చినా అనంతర కాలంలో 'సంపూర్ణ స్వరాజ్యం'గా తన నినాదాన్ని సవరించారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్ని సర్దార్ భగత్‌సింగ్ ప్రాచుర్యంలోకి తెచ్చారు. దోపిడీ, పీడన లేని, శ్రామిక రాజ్యస్థాపన గురించి కమ్యూనిస్టులు, సోషలిస్టులు మాట్లాడుతూ వచ్చారు. కుల నిర్మూలన ద్వారా, విద్య ద్వారా, వివక్షలు లేని నవభారతాన్ని నిర్మించాలని డా.బీ.ఆర్.అంబేడ్కర్ తపించారు. భారతీయ చరిత్ర, సంస్కృతిలోని పురాతన వైభవాన్ని పునరుద్ధరించడానికి 'హిందూ రాష్ట్ర' ఏర్పాటు కావాలని సావర్కర్ ఆశించారు. జాతీయోద్యమంలోని విభిన్న ఆలోచనాస్రవంతులు, సైద్ధాంతికధోరణులు, కార్యాచరణలు ఆనాటి బహిరంగ చర్చని ప్రభావితం చేశాయి. స్వరాజ్య సాధన దిశగా జాతిమొత్తాన్ని సమాయత్తం చేయడానికి నాటి చర్చ దోహదం చేసింది. జాతీయ ఏకాభిప్రాయ సాధనకు నాటి నాయకత్వం పరస్పర అవగాహనతో, సామరస్యంతో, సహకారంతో కృషి చేసింది.

లోకమాన్య బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలే, ధోరణుల మధ్య జరిగిన చర్చ నుండి పూజ్య బాపూజీ భావజాలం రూపుదిద్దుకున్న వైనాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. స్వరాజ్య సాధనకు అవసరమైతే హింసకు సైతం పాల్పడవచ్చునన్న తిలక్ వైఖరికీ, రాజ్యాంగబద్ధ పోరాట రూపాలను మాత్రమే చేట్టాలన్న గోఖలే వైఖరికీ మధ్య రెండు, మూడు దశాబ్దాల సంవాదం కొనసాగింది. దాని నుండి అహింస, సామాజిక సామరస్యం, అస్పృశ్యతా నివారణ, ఆర్థిక స్వావలంబన, హిందూ-ముస్లిం ఐక్యత వంటి భావనలను పూజ్య బాపూజీ ఆవిష్కరించారు. తిలక్ ప్రతిపాదించిన హింసా భావనలను వ్యతిరేకిస్తూ గాంధీజీ అహింసా పోరాటాన్ని ముదుకు తెచ్చారు. తిలక్ ఆలోచనలలోని హిందూ అగ్రవర్ణ , పితృస్వామిక పెత్తందారీ ధోరణులను గాంధీజీ పూర్తిగా నిరాకరించారు. కులంలలోని అణిచివేత స్వభావాన్ని, హిందూ, ఇస్లాం మతాలలో స్త్రీలపట్ల గల పీడన, వివక్ష భావనలను గాంధీజీ తిరస్కరించారు.

కుల, మత, లింగ, భాషా వివక్షలు లేని, సమాఖ్య స్వభావం కల, భాషా ప్రయుక్త రాష్ట్రాలతో కూడిన ఆధునిక నవభారత నిర్మాణం గురించిన భావనలు గాంధీజీ సంపూర్ణ స్వరాజ్యం రూపంలో వ్యక్తమైనాయి. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ,స్వరాజ్యం అంటే ఏమిటో గాంధీజీ చాలా స్పష్టంగా వివరిస్తూ వచ్చారు. జాతీయోద్యమంలో శిఖర సమానుడైన తిలక్‌ను, సాంఘిక విప్లవకారుడైన డా. బి.ఆర్. అంబేడ్కర్‌నూ, మార్క్సిస్టు విప్లవకారుడు భగత్‌సింగ్‌నూ వ్యక్తిగతంగా ఎంతో అభిమానించిన గాంధీజీ జాతీయ ఏకాభిప్రాయ సాధనలో అత్యంత ఆచరణాత్మక వైఖరిని తీసుకుని ముందుకు సాగారు. భారతీయ సమాజంలోని వాస్తవికతలను అవగాహన చేసుకున్న గాంధీజీ జాతీయోద్యమంలోని తీవ్రవాద, ఛాందసవాద, సంస్కరణవాద ధోరణుల మధ్య ఒక సామరస్యాన్ని, ఆచరణాత్మకతను రూపొందించడానికి కృషి చేశారు. పరాయి పాలనను తొలగించడం సంపూర్ణ స్వరాజ్యంలోని తొలిమెట్టు మాత్రమేనని గాంధీజీ పదేపదే స్పష్టం చేశారు.

ఎస్సీ,ఎస్టీ, బడుగు బలహీనవర్గాల విముక్తీ, మహిళల విముక్తీ సంపూర్ణ స్వరాజ్యంలో సాధించాల్సిన ఆదర్శాలుగా గాంధీజీ ప్రబోధించారు. పోరాటరూపాలలోనే కాకుండా మానవ స్వభావంలో సామాజిక స్వరూపంలో అహింస ఒక సర్వోన్నతమైన ఆదర్శంగా గాంధీజీ రూపొందించారు. ప్రభుత్వాల పెత్తందారీతనాన్నీ, పెట్టుబడిదారుల దోపిడీని, అగ్రకుల దురహంకారాన్నీ, పితృస్వామిక భావజాలాన్నీ, కేంద్రీకృత నియంతృత్వ అధికారాన్నీ గాంధీజీ ఒక 'హింస'గా భావించారు. వాటన్నిటి నుండి మనుషులు విముక్తి చెందడం 'అహింస' లక్ష్యమని, అదే సంపూర్ణ స్వరాజ్యమని గాంధీజీ భావించారు. సురాజ్యం కంటే నాకు స్వరాజ్యం ముఖ్యమని గాంధీజీ అన్నమాట నిజమే. కానీ వలస పాలన నుండి విముక్తి సాధించడం తక్షణ కర్తవ్యంగా నాటి జాతీయోద్యమం భావిస్తున్న రోజుల్లో గాంధీజీ సురాజ్య భావనను ప్రాచుర్యంలో ఉంచిన మాటను గుర్తుంచుకోవాలి. సంపూర్ణ స్వరాజ్యంలో, నిర్మాణ కార్యక్రమంలో , సప్తమహాపాపాలు ప్రతిపాదనలో గాంధీజీ సురాజ్య భావనను గట్టిగానే ప్రతిపాదించారు.

జాతీయోద్యమం రూపొందించిన ఆదర్శాలను నేటి తరానికి నిరావేశంగా, నిష్పాక్షికంగా వివరించాల్సిన అవసరం ఉంది. అహింసను ఈసడించడం మానుకుని హింసారాధనను విడనాడి, సురాజ్యం దిశగా దేశాన్ని నడిపించడం మన కర్తవ్యం కావాలి. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ఇచ్చిన అవకాశాన్ని అటువంటి ఏకాభిప్రాయ సాధనకు వినియోగించడం అవసరం.

డి. సోమ సుందర్

# స్వతంత్ర భారతం 75

# లోక్‌సత్తా 25

## స్వాతంత్ర్య అమృత మహోత్సవం - రెండో స్వాతంత్ర్య పోరాట రజతోత్సవం..
## స్వతంత్ర భారతానికి సంపూర్ణ వికాస ఎజెండా లోక్‌సత్తా

2022, ఆగస్టు.. భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవం, రెండో స్వాతంత్ర్య పోరాట రజతోత్సవం.

ఈ ఏడాది ఆగస్టు 15న దేశానికి స్వతంత్రం వచ్చి 75ఏళ్లు పూర్తవుతుండగా, "వివక్ష లేకుండా ప్రతిబిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించటం, నివారించదగ్గ బాధల్ని తొలగించటం" కోసం సమగ్ర విధానాలతో భారత్‌లో రెండో స్వతంత్ర పోరాటం సాగిస్తున్న లోక్‌సత్తా రాజకీయ ఉద్యమం ఆవిర్భవించి ఆగస్టు 3కి 25 సంవత్సరాలు.

ఓ కీలక మైలురాయి, చరిత్రాత్మక సందర్భం.

2021, మార్చి 12న గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుంచి ప్రారంభించిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'ని ఈ సంవత్సరం 75వ వార్షికోత్సవం పూర్తయినా 2023 ఆగస్టు 15 వరకూ కొనసాగించనున్నారు.

అయితే, సమాజంలోని ప్రముఖులను, సెలబ్రిటీలను భాగస్వాముల్ని చేస్తూ ఇంత దీర్ఘకాలం నిర్వహిస్తున్నా..ఇంత గొప్ప సందర్భానికి తగిన సమీక్ష మాత్రం ఇప్పటికీ కానరాదు.

లోతుగా సమీక్షించుకుని, దిశానిర్దేశం చేసుకుని, కార్యోన్ముఖులు కాకుండా.. గతకాలపు స్మరణలు, పడికట్టు పదాలు, ఉదాత్త ఉపన్యాసాలు, యధాతథ పరిస్థితి చుట్టూనే కొన్ని మార్పులకి పరిమితమైతే ఈ సమున్నత సందర్భం కాస్తా అంకెల విన్యాసంగా మారిపోతుంది.

**అమృత మహోత్సవ మైలురాయిని దాటటమే మొదటి విజయం**

స్వతంత్ర భారతదేశం ఓ విస్మరించలేని శక్తిగా ఈవేళ అమృత మహోత్సవ మైలురాయిని దాటుతోందంటే.. 1947లో అనేకమంది వ్యక్తం చేసిన అంచనాలను తల్లకిందులు చేస్తూ ఒక సార్వభౌమ దేశంగా విజయవంతమైనట్లు. అలాగే మనతోపాటు స్వతంత్రం పొందిన దేశాలతో పోల్చి చూస్తే మనం ప్రజాస్వామ్యంలో కూడా విజయం సాధించాం. ఎన్ని లోపాలున్నా పౌరులు ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేస్తున్నారు, గెలిచిన పార్టీ అధికారంలోకి వస్తోంది. ఉదార రాజ్యాంగాన్ని సూత్రప్రాయంగా అందరూ అంగీకరిస్తున్నారు. నచ్చిన భావాలను వ్యక్తం చేసే క్రమంలో ప్రభుత్వాలను సైతం విమర్శించే స్వేచ్ఛ మనకుంది. ప్రజల కష్టం, సమాజంలోని అంతర్గత బలం ప్రధాన చోదకశక్తులుగా మెరుగైన ఆర్థిక ప్రగతిని కూడా సాధిస్తున్నాం. మౌలికంగా ఈ విజయాలు ఉన్నప్పటికీ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మార్పుల్ని వేగంగా అందుకుంటున్నప్పటికీ, మన దేశ సామర్థ్యంతో పోలిస్తే ఇవి ఎంతమాత్రం సరితూగవు. ఫలితంగా ఈవేళ్టికీ అత్యధిక శాతం జనాభా భవిష్యత్తును పుట్టిన పుట్టుక శాసిస్తోంది, నివారించదగ్గ బాధలు కోట్ల మంది ప్రజల్ని పీడిస్తున్నాయి.

## స్వీయ తప్పిదాలే ఎక్కువ

ఈ ఏడున్నర దశాబ్దాల్లో వైఫల్యాలకు మనకు వారసత్వంగా వచ్చిన కొన్ని తప్పిదాలు కూడా కారణమైనా, మన స్వయంకృతాపరాధాలు ప్రధాన కారణం.

జాతీయోద్యమంలో కొందరు కీలక నేతల ఉదాసీనత, ముందుచూపు కొరవడటం వల్ల జరిగిన పరిణామాలతో దేశ విభజన అనివార్యమయింది. మహాత్మాగాంధీలాంటి నాయకత్వ పాటవం, ఆత్మశక్తి, అపార ప్రజాదరణ గల నాయకుడు కూడా సంభాళించుకోలేని స్థాయి విద్వేషపూరిత హింసాత్మక పరిణామాలు స్వతంత్రం వచ్చే సమయంలో జరిగాయి. ఈ కల్లోలం ప్రజాస్వామిక వ్యవస్థల నిర్మాణం గురించి మన జాతీయోద్యమ నేతలు అప్పటిదాకా అనుకున్న ఆలోచనల్ని ప్రభావితం చేసింది. ఫెడరలిజంపై రాజీ పడేలా చేసింది. దీంతో బలహీన రాష్ట్రాలు, ప్రాధాన్యతలేని స్థానిక ప్రభుత్వాలతో బలమైన యూనియన్‌తో కేంద్రీకృత భారత్ రాజ్యాంగబద్ధంగా అవతరించింది. ఆ తప్పుల్ని సరిచేయాల్సిన స్వతంత్ర భారత పాలకులు వాటినే కొనసాగిస్తూ విధానపరంగా అవగాహనా రాహిత్యంతో, ముందుచూపు లేకుండా వ్యవహరించటంతో అవి జడలు పరచుకుని గుదిబండలుగా మారాయి. ఒకప్పుడు పౌరుషంతో బతికిన ప్రజలు క్రమంగా చేయి జాచి యాచించేవారుగా తయారయ్యారు. ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా ఉంటూ ఆత్మగౌరవంతో, పన్నులకు తగ్గ పౌర సేవల్ని హుందాగా అందుకోవాల్సిన ప్రజలు ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం ద్వితీయ శ్రేణి పౌరుల్లా బిక్కుబిక్కుమంటూ అర్థిస్తున్నారు. దేశ విభజన గాయాల నేపథ్యంలో ప్రజల మధ్య సామరస్యం ఒక సవాలుగానే కొనసాగుతోంది. పొరుగు దేశం కూడా బెడదగా మారటంతో వైవిధ్య భారతంలో వైరుధ్యాలు బలంగానే కొనసాగుతున్నాయి. మన సామాజిక సంస్కృతిలో పరమత సహనం ప్రాచీన కాలం నుండీ భాగంగా వస్తున్నా, రాజకీయ పార్టీలు రెచ్చగొడితే సొంత ప్రయోజనాన్ని, జాతి హితాన్ని కూడా మర్చిపోయి పావులుగా మారే ఛాందసం ఇంకా కొనసాగుతూనే ఉంది.

జాతీయోద్యమ ప్రభావం సన్నగిల్లుతూ ఆ తరం నాయకులు కనుమరుగవుతూ ఎప్పుడైతే అధికారమే పరమావధి అనే రాజకీయం ఊపందుకుందో, మన ఎన్నికల వ్యవస్థ స్వతంత్ర భారత పాలకుల వైఫల్యాలకు ఆజ్యం పోసింది. అందరికీ, అన్ని స్థాయిల్లో ఓటు హక్కు ఇచ్చి మన రాజ్యాంగ నిర్మాతలేమైనా పొరపాటు చేశారా అని ఆలోచనాపరులు, దేశభక్తిపరులు చింతించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. లౌకికవాదమంటే మైనారిటీలకు తాయిలాల్ని ఇవ్వటం, వారిని వేరు చేసి ప్రత్యేక వర్గమన్నట్లు చూడటం, ఎన్నికలంటే ప్రజలను ప్రలోభపెట్టటం, ఉచితాల్ని, ఇతర తాత్కాలిక ఉపశమనాల్ని ప్రకటించటం, నేతలు, ప్రభుత్వోద్యోగులు అంటే పని చేసినా చేయకున్నా జీతభత్యాలు, లంచాల ఆదాయం, ఆధిపత్యం, రాజకీయం అంటే రాచరికం, పెత్తనం, అక్రమార్జన అనే ధోరణులు పెచ్చరిల్లిపోయాయి. దేశ సమగ్రతను కాపాడుకోవటంతోపాటు దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ వచ్చిన కొన్ని మంచి మార్పులు కూడా ఈ సవాళ్లను పరిష్కరించలేకపోయాయి, లేదా ఈ చట్రంలో రాజీ పడిపోయాయి. ఈ చట్రంలో ఉక్కిరిబిక్కిరి అయిన యువత పాలనా వ్యవస్థ మీద రగిలిపోవటం వల్లే 1975లో ప్రధాని ఇందిరాగాంధీకి తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సవాలుకు నిర్మాణాత్మకంగా స్పందించకుండా, ఆమె ఎమర్జెన్సీని విధించారు. ఆ తర్వాత ఎన్నికల్లో జనతా ప్రభుత్వం ఏర్పడింది, మొదటిసారిగా కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి సవాలు ఎదురై ఇతర పార్టీల ఉనికి జాతీయ రాజకీయంలో మొదలైంది.

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించిన శక్తులు, జనతా ప్రభుత్వంలోని పార్టీలు, నేతలు కూడా ఇందిరలాగే దేశంలోని మౌలిక సంక్షోభాన్ని గుర్తించి పరిష్కారాన్ని అన్వేషించకుండా కేవలం ఆమెను గద్దె దించటం చుట్టూనే కేంద్రీకరించటంతో జనతా ప్రయోగం విఫలమై మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. ఆరోజు గనక ఆ దిద్దుబాటు జరిగి ఉంటే డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రజాస్వామ్య పీఠాన్ని (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తాను ప్రారంభించాల్సి వచ్చేది కాదేమో. ఏదోక కెరీర్‌లో హాయిగా గడిపేవారేమో.

అప్పటికే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కూడా దెబ్బతీసిన ఇందిరాగాంధీ, ఎమర్జెన్సీ అనంతర విజయం తర్వాత సైతం పెద్దగా పంథా మార్చుకోకపోవటంతో కేంద్రీకృత పాలనా సంక్షోభం మరింత తీవ్రతరమై ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం రూపంలో ప్రజలు ఉపశమనం వెతుకున్నారు. ప్రాంతీయ పార్టీల ధాటికి రాష్ట్రాలకు అధికారాలను బదిలీ చేయటం, ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా రాష్ట్ర ప్రభుత్వాలను గౌరవించటం యూనియన్ ప్రభుత్వానికి తప్పనిసరి అయింది. ఇలా ఫెడరలిజం బలపడినప్పటికీ.. పాలనలో, పార్టీలో కాంగ్రెస్ అవలక్షణాలు కూడా రాష్ట్రాలకు బదిలీ అయ్యాయి.

కేంద్రీకృత పాలన, ప్రజలను బిచ్చగాళ్లుగా కొనసాగించటం, దేశ సామర్థ్యానికి తగ్గ మార్పులు తేకుండా చిన్న చిన్న మార్పులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల జోక్యం, పార్టీల్ని సొంత ఆస్తిగా భావించటం వంటి వన్నీ కాంగ్రెస్ పార్టీ తరహాలోనే ప్రాంతీయ పార్టీల్లోనూ, వాటి జమానాల్లోనూ కొనసాగుతూ వచ్చాయి. నేతల పెత్తనం, దోపిడీ అధికమై ఏ పార్టీ వచ్చినా సరైన పాలన కొరవడటంతో రాజకీయం పట్ల కసి పెంచుకున్న ప్రజల నుండి ఓట్లు పొందేందుకు రాజకీయ పార్టీలు ప్రతి ఎన్నికకూ కొత్త ఎత్తుగడతో ప్రజలను ఆకర్షించే వికృత పద్ధతులను అవలంబిస్తూ వచ్చాయి. ఉచితాలు, తాత్కాలిక పథకాలు, వీటికి అదనంగా ప్రజల మధ్య విభజనలకు వ్యూహాలను అమలు చేశాయి. ఈ నేపథ్యం నుండే ప్రజాస్వామ్య పీఠం 1996లో ఆవిర్భవించింది. ఎఫ్‌డీఆర్ నుండి 1997, ఆగస్టు 3న లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ సంస్థ ఏర్పడింది.

ఎమర్జెన్సీకి దారితీసిన పరిస్థితుల నేపథ్యంలో 1973 నుండి

దేశం గురించి ఆలోచించటం మొదలుపెట్టిన యువ జయప్రకాష్ నారాయణ్ జనతా ప్రయోగం విఫలమవటంతో నిరాశ చెందారు. మార్పు కోసం తన వంతు ప్రయత్నంపై మథనం చెందారు. ఐఏఎస్ అయితే ఈ లక్ష్యసాధనకు ఉపయోగపడుతుందనే భావంతో ఎంబీబీఎస్ పూర్తయ్యాక సివిల్స్‌కు ప్రిపేరయ్యారు. ఐఏఎస్ కావాలన్న లక్ష్యం నెరవేరినా, దేశాన్ని మౌలికంగా మార్చాలనే లక్ష్యం నెరవేరటానికి అది సరిపోదని జేపీ తొలినాళ్లలోనే గుర్తించారు. అందుకే, ఓ అధికారిగా స్వతంత్ర భారత చరిత్రలోనే అసాధారణ సేవలనందించినా ఐఏఎస్‌పదవికి రాజీనామా చేసి ఎఫ్‌డీఆర్‌ని, లోక్‌సత్తాని స్థాపించారు. అప్పటిదాకా స్వచ్ఛంద సంస్థ అంటే ప్రజలకు కొన్ని రంగాలలో సేవల్ని, వసతుల్ని కల్పించటానికి పరిమితమవటం పరిపాటిగా ఉండేది. కానీ అన్ని సమస్యలకూ ప్రధాన పరిష్కారం కాగల రాజకీయ, పాలనా రంగాల్ని ప్రక్షాళన చేయటానికి లోక్‌సత్తా నడుం బిగించింది.

భారతదేశాన్ని, ప్రపంచ దేశాల అనుభవాలనూ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తన రాజకీయ పరిశీలనల్ని, అధికారిగా క్షేత్రస్థాయి అనుభవాల్ని మదించి లోక్‌సత్తా భావజాలాన్ని సమగ్రంగా జేపీ రూపొందించారు.



దేశంలో పాలన, రాజకీయ, ఆర్థిక రంగాల్లో సమూల మార్పులను, వాటికి రోడ్‌మ్యాప్‌ను ప్రజలు, రాజకీయ వ్యవస్థ ముందుంచారు. ఇంటర్‌నెట్, టెలిఫోన్ సౌకర్యం కూడా సరిగా అందుబాటులో లేని కాలంలో ఎంతో ప్రయాసతో సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేస్తూ.. కొత్త సూత్రీకరణల్ని, పదాల్ని, పదబంధాల్ని రూపొందించారు. మన ప్రజాస్వామ్యం ఎక్కడ విఫలమవుతోంది, రాజకీయంలో ఎక్కడ లోపముంది, పాలనలో ప్రాథమ్యాలు ఎక్కడ తప్పాయి, ప్రాథమ్యాలలో కూడా విధానాల రూపకల్పనలో ఎలాంటి తప్పిదం జరుగుతోంది, ఆచరణసాధ్య పరిష్కారాలేంటి.. అన్నీ సవివరంగా జేపీ తెలియచెప్పారు. దేశంలోని దాదాపు ప్రామాణిక ఆలోచనాపరులందరితో జేపీ సమావేశమయ్యారు. ఆలోచనలను పంచుకున్నారు.

ప్రజాస్వామ్యంలో రాజ్యం పాత్ర ఏమిటి, ఎంతవరకు పరిమితం, పౌరులకు ఎలాంటి అంశాలను వదిలేయాలి అనే అంశాలను ఈ క్రమంలో జేపీ స్పష్టంగా వివరించారు. ప్రజలను ప్రభుత్వం మీద, మరొకరి మీద ఆధారపడేవారుగా తయారుచేయకుండా, వారిచ్చే పన్నుల డబ్బును వారిలోని శక్తిని వెలికితీసి స్వతంత్ర జీవనం గడిపేవారిగా మార్చటానికి, వారికి నూతన అవకాశాలను కల్పించటానికి వినియోగించటం రాజ్యం చేయాల్సిన పని అని స్పష్టం చేశారు. అందుకే ఉద్యమం పేరు కూడా 'లోక్‌సత్తా' అని పెట్టారు.

మన దేశంలో సోషలిజానికి పిచ్చి నిర్వచనం ఇచ్చి విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వకుండా, లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యాన్ని నెలకొల్పి ఎన్ని కోట్ల జీవితాల్ని నష్టపరిచామో ఈ నేపథ్యంలో జేపీ సవివరంగా తెలియచెప్పారు. ఆర్థిక అసమానతల్ని బూచిగా చూపి సమానావకాశాలను అందించటంలో రాజకీయం, రాజ్య వ్యవస్థ విఫలమవటాన్ని హేతుబద్ధంగా సాక్ష్యాధారాలతో వివరించారు. ప్రభుత్వానికి, చట్టసభ సభ్యులకు అధికారాల విభజన లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో, స్థానిక ప్రభుత్వాల్లో ఎమ్మెల్యేల జోక్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత లేకుండా మూడో అంచె ఫెడరలిజాన్ని, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కటం, పార్టీలు సొంత ఆస్తులుగా మారటం మొదలైనవన్నీ చర్చకు తెచ్చారు. ఈ సమస్యలన్నిటికీ భారతదేశ పరిస్థితుల నేపథ్యంలో అత్యుత్తమ పరిష్కారాలను అందించారు. ఇవన్నీ హేతుబద్ధమైనవి, ఆచరణసాధ్యమైనవి.

సంక్షోభం, తర్కం, పరిష్కారం స్పష్టంగా ఉన్న నేపథ్యంలో ఈ మార్పులన్నీ అమలు చేయటానికి 5 ఏళ్ల సమయం చాలని జేపీ అంచనా వేశారు. కానీ పాలకులు, సామాన్య ప్రజలతోపాటు కాస్త ఆలోచించగలిగిన, వనరులున్నవారు కూడా నెమ్మదిగా స్పందిస్తుండటంతో మార్పులు కూడా నెమ్మదిగానే చోటుచేసుకుంటున్నాయి. లోక్‌సత్తాను విస్మరించే పరిస్థితులు లేకపోవటం, సమాజానికి కొంతైనా మంచి చేయాలనే భావం ఇంకా నాయకుల్లో ఉండటంతో పలు కీలక సంస్కరణల్ని, మార్పుల్ని ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండా లోక్‌సత్తా సాధించగలిగింది. ఇందులో మూడు రాజ్యాంగ సవరణలు, ఏడెనిమిది చట్టాలు ఉన్నాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అంతటి కృషిని విజయవంతంగా చేసి ఇన్ని సంస్కరణల్ని సాధించిన సంస్థ ప్రపంచంలో దాదాపు కనిపించదు. పౌరుల చుట్టూ పరిపాలన, అవినీతిరహిత సమాజ స్థాపన, ప్రజల భాగస్వామ్యం, సమానావకాశాల స్వేచ్ఛామార్కెట్, సమన్యాయం తదితర సమూల రాజకీయ, ఆర్థిక, పాలనా మార్పుల కోసం నిరంతరం కృషి చేస్తున్న విశ్వసనీయ రాజకీయ ఉద్యమంగా లోక్‌సత్తా గుర్తింపు తెచ్చుకుంది.

లోక్‌సత్తా ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, మరోపక్క కొత్తతరానికి కొత్త రాజకీయ వేదికగా ఉండటం కోసం గాంధీజయంతి రోజున అక్టోబర్ 2, 2006న లోక్‌సత్తా పార్టీని జేపీ స్థాపించారు. ఒక ప్రత్యామ్నాయ పార్టీగా కాకుండా ప్రత్యామ్నాయ రాజకీయాన్ని నెలకొల్పటం లోక్‌సత్తా లక్ష్యం. స్వతంత్ర భారత రాజకీయాలలో సానుకూల దృక్పథం, ఆధునికత, ఉదార విలువలు, దీర్ఘకాలిక దృష్టి, పార్టీల ప్రజాస్వామికీకరణ, విరాళాల సేకరణలో పారదర్శకత, సమర్థత, నిబద్ధత కలిగిన సామాన్యులు రాజకీయాలలో భాగస్వాములవటం, పార్టీలకతీతంగా దేశం కోసం పనిచేయటం వంటివి వేళ్లూనుకోవటం లోక్‌సత్తా

రాకతోనే మొదలయ్యాయి. తిట్టిపోయటం, ఆధారాలు లేకుండా నిందలు వేయటం, రాస్తారోకోలు, బంద్‌లు, హింస, ప్రజలను రెచ్చగొట్టి విభజనలు తేవటం వంటి వలస కాలపు, పాత కాలపు రాజకీయం లేకుండా వాస్తవాలు, హేతుబద్ధత, పరస్పర విరుద్ధ ప్రయోజనాలను కూడా సమన్వయం చేయటం వంటి పద్ధతుల్లో బహిరంగ చర్చ ప్రమాణాలను లోక్‌సత్తా పార్టీ పాటించింది, ఒక సానుకూల, నూతన రాజకీయ సంస్కృతికి నాంది పలికింది.

దేశంలో గత 25 ఏళ్లలో వచ్చిన పలు మౌలిక, దీర్ఘకాలిక సంస్కరణలు, మార్పులు ఎఫ్‌డీఆర్ - లోక్‌సత్తా కృషి వల్ల వచ్చినవే.

**ఒక రాజకీయ ఉద్యమ సంస్థగా, పార్టీగా లోక్‌సత్తా సాధించిన విజయాల్లో కొన్ని కీలకమయినవి:**

- పౌర సేవల పత్రం ఆవిష్కరణ, పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టటం
- ఓటర్ల జాబితాల ప్రక్షాళన
- అభ్యర్థుల నేరచరితని, ఇతర వివరాలని ప్రకటించే చట్టం (2003)
- పార్టీల విరాళాలలో పారదర్శకతని తెచ్చే చట్టం (2003)
- పరోక్ష పన్నుల (సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్) సేకరణలో కీలక సవరణలు
- పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేసే రాజ్యాంగ సవరణ (91వ సవరణ)
- మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాట్లు (91వ సవరణ - 2003)
- పాలనా సమాచార హక్కు చట్టం (2005)
- జాతీయ ఆరోగ్య మిషన్ (2005)
- స్థానిక న్యాయాలయాల చట్టం (2009)
- సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ - 2012)
- 2 జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దు - సహజ వనరుల వేలం పాట విధానం (2013)
- రైతులకు ఆదాయం పెరిగేలా ఆహార ధాన్యాల ఎగుమతులపై ఆంక్షల తొలగింపు (2011)
- లోక్‌పాల్ చట్టం (2014)
- ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ - 99వ రాజ్యాంగ సవరణ - 2014).
- ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల్ని అందించే సర్వీస్ గ్యారంటీకి చట్టబద్ధ ఏర్పాట్లను కొన్ని రాష్ట్రాల్లో సాధించటం ✦ స్థానిక ప్రభుత్వాలకి నిధుల కేటాయింపుని గణనీయంగా పెంచేలా చేయటం

**వీటితోపాటు..**

- 2020లో కస్తూరి రంగన్ కమిటీ నివేదికతో వచ్చిన జాతీయ నూతన విద్యావిధానం రూపకల్పనలో లోక్‌సత్తా చొరవ, కృషి ఉన్నాయి.
- లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా వాదిస్తున్న వ్యవసాయ, కార్మిక సంస్కరణల్లో కొన్ని 2020లో అమల్లోకి వచ్చాయి. వ్యవసాయ రంగంలో రైతుకు సంకెళ్లు తెంచి ఆదాయాన్ని పెంచే స్వేచ్ఛామార్కెట్‌కు చట్టబద్ధంగా అవకాశం కల్పించారు. కానీ రాజకీయ కారణాలతో ఆ సాగు చట్టాలను రద్దు చేయటంతో మార్పు వాయిదా పడింది.
- 2020, 2021లో ధనరాజకీయాలు-ఎన్నికల సంస్కరణలు, చట్టబద్ధపాలనపై నిష్ణాతులు, విశేషానుభవజ్ఞులు, రాజకీయ నేతలు తదితరులతో జాతీయ సదస్సుల్ని నిర్వహించి హైదరాబాద్ డిక్లరేషన్ ద్వారా తక్షణ ఆచరణసాధ్య మౌలిక మార్పుల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. వీటిలో కొన్నిటి అమలుకు యూనియన్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది.
- లోక్‌సత్తా చొరవతో రూపొందిన ప్రత్యామ్నాయ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభుత్వ పరిశీలనలో ఉంది.
- కొవిడ్ కాలంలో నిర్ధారణ, చికిత్సలు, పరిశోధనలు, వ్యాక్సిన్లు, విధానాల రూపకల్పన, ఆర్థిక ప్యాకేజీలు, ఉపాధితో కూడిన ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై ప్రభుత్వాలకు ఎప్పటికప్పుడు సలహాసూచనలను ఇవ్వటంతోపాటు.. ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని ఎటువంటి జేబుఖర్చు లేకుండా ఆచరణసాధ్యంగా అందించే సమగ్ర ఆరోగ్య విధానం నమూనాని 2021లో రూపొందించి యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, పౌర సమాజం, నిపుణులకు అందించి అమలు కోసం లోక్‌సత్తా కృషి చేస్తోంది.

పైకి కనిపించకుండా లోక్‌సత్తా చేసే కృషి వీటికి అదనం. పలు చట్ట నమూనాల్ని, నిర్మాణాత్మక సూచనల్ని పార్లమెంటరీ కమిటీలు, ఇతరత్రా మార్గాల ద్వారా ప్రభుత్వాలకు, రాజకీయ పక్షాలకు జేపీ అందచేస్తుంటారు.

ఒక శాంతియుత, ప్రజాస్వామ్య భావవిప్లవం ఏ ఆర్భాటం లేకుండా, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా వివిధ రూపాలలో పోరాడుతూ, ఏ అధికారం లేకుండా ఇన్ని విజయాలను సాధించటం ప్రపంచ చరిత్రలోనే అరుదు. అంతిమంగా, అవగాహన కలిగిన పౌరులే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్ష కాబట్టి.. ఒకపక్క ప్రజల్లో అవగాహన పెంచుతూ, మరోపక్క ప్రభుత్వాలను స్పందింపచేసేందుకు లోక్‌సత్తా కృషి చేస్తుంటుంది.

అమెరికా, బ్రిటన్, సింగపూర్, చైనా వంటి దేశాలలో సంస్కరణలు మంచి మార్పుల్ని తెచ్చినా, ఎన్నో మతాలు, కులాలు, భాషలు, తెగలు ఉన్న భారతదేశంలో ఆ సంస్కరణల్ని తీసుకురావటం మరేదేశంలోనూ లేనంత కష్టమైన పని. అయినా పెద్దసంఖ్యలో యువత, మునుపెన్నడూ లేనంతస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం, మార్పు రావాలన్న అంతర్లీన తపన ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ప్రజలలో పెరగటం వల్ల ఇది ఎంత కష్టమైనా కూడా పూర్తిగా ఆచరణసాధ్యమని ఆ మహాకార్యాన్ని లోక్‌సత్తా చేపట్టింది. ఈవేళ అందరూ ఏదోకస్థాయిలో లోక్‌సత్తా భాష మాట్లాడుతున్నారు. 'ఆప్' వంటి పార్టీలు లోక్‌సత్తా స్ఫూర్తితోనే వచ్చాయి. ఈ నేపథ్యంలోనే 'బహుశా భారతదేశం

లోనే అత్యంత విజ్ఞుడైన మేధావి జేపీ' అని రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో టీవీ చర్చలో స్వరాజ్ ఇండియా పార్టీ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. భారతదేశం గురించి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల స్థాయిల్లో సైతం నెలకొన్న గందరగోళాన్ని చూస్తే.. భారతదేశంలోని సమస్యలు, పరిష్కారాల గురించి బహుశా ప్రపంచంలోనే అత్యంత లోతైన పరిజ్ఞానం గల క్రియాశీల విజ్ఞుడు కూడా జేపీ అనుకోవచ్చేమో.

**అమృత మహోత్సవ స్వతంత్ర భారతానికి సరైన రోడ్‌మ్యాప్ లోక్‌సత్తా ఎజెండా**

స్వతంత్రం వచ్చి 75 ఏళ్లయినా 80 శాతం మంది ప్రజలకు పనికొచ్చే, ఉపాధిని, స్వావలంబనను ఇచ్చే చదువు, సరైన ఆరోగ్య వ్యవస్థ లేకపోవటం, పోలీస్ స్టేషన్‌కి వెళ్లి మాట్లాడే స్థయిర్యం లేకపోవటం, మహిళలకు భద్రత లేకపోవటం, మంచినీరు, మురుగునీటి పారుదల వ్యవస్థలు లేకపోవటం, లంచాలు, అవమానాలు, సిఫార్సులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పొందే అవకాశం లేకపోవటం చూస్తే, మనం నిజమైన ప్రజాస్వామ్యానికి, కనీస సుపరిపాలనకు ఎంత దూరంలో ఉన్నామో అర్థమవుతుంది. లోక్‌సత్తా ప్రతిపాదిస్తు న్నట్లు ప్రభుత్వం తన పాత్రను గుర్తించి, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, నైపుణ్యాలను, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అందించాలి.

మన పాలనా సామర్థ్యం, ప్రజలకు నాణ్యమైన సేవలందించే శక్తి ఎంత పేలవంగా ఉందో కొవిడ్ సమయంలో చూశాం. పౌరులు కేంద్రంగా పనిచేసేలా పాలనా యంత్రాంగాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, సిఫార్సులు లేకుండా ప్రజలకు హక్కుగా సేవలను అందించాలి. రోజువారీ సేవలపై రాష్ట్ర, యూనియన్ ప్రభుత్వాల పెత్తనం, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేల జోక్యం లేకుండా స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనమున్న సాధికారతను కల్పించాలి.

అలాగే ఎన్నికల్లో చట్టవిరుద్ధంగా కోట్లు గుమ్మరించి ఓట్లు కొనటం, అప్పులు చేసి మరీ తాయిలాల్ని పంచటం, రకరకాల ఉచితాల పథకాలు ప్రకటించటం, సోషల్ మీడియాను కూడా ఉపయోగించి విభజనల్ని రెచ్చగొట్టటం ఈవేళ దేశంలో సాధారణ వ్యూహమైపోయింది. ప్రతి ఎన్నికకూ కొత్త తరహా ఉచితాన్ని, ప్రలోభ పథకాల్ని ప్రకటిస్తున్నారు. ఈ రకమైన ఎత్తుగడలతో గెలిపించటానికి ఎన్నికల వ్యూహకర్తలు కూడా వచ్చి చేరారు. మన ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల్లో ఓటుకు, నిరసన ప్రదర్శనలకు మాత్రమే పరిమితమైనట్లు స్పష్టంగా అర్థమవుతుంది. రాజకీయ పార్టీగా లోక్‌సత్తా పట్ల ప్రజల్లో 30-40 శాతం ఆదరణ ఉన్నా, అది ఓట్లుగా మారకపోవటానికి మన ఎన్నికల వ్యవస్థ ప్రధాన కారణం. మొదటి రెండు పార్టీల్లో లేకపోతే, మూడో పార్టీగా ఉంటే ప్రజల ఓటు పొందటం మన దేశం ఉన్న పరిస్థితుల్లో దాదాపు అసాధ్యం. ఢిల్లీలాగా కొన్ని ప్రత్యేక పరిస్థితులు కలిసొస్తే తప్ప కొత్త రాజకీయం నిలదొక్కుకోవటానికి మన ఎన్నికల వ్యవస్థ అవరోధంగా ఉంది. ఇందుకు పాలనాపరంగా దేశం భారీ మూల్యం చెల్లిస్తోంది. ఈ సంక్షోభాన్ని సరిదిద్దేందుకు, సమర్థులు, నిజాయతీపరులు చట్టసభల్లోకి వెళ్లేందుకు లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్నట్లు ప్రస్తుతమున్న ఎన్నికల వ్యవస్థను మార్చి ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించాలి, దామాషా పద్ధతిని ప్రవేశపెట్టాలి. పార్టీల్ని సొంత ఆస్తులుగా మార్చకుండా, వ్యక్తుల చుట్టూ తిప్పకుండా ప్రజాస్వామీకరించాలి. ఈ మార్పులు లేకుండా అణగారిన వర్గాలకు ప్రతీకలుగా కొందరిని పదవుల్లో కూర్చోపెడితే వారు సాంప్రదాయ ధన రాజకీయవేత్తలను అనుకరించేవారుగా తయారవటం తప్ప ఆయా వర్గాలకు, సామాన్యులకు ఎటువంటి ప్రయోజనం ఉండదు.

దేశంలో నిరుద్యోగం, ప్రచ్ఛన్న నిరుద్యోగం తీవ్రంగా ఉంది. 'అగ్నిపథ్' ఆందోళనలు ఇందుకు తాజా నిదర్శనం. ప్రస్తుతం ఉన్నత పాఠశాల విద్యకు పైన చదువుకున్నవారిలో నిరుద్యోగం 9.1% ఉండగా, 15-29 సంవత్సరాల మధ్య యువతలో 12.9% ఉంది. నిరుద్యోగం కాస్త తగ్గుతుందనుకుంటున్న సందర్భాల్లోనూ తక్కువ ఆదాయం ఉన్న ఉద్యోగాలలో సర్దుకుపోవటం తప్ప నాణ్యమైన ఉపాధి లభించటం లేదు. అందువల్ల రిజర్వేషన్లు, ప్రభుత్వోద్యోగాల రిక్రూట్‌మెంట్ ప్రకటనలతో మభ్యపెట్టకుండా వేగంగా మౌలిక సదుపాయాలను కల్పించి చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి గ్రామీణ-పట్టణ ప్రాంత అంతరాన్ని తగ్గించాలి, వ్యవసాయాన్ని లాభసాటి చేయాలి, వైవిధ్య అవసరాల్ని ఎప్పటికప్పుడు వెలికితీస్తూ ఉపాధి అవకాశాల్ని పెంచాలి.

నేర పరిశోధనను రాజకీయం నుండి వేరు చేసి చట్టబద్ధపాలనను పటిష్ఠం చేయాలి. సమర్థులు నిజాయతీపరులు న్యాయవ్యవస్థలోకి వచ్చేందుకు ఐఏఎస్ తరహాలో ఇండియన్ జ్యుడీషియరీ సర్వీస్‌ను ప్రవేశపెట్టటంతోపాటు హైకోర్టులు, సుప్రీంకోర్టుల్లో జడ్జీల నియామకానికి జాతీయ జ్యుడీషియల్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని ఏర్పాటు చేయాలి. లోక్‌సత్తా చొరవతో ఎన్‌జేఏసీ రాజ్యాంగ సవరణకు పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలూ ఆమోదించినా సుప్రీంకోర్టు కొట్టివేసి సమస్యలో భాగమైంది. ఈ వైఫల్యాన్ని సరిదిద్దాలి. న్యాయవ్యవస్థ జవాబుదారీతనానికి ఏర్పాట్లు చేయాలి. ప్రజలకు సత్వర న్యాయంతోపాటు మహిళల భద్రతకు ఉపయోగపడేందుకు స్థానిక కోర్టుల్ని గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వం వ్యాపారం చేయకుండా ఈ రకమైన మౌలిక

బాధ్యతలకు పరిమితమై వ్యవసాయం సహా అన్ని రంగాల్లో స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణల్ని గుత్తాధిపత్యానికి ఆస్కారం లేని రీతిలో చేపట్టాలి. తొంభై శాతం అసంఘటితంగా ఉన్న ఉపాధి రంగాన్ని సంఘటిత రంగంగా మార్చేందుకు అవసరమైన కార్మిక సంస్కరణల్ని అమలు చేయాలి.

ఇంతమేరయినా మార్పుల్ని చేపడితే అత్యాధునిక సాంకేతికత, యువ జనాభా మనకు వరమవుతాయి, 2047 నాటికి భారత్ చైనాకు దీటుగా ఎదగగలుగుతుంది. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ లక్ష్యాల సాధనలో భాగమవటంతోపాటు యువతను థాట్ లీడర్స్‌గా తయారుచేసే కృషిని కొనసాగిస్తుంటాయి.

## పరమత సహనం ఒక పరిధిలోనే

భారతీయులుగా ఉండటమంటే హిందువులుగా ఉండటమేనని మన దేశంలో 64% మంది 2021లో 'ప్యూ రీసెర్చి సెంటర్' సంస్థ జరిపిన సర్వేలో చెప్పారు. నూటికి 87 మంది మతాంతర వివాహాల పట్ల వ్యతిరేకతను వెల్లడించారు. 67 శాతం మంది హిందువులు తమ అమ్మాయిలు ఇతర మతాలవారిని వివాహం చేసుకోకూడదని బలంగా భావిస్తున్నారు. ముస్లింలలో 80 శాతం, కాలేజీ గ్రాడ్యుయేట్లలో 54 శాతం కూడా ఇలాగే భావిస్తున్నారు. తమ మగపిల్లల విషయంలో మతాంతర వివాహాల్ని వ్యతిరేకించే హిందువులు 65 శాతం దాకా ఉన్నారు. కానీ ఇదే సమయంలో.. ఇతర మతాలకు స్వేచ్ఛ, పరమత సహనం ఉండాలని దేశంలోని అన్ని మతాలవారూ ముక్తకంఠంతో చెప్పారు. మతపరమైన పట్టింపు.. మతాన్ని రాజకీయంతో ముడిపెట్టే ఓ రాజకీయ భావజాలాన్ని సమర్థించే ప్రజల్లో మరింత ఎక్కువగా ఉన్నదని వెల్లడైంది.

## ఆరోగ్యంలో ఘోర వైఫల్యం వల్ల కొనసాగుతున్న పేదరికం

అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కానీ మన దేశంలో ఏటా కోట్ల మంది పేదలుగా మారటానికి ఆరోగ్య రంగంలో వైఫల్యం ప్రధాన కారణంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనే 45 లక్షల మంది పేదలవుతున్నారు. దేశ ఆరోగ్య రంగంలో 60 శాతానికి పైగా మౌలిక వసతులు ప్రయివేటు రంగంలో ఉన్నాయి. ఆరోగ్యం కోసం ప్రజలు సొంతంగా చేసే ఖర్చు 65-70% ఉంది. అదే ఫ్రాన్స్‌లో కేవలం 9%. సరైన ఆరోగ్య వ్యవస్థ ఉండటం వల్లే.. కొవిడ్ మన కంటే ఎక్కువ ఉధృతితో వచ్చినా ఫ్రాన్స్ సమర్థంగా ఎదుర్కొంది. కేవలం అధ్వాన్న ఆరోగ్య వ్యవస్థ వల్లే మన దేశంలో లక్షల మంది అకాల మరణం పాలయ్యారు. మనలో చాలామంది ఆరోగ్యం కోసం అప్పుల పాలవటమో, డబ్బు ఖర్చు చేసే స్తోమతు లేక లేదా డబ్బు ఖర్చు చేసినా కూడా ప్రాథమిక దశలో సరైన చికిత్స లేకపోవటం వల్ల అకాల మరణం పాలవటమో, ప్రభుత్వ అరకొర స్కీములతో అనారోగ్యంతో, తగ్గిన ఉత్పాదక శక్తితో నెట్టుకురావటమో చేస్తున్నారు.

## మహిళల్ని ఉపాధికి కూడా దూరం చేస్తున్న చట్టబద్ధపాలన వైఫల్యం

ఉపాధిలో మహిళల వాటా మన దేశంలో 20% లోపే. మన చుట్టుపక్కల పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మలేషియా మొదలైన దేశాల్లో కంటే గణనీయంగా తక్కువ. మహిళలు బయట ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నించకపోవటానికి ప్రధాన కారణాల్లో చట్టబద్ధపాలన వైఫల్యం ఒకటి. కేవలం భద్రతా కారణాలరీత్యానే.. విద్య, ఉపాధి కోసం మహిళలు ఇతర ప్రాంతాలకు వెళ్లటం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. చట్టబద్ధపాలనలో భాగమైన నిష్పాక్షిక నేర పరిశోధన, సత్వర న్యాయం డబ్బు, పలుకుబడి ఉన్నవారికి తప్ప సామాన్యులకు వర్తించని పరిస్థితి. చట్టబద్ధపాలన ప్రభుత్వ మౌలిక బాధ్యతల్లో ఒకటి. కానీ సమాజంలోని కుటుంబ విలువలు వంటి బలాలతో తప్ప ప్రభుత్వం చట్టబద్ధపాలన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తుండటం వల్ల మన దేశంలో ప్రజలకు భద్రత, మెరుగైన ఆదాయ అవకాశాలు లభించటం లేదు. ప్రజల్లో అత్యధికులు పోలీసులు, కోర్టులు అంటే భయంతో దూరంగా పారిపోతుంటారు. పేదలకు న్యాయం జరిగే పరిస్థితులు కొరవడటం వల్ల సమాజంలో దిగువన ఉన్న 30% మంది ప్రజలకు వ్యవస్థ పట్ల నమ్మకం సడలిపోతోందని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆధ్వర్యంలో చట్టబద్ధపాలనపై 2021లో జరిగిన జాతీయ సదస్సును ప్రారంభిస్తూ సుప్రసిద్ధ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్ వెంకటాచలయ్య హెచ్చరించారు. పోలీసుల పట్ల ప్రజల్లో భయం, అసంతృప్తి ఉండగా.. పోలీసులు తమను తాము బలగాలు అనుకుంటున్నారు తప్ప సేవకులు అనుకోవటం లేదని ఇదే సదస్సులో మాట్లాడిన కామన్వెల్త్ సీనియర్ సలహాదారు మజ దారువాలా కామన్ కాజ్, సీఎస్‌డీఎస్ సర్వే అధ్యయనాలను ఉటంకిస్తూ తెలిపారు. కేవలం 15% ప్రజలు మాత్రమే పోలీసు సేవల్ని ఏదోకరకంగా ఉపయోగించుకుంటున్నారని, మిగతావారు పోలీసు స్టేషన్లకు దూరంగా ఉండాలని, తమ భార్య, కూతురు ఠాణాకు వెళ్లకూడదని కోరుకుంటున్నారన్నారు.

కులం, మతం, వర్గం, మహిళ ప్రాతిపదికన వివక్షలు, రాజకీయ జోక్యం ఆందోళనకర స్థాయిలో కొనసాగుతున్నాయన్నారు. చట్టబద్ధపాలన తమ మౌలిక బాధ్యత అని పోలీసులు అనుకోవటం లేదని తెలిపారు. ఎఫ్ఐఆర్‌ల కోసం లంచం ఇచ్చామని మూడో వంతు ప్రజలు చెప్పారన్నారు. జైళ్లలో ఉన్నవారిలో 66 శాతం విచారణను ఎదుర్కొంటున్నవారే కావటం, న్యాయస్థానాలు ఇచ్చిన కొన్ని కీలక తీర్పుల్లో కూడా నాణ్యత కొరవడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో చట్టబద్ధపాలన వైఫల్యం భారత్‌కు మరింత పెద్ద సవాలుగా మారుతోంది.

## ఎవరి జీవితంలో వారిని హీరోల్ని చేయటం

సాంప్రదాయ అప్రజాస్వామిక ధోరణులు, వలస పాలన ముద్రలు, ఆర్థిక ఆంక్షల నేపథ్యంలో అసంఘటిత రంగ ఉపాధి వల్ల.. కుంగిన ప్రజలు స్వావలంబనతో ఎవరి జీవితంలో వాళ్లే హీరోలుగా బతికేలా చేయటం లోక్‌సత్తా లక్ష్యం. అందుకే ప్రజలను చేయిజాచి అర్థించేవారుగా, ప్రభుత్వం మీద నిరంతరం ఆధారపడేవారుగా తయారుచేసే సాంప్రదాయ రాజకీయానికి ప్రత్యామ్నాయ రాజకీయాన్ని ప్రతిపాదించింది. కులం, డబ్బు, ఇతర ఏ రకమైన వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ తనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకునే అవకాశాల్ని కల్పించటం, నివారించదగ్గ బాధలు లేకుండా చేయటం, ఈ రెంటినీ సాధించటం ద్వారా ప్రతి వ్యక్తీ తన జీవితంలో తలెత్తుకుని ఆత్మవిశ్వాసంతో, సుఖసంతోషాలతో బతికేలా చేయటం లోక్‌సత్తా సంస్కరణల వెనక ప్రధాన స్ఫూర్తి. ఇందుకోసమే వ్యక్తి సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేస్తూ నూతన రాజకీయ, పాలనా సంస్కృతిని లోక్‌సత్తా ప్రతిపాదించింది. 'ప్రజలే ప్రభువులు, పాలకులు, ప్రభుత్వోద్యోగులు సేవకులే' అనే నినాదంతో తమ సాధికారత కోసం అవగాహనతో రాజ్యాంగబద్ధంగా పోరాడే పౌరశక్తిగా ప్రజల్ని తయారుచేస్తూ వారికో వేదికగా దీపస్తంభంలా లోక్‌సత్తా పనిచేస్తోంది. లోక్‌సత్తా భావజాలం ఒక దృక్పథంగా, ఆచరణగా మారితే భారత రాజకీయాలలో, ప్రతి భారతీయుని సామాజిక జీవితంలోనేకాక, వ్యక్తిగత జీవితంలో సైతం సంపూర్ణ విప్లవమే వస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచంలోనే ఉదార డాక్యుమెంట్‌గా పేరొందిన భారత రాజ్యాంగం లక్ష్యాలు, లోక్‌సత్తా లక్ష్యాలూ ఒకటే.

## స్థానిక స్వపరిపాలన లేని బలహీన ప్రజాస్వామ్యం

స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటం వల్ల ప్రజల రోజువారీ సేవలు అధ్వాన్నంగా కొనసాగుతున్నాయి. వేసే ఓటుకు-తమ జీవితానికి మధ్య సంబంధమేమిటో అర్థంకాని సామాన్య ప్రజలు ఎమ్మెల్యే రాజ్‌లో బందీలై పోయారు. దీనివల్ల ప్రజల నుంచి నాయకత్వం ఎదగటం కరువైంది, ఎన్నికల వ్యవస్థ భ్రష్టుపట్టింది. కోట్ల డబ్బును చట్టవిరుద్ధంగా వెదజల్లకుండా ఎన్నికల్లో ఉనికిని చాటు కోవటం కూడా అసాధ్యమైంది. కార్పొరేటర్‌కి, ఎమ్మెల్యేకి, ఎంపీకి తేడా తెలియకుండా ఎక్కువ శాతం ప్రజలు ఓటు వేస్తున్నారు. శాసనాలు చేయాల్సిన సభ్యులు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటంతో ఎవరూ పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకోని ఓ అవ్యవస్థ రాజ్యమేలుతోంది. పౌరులు కేంద్రంగా పాలన సుదూర లక్ష్యంగా మారిపోయింది.

# 5 కోణాల్లో సంస్కరణలు

**ప్రజాస్వామ్యం బలోపేతమై ప్రతి పౌరుడూ సాధికారతతో తలెత్తుకుని బతికేందుకు, ఎదిగేందుకు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ముఖ్యంగా ఐదు కోణాలలో సంస్కరణల కోసం పనిచేస్తున్నాయి:**

**1. వ్యక్తి స్వేచ్ఛ:** వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం. భావ ప్రకటన హక్కు, ఎక్కడైనా నివసించే హక్కు, మత స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ ఇందులో భాగాలు. కానీ ఎదిగేందుకు సమానావకాశాలు కొరవడటంతో వ్యక్తి స్వేచ్ఛ అనేక రూపాలలో పరిమితమైపోతోంది. కొన్ని సందర్భాలలో భావ ప్రకటన స్వేచ్ఛను కూడా అణగదొక్కుతున్నారు.

**2. స్వయంపాలన:** ప్రజాస్వామ్యంలో పౌరులకు తమని తాము ప్రత్యక్షంగా లేదా పరోక్ష ప్రాతినిధ్య పద్ధతిలో పాలించుకునే హక్కు ఉంది. కానీ కేంద్రీకృత పాలన, మన ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం వల్ల ఎన్నికల్లో డబ్బు, కండబలం, కులం, ప్రాంతం, మతం చొరబడి ప్రజలను కేవలం ఓటు వేసే యంత్రాలుగా, పరాధీనులుగా మార్చేశాయి.

**3. ప్రజల భాగస్వామ్యాధికారం:** పాలనలో పౌరులకు నిరంతర భాగస్వామ్యం ఉండాలి. కానీ రెండు ఎన్నికల మధ్య పౌరుల ప్రమేయం లేకుండా నిర్ణయాలు జరుగుతున్నాయి. పాలకులు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఎన్నికలొచ్చే వరకూ ఏం చేయలేక చాలా సందర్భాల్లో పౌరులు నిస్సహాయులవుతున్నారు. పాలన వికృత రూపం దాల్చి ప్రజాస్వామ్య ఫలితాలు ప్రజలకు అందకుండా చేస్తోంది. దీనికి పరిష్కారమైన వికేంద్రీకరణను అణచివేస్తున్నారు.

**4. చట్టబద్ధ పాలన:** ఎంతటి సంపన్నులైనా, ప్రజాప్రతినిధులైనా, ఉన్నతాధికారులైనా చట్టం ముందు సామాన్యుడితో సమానం కావాలి. చట్టం ఎవరికైనా ఒకటే కావాలి. కానీ ప్రస్తుతం డబ్బు, అధికారం, ఉన్నవాడికో న్యాయం, లేనివాడికో న్యాయం నడుస్తోంది.

**5. స్వయందిద్దుబాటు:** రాజ్య వ్యవస్థలో స్వయందిద్దుబాటుకి, స్వయంపరివర్తనకి తగిన వ్యవస్థ ఉండాలి. మన పాలనా వ్యవస్థ భయంకరమైన ఉపద్రవాలు వచ్చినప్పుడు తాత్కాలికంగా స్పందించటం తప్ప, ముందుచూపుని, స్వయంపరివర్తనా శక్తిని కోల్పోయింది.

## వ్యవస్థీకృత మార్పుల కోసం ఉద్యమం

# లోక్‌సత్తాతోనే మొదలైంది

పాతికేళ్ల క్రితం మన రాజకీయ వ్యవస్థని, పాలనని సమూలంగా సంస్కరించి ప్రజాస్వామ్యంలో లొసుగులని ప్రజల భాగస్వామ్యంతో సరిచేయాలని లోక్‌సత్తా ఉద్యమం ఆవిర్భవించింది. వ్యక్తి స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌరులకి పాలనలో భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన, పొరపాట్లని ఎప్పటికప్పుడు సరిచేసే స్వయందిద్దుబాటు పద్ధతులు మూలస్తంభాలుగా మన వ్యవస్థని సరయిన గాడిలో పెట్టటం లోక్‌సత్తా మౌలిక లక్ష్యం. ఓటుకు – ప్రజల పన్నుల డబ్బుకు ఉన్న సంబంధాన్ని తెలియచెప్పి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించే సమగ్ర రాజకీయ, పాలనా సంస్కరణోద్యమం భారతదేశంలో లోక్‌సత్తాతోనే మొదలైంది. చాలామంది సూక్ష్మస్థాయిలో ఆ కృషిని చేసినా మొట్టమొదటి సమూల కృషి లోక్‌సత్తాదే. ప్రజల చుట్టూ తిరిగే వ్యవస్థల నిర్మాణాన్ని లోక్‌సత్తా ఒక ఉద్యమంగా మార్చింది. దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమాలకు, ఎన్నో మౌలిక మార్పులకు నాంది పలికింది. ప్రజాస్వామ్యం పీఠంతో ప్రారంభమైన ప్రయత్నం లోక్‌సత్తాగా రూపుదిద్దుకుని తెలుగునాట, దేశవ్యాప్తంగా, విదేశాలలో కూడా అనేకమందిని ప్రభావితం చేసింది.

లోక్‌సత్తా ఉద్యమం తొలినాటి నుంచి ఒక వినూత్నమయిన, విశిష్టమయిన పంథాని అనుసరించింది. లోక్‌సత్తా ఆవిర్భావం వరకూ రాజకీయాలని ద్వేషించటం, తిరస్కరించటం మధ్యతరగతి వర్గానికి, యువతకి ఆనవాయితీ అయింది. లోక్‌సత్తా ఆ సాంప్రదాయానికి విరుద్ధంగా, నిజమయిన రాజకీయం పవిత్ర వ్యాసంగమని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం, రాజకీయం అవిభాజ్యమని, రాజకీయాన్ని తిరస్కరించటం స్వేచ్ఛకి, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టవుతుందని లోక్‌సత్తా బలంగా వాదించింది. మన రాజకీయంలో ఉన్న లోపాలకి విరుగుడు మరింత మంచి, మరింత ఎక్కువ రాజకీయమేనని, ప్రజల భాగస్వామ్యంతో జనరాజకీయాన్ని సృష్టించటం అత్యవసరమని ఉద్ఘాటించింది. లోక్‌సత్తా అవిశ్రాంతంగా చేసిన ఈ పోరాటం కాలక్రమేణా దేశంలో విద్యావంతులని, మధ్యతరగతిని, యువతని, మీడియాని గణనీయంగా ప్రభావితం చేసింది. ఈ క్రమంలో మన ప్రజాస్వామ్యం దిశను, భాషను గణనీయంగా ప్రభావితం చేసింది లోక్‌సత్తా. గత మూడు దశాబ్దాలుగా ఎన్నడూలేనంతగా గతంలో రాజకీయాన్ని ద్వేషించిన వర్గాలు ఇప్పుడు రాజకీయం విస్మరించరానిదని, ఏదో ఒక రూపంలో నిజాయతీగా రాజకీయాన్ని ప్రభావితం చేయటం అవసరమని గుర్తిస్తున్నాయి.

మనదేశంలో ఉద్యమాలంటే.. అయితే ప్రభుత్వాలని, పార్టీలని తిట్టిపోయటం, లేదా తాత్కాలికంగా జనాకర్షణలని ఎరచూపించి అన్నీ ఉచితంగా ప్రభుత్వం అందించాలని ప్రజలని సమీకరించటం ఆనవాయితీ అయ్యాయి. లోక్‌సత్తా ఉద్యమం ఈ సంప్రదాయానికి భిన్నంగా వాస్తవాలు, సాక్ష్యాలు ఆధారంగా, హేతుబద్ధమయిన వాదనలతో శాస్త్రీయ పరిష్కారాలని, దీర్ఘకాలిక సంస్కరణలని ప్రతిపాదించింది. ప్రజాస్వామ్యంలో పౌరులు పౌరుల్లాగా ప్రవర్తించాలిగానీ పాలితులుగా కాదంటూ కొత్త ధోరణులతో ద్వేషరహితంగా సామరస్య వాతావరణంలో మంచి బహిరంగ చర్చను సమాజం ముందు పెట్టటంలో లోక్‌సత్తా గొప్ప విజయం సాధించింది. పార్టీల పట్ల పక్షపాత ధోరణి

చూపకుండా, ఎన్నికైనవాళ్లంతా ద్రోహులు అన్న నిరాశనిరసన భావాల్ని ప్రదర్శించకుండా రాజ్యాంగ పద్ధతుల ద్వారా, సామరస్యంగా పరిష్కారాల కోసం విశేష కృషి చేయబట్టే ఈ దేశ చరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించింది. ఎన్నో సందర్భాలలో అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి ఎన్నో గణనీయమయిన మార్పులని సులువుగా సాధించింది. ఉదాహరణకి తెహల్కా కుంభకోణం నేపథ్యంలో అన్ని పార్టీలనీ ఒప్పించి నిజాయతీ రాజకీయానికి, ఎన్నికల ప్రచారానికి కావలసిన నిధులని నిజాయతీగా, దాతలకి పన్ను రాయితీలతో సేకరించే సమగ్ర చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది. అమాయక ప్రజల ఓట్లు కొనుగోలు, కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలని రెచ్చగొట్టే ఓటుబ్యాంకు రాజకీయాలు, ప్రజాధనంతో మౌలిక సదుపాయాలని, ఉమ్మడి సేవలని అందించకుండా తాత్కాలిక తాయిలాలతో ఆకర్షించే సంస్కృతి ఉన్న దేశంలో ఎన్నికల నిధుల సంస్కరణలు చాలవు. కానీ నిజాయతీ రాజకీయానికి నిజాయతీ పద్ధతులతో నిధులని సమకూర్చటం మన రాజకీయ ప్రక్షాళనలో ఒక కీలకమయిన ముందడుగు. ఇలా ప్రతి సమస్యకి వాస్తవాలు, తర్కం ఆధారంగా ఆచరణసాధ్యమయిన, జాతి భవిష్యత్తుని పదిలపరిచే దీర్ఘకాల పరిష్కారాలని సూచించటంలోను, దేశప్రజలలోను, రాజకీయ పార్టీలలోను ఏకాభిప్రాయసాధనలోను లోక్‌సత్తా చేసిన కృషి, సాధించిన విజయాలు నిరుపమానమయినవి.

ప్రజాస్వామ్య సమాజంలో రాజకీయం ప్రాధాన్యతని గుర్తించటంలోను, జనజీవనాన్ని ఆటంకపరచకుండా శాంతియుత ఉద్యమాలను రూపొందించటంలోను, హేతుబద్ధమయిన పరిష్కారాలను నిరంతరం జాతి ముందు పెట్టి ఒడుపుగా వాటిని సాధించేందుకు పోరాటం చేయటంలోను లోక్‌సత్తా ఎంతో ముందుచూపుని, వ్యూహపటిమని, ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రదర్శించింది. ఈ పద్ధతులవల్లనే పార్లమెంటులో ఒక్క సభ్యుడు కూడా లేకుండా లోక్‌సత్తా స్వతంత్ర భారతంలో దేశచరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని విజయాలను సునాయాసంగా సాధించగలిగింది. నిజానికి రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలో మరే పౌరసమాజ ఉద్యమమూ శాంతియుతంగా, అధికారం లేకుండా ఇన్ని విజయాలు సాధించలేదు.

గత 25 ఏళ్లలో దేశ రాజకీయాలలో, రాజ్యవ్యవస్థలో కొన్ని మంచి మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. కానీ అవి ఈదేశం సుస్థిర అభివృద్ధికి, అందరికీ ఎదిగే అవకాశాలకు భరోసా ఇచ్చేందుకు చాలవు. కొన్ని రంగాలలో సంక్షోభం మరింత పెరుగుతూ వస్తోంది. ఎన్నికలలో అక్రమ ఖర్చు ఈ రెండు దశాబ్దాలలో పది నుంచి ఇరవై రెట్లు పెరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలలో ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరిగిపోయి, రాజకీయం పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. దాంతో ప్రభుత్వాలు మారినా అధికారాన్ని స్వంత లాభం కోసం దుర్వినియోగం చేయటం, రాజకీయంలో అనారోగ్యకరమయిన పోటీ వల్ల ఓట్లు కొనుగోలు చేయటం, పదవులని కేవలం అక్రమార్జన కోసం మార్గాలుగా భావించటం మరింతగా పెరిగిపోయాయి. ఓటుకి, ఎన్నికయ్యే ప్రభుత్వానికి, ప్రజలకందే నిజమయిన ఫలితాలకి మధ్య సంబంధం తెగిపోవటంతో కుల,మతాల సమీకరణ, ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలని తాకట్టుపెట్టి తాత్కాలిక తాయిలాలు ఆశచూపటం సర్వసాధారణమయిపోయాయి.

లోక్‌సత్తా 25 ఏళ్ల కృషిలో భాగస్వాములైనవారిని అభినందిస్తూ, స్వాతంత్ర్య అమృత మహోత్సవ తరం కూడా ఈ సంస్కరణల ఉద్యమంలో పాలుపంచుకుంటూ తమ జీవితాల్ని, భవిష్యత్తుని సుసంపన్నం చేసుకోవాలని, సమున్నత భారతదేశ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని, చరిత్రకు సరైన పక్షాన నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.


**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**

**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

# పైలా పచ్చీస్

# పాతికేళ్ల లోక్‌సత్తా - కొన్ని మైలురాళ్లు

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్.. తెలుగు రాష్ట్రాలలో ఈ పేరు విననివారుండరు. దేశవ్యాప్తంగా, ఇంకా చెప్పాలంటే ప్రపంచంలోని పలు ప్రధాన దేశాలలో ఆయన సుపరిచితులు. ఒక మెడికల్ డాక్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించి, కేవలం శారీరక వైద్యం కాదు, సామాజిక వైద్యం చేయాలని ఆయన భావించారు. దేశానికి శస్త్రచికిత్స చేయాలంటే సివిల్ సర్వీస్ సరైన వేదిక అని ఎంచుకుని వైద్యం నుంచి సివిల్స్‌కు మళ్లారు. ఐఏఎస్ అధికారిగా సుమారు 17 సంవత్సరాలపాటు మన రాష్ట్రానికి, దాంతోపాటు దేశానికి ఉపయోగపడే చిరస్మరణీయ సేవలను తెలుగునేల నుంచి అందించారు. అయితే ఐఏఎస్‌గా కూడా తాను అనుకున్నదాంట్లో సాధిస్తున్నది కొంతేనని అనుకున్నారు. సమాజ అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిగా ఒక అధికారిగా




కంటే స్వచ్ఛంద రాజకీయ ఉద్యమ సంస్థ ద్వారా ఎక్కువ సేవ చేయవచ్చని భావించారు. 1996లో తన సివిల్ సర్వీస్ పదవికి రాజీనామా సమర్పించారు. ఇళ్ల స్థలం, పెన్షన్ వంటి వేమీ లేకుండా. ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు "ప్రజాస్వామ్య సంక్షోభ పరిష్కారం" అనే మార్గదర్శిని రూపొందించే పనిలో ఉన్నారు. ప్రజాస్వామ్యంలో అనేక సంక్షోభాలు ఉంటాయని, సంక్షోభాలకు పరిష్కారాలు ఉంటాయని సాధికార స్పష్టతతో భావించారు. అలా 1975లో ఎమర్జెన్సీ సమయంలో వైద్య విద్యార్థి జేపీలో మొదలైన మౌలిక మార్పు తపన లోక్‌సత్తా భావజాలంతో సమగ్ర రూపం దాల్చింది.

లోక్‌సత్తా భావజాల పుస్తకం తయారైంది. దాని పేరే "ప్రజాస్వామ్యం – సంక్షోభం – పరిష్కారం". దీన్ని పునాదిగా చేసుకుని 1997 ఆగస్టు 3న హైదరాబాద్ నడిబొడ్డులో నౌబత్ పహాడ్ పైన ఉన్న బిర్లా సైన్స్ సెంటర్ సమావేశ మందిరంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ పురుడు పోసుకుంది.

స్వచ్ఛమైన పాలన కోసం ఆవిర్భవించిన ప్రజాస్వామ్య ఉద్యమంగా లోక్‌సత్తాను ప్రజలు ఆదరించారు. ప్రజాస్వామ్యానికి సమగ్ర అర్థం చెప్పి భారతదేశానికి నూతన దశ, దిశను చూపిన ఉద్యమం ఇది. ప్రజాస్వామ్యంలో ఐదు మూలాలుంటాయని, అవి ఉంటేనే పరిపూర్ణమైన ప్రజాస్వామ్యం అని లోక్‌సత్తా ఉద్యమం విశదీకరిస్తూ చాటింది.


మన ఓటు ద్వారా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి, మన పన్నుల డబ్బు ద్వారా ప్రభుత్వాలు నడుస్తున్నాయి, అందుకే "ప్రజలే ప్రభువులు" అనే నినాదంతో లోక్‌సత్తా ఉద్యమం మొదలైంది. మరొక రకంగా చెప్పాలంటే, ఇది "రెండవ స్వతంత్ర పోరాటం" అని డా॥ జేపీ అభివర్ణించారు.

అందుకు అనుగుణంగానే 1997లో "రెండవ స్వాతంత్ర్య ఉద్యమం" అనే పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది. అలాగే అప్పటి నుండే "జనబలం" అనే మాసపత్రికను లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభించింది. అలా ఉభయ తెలుగు రాష్ట్రాలలో లోక్‌సత్తా నూతన రాజకీయ భావాల ప్రచారోద్యమం ప్రారంభమైంది. ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా లోక్‌సత్తా ప్రజాసంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. అలా ఒక సంవత్సరం పూర్తయింది. కానీ ప్రజలలో కదలిక రావాలంటే కేవలం అవగాహన సదస్సులు, సమావేశాలు మాత్రమే సరిపోవు అని లోక్‌సత్తా ఉద్యమం గ్రహించింది. ప్రజా ఉద్యమ బాట పట్టకుండా అనుకున్న లక్ష్యం వేగంగా సాధ్యం కాదని భావించింది. "ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల" కోసం ప్రజాఉద్యమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసినప్పుడే సుస్థిర ఫలితాలు వస్తాయి.. అని విధానపరమైన స్పష్టతను ప్రకటించింది.

ఇలా ప్రజల్లో అవగాహన పెంచుతూ, ప్రభుత్వాలతో, రాజకీయ వ్యవస్థతో కూర్చుని పనిచేస్తూ బహుముఖ కృషితో సాగుతున్న లోక్‌సత్తా పైలా పచ్చీస్ (తొలి పాతికేళ్ల)లోని కొన్ని మైలురాళ్లు..

## స్వరాజ్యం - పౌర హక్కుల పత్రం

లోక్‌సత్తా ఉద్యమం ఆవిర్భవించిన సంవత్సరం తర్వాత 1998 అక్టోబర్ 2న "స్వరాజ్యం" పేరుతో ప్రజాహక్కుల పత్రాన్ని ప్రచురించారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సీఆర్ రంగరాజన్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూడకుండా అందులోని ప్రజాహక్కులను సాధించటానికి ఉద్యమబాట పట్టింది లోక్‌సత్తా. అందులో భాగంగానే మొట్టమొదటి ప్రజాస్వామ్య ఉద్యమంగా "పెట్రోల్ బంకుల్లో కల్తీ, తూకంలో మోసాలు"పై కార్యాచరణను ప్రకటించింది. ఆనాడు మన రాష్ట్రంలో కేవలం 1500 పెట్రోల్ బంకులు మాత్రమే ఉన్నాయి. జిల్లాకు ఒకటి రెండు చొప్పున లోక్‌సత్తా ప్రజాఉద్యమకారులు తనిఖీ చేశారు. అలాగే హైదరాబాద్‌లో చాలామంది ప్రముఖులతో ఈ ఉద్యమం విస్తృతంగా సాగింది. పౌరులు సంఘటితంగా రాజ్యాంగబద్ధ




ప్రజాస్వామిక క్రమశిక్షణతో అలా ఉద్యమించటం ఒక కొత్తరకమైన ఉద్యమ సంస్కృతికి నాంది పలికింది. అప్పటికప్పుడు ఫలితాలు తేల్చేసే ఉద్యమమది. పెట్రోల్ బంకుల్లో ఉన్న అక్రమాలు ఈ దెబ్బకి బయటపడ్డాయి. పెట్రోల్, డీజిల్ కొలతల్లో మోసం, అందులోనూ కల్తీ జనంలో ఆగ్రహాన్ని కలిగించింది. ప్రభుత్వాన్ని కదలించింది. వెంటనే స్పందించిన తూనికలు కొలతల అధికారులు పెట్రోల్ బంకులపై దాడులు నిర్వహించారు. మోసాలకు పాల్పడుతున్న వాటిని సీజ్ చేశారు. జరిమానాలు విధించారు. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్. అక్రమార్కులు కొంతవరకు తోకముడిచారు. అన్నిటికంటే ఇందులో గుర్తించాల్సిన అంశమేమంటే, పెట్రోల్, డీజిల్‌లో కల్తీ అని ఎలా తెలుసుకోవచ్చు, కొలతల్లో మోసాల్ని ఎలా తెలుసుకోవచ్చు అనే అంశాలు చాలా సులభంగా ప్రజల్లోకి వెళ్లాయి. ప్రజల జేబులను నిశ్శబ్దంగా నిత్యం కొల్లగొట్టే ఓ భారీ దోపిడీని గాంధీ, అంబేద్కర్ వంటి వారు ఆశించిన పద్ధతిలో శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా నిలువరించి దానిపై ప్రజల్లో చైతన్యం పెంచటం ద్వారా లోక్‌సత్తా తొలి పోరాటం పెద్దవిజయం సాధించిందని సగర్వంగా చెప్పుకోవచ్చు. ఆనాడు డిజిటల్ పెట్రోల్ బంకులు కావాలని, ఎలక్ట్రానిక్ మీటర్లు ఉండాలని ఉద్యమించాము. ఇప్పుడు అలాంటి ఆధునిక టెక్నాలజీతోనే పెట్రోల్ బంకులు నడుస్తున్నాయి. కానీ ఇందులో కూడా మీటర్ రీడింగులను తప్పుగా చూపెట్టేలా కంప్యూటర్ చిప్స్‌తో మాయజేసే మోసగాళ్లు తయారయ్యారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో పెట్రోల్ బంకుల్లో మోసాలు మళ్లీ పెచ్చరిల్లుతున్నాయి. పెట్రోల్ బంకుల్లో మోసాలపై మళ్లీ పౌర చైతన్య ఉద్యమం అవసరం.

**ఎన్నికల నిఘా ఉద్యమం - ఉమ్మడి వేదికలు**

ఒక సంవత్సరం పాటు పెట్రోల్ బంకుల్లో మోసాలపై ఉద్యమం సాగింది. ప్రజలకు అందించిన ఆయుధాన్ని వారే ఉపయోగించేలా చేయాలన్నది లోక్‌సత్తా విధానం. ఈలోపు 1999లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. లోక్‌సత్తా లాంటి రాజకీయ ప్రజాఉద్యమాలకు ఇక చెప్పేదేముంది. వెంటనే దానికి తగ్గట్లు ఉద్యమాలను డిజైన్ చేసింది. అప్పటిదాకా ఒక స్వచ్ఛంద సంస్థ అంటే.. రాజకీయాల జోలికి పోకుండా కేవలం మూఢనమ్మకాల మీద, సామాజిక దురాచారాల మీద పోరాడే సంస్థలు, కొన్ని రకాల సేవలను అందించే సంస్థలు మాత్రమే. ఆ అభిప్రాయాన్ని మార్చివేసి రాజకీయాలను మార్చటం కూడా ఒక ఉద్యమమే అని మొట్టమొదటిసారి లోక్‌సత్తా నినదించింది. పార్టీలకు అతీత ఉద్యమ సంస్థగా ఎన్నికల రంగంలోకి పరోక్షంగా దిగింది. భారతదేశంలో మొట్టమొదటిసారి అభ్యర్థులతో ఉమ్మడి వేదికను నిర్వహించింది. "ఎన్నికల నిఘా" అనే పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించింది. ఎన్నికల నిఘా సభ్యులుగా ఏమి చేయవచ్చు, ఏమి చేయకూడదు తదితర విషయాలను పుస్తకంలో స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి వేదిక నిర్వహించడానికి అవసరమైన సూచనలు సలహాలతో మరొక పుస్తకాన్ని కూడా వెలువరించింది. రాజకీయ పార్టీలకు అతీతంగా సంఘాల్లోని పెద్దలు, వివిధ రంగాల్లోని ప్రముఖులను కూడగట్టి ఈ ఉమ్మడి వేదికలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికలలో నామినేషన్ ఉపసంహరణ నుంచి కేవలం 14 రోజులు మాత్రమే అభ్యర్థుల ప్రచారానికి ఉంటుంది. అందులో పోలింగ్ కన్నా ముందు రెండు రోజులు తీసివేస్తే ఇక మిగిలింది పన్నెండు రోజులే. ఆ పన్నెండు రోజులలోనే.. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన 100 మందికిపైగా అసెంబ్లీ అభ్యర్థులను ఉమ్మడి వేదికలను లోక్‌సత్తా నిర్వహించింది. తమకు ఎందుకు ఓటు వేయాలి అన్న విషయాన్ని వివరిస్తూ ప్రజలను ఉమ్మడి వేదిక ద్వారా వారంతా అభ్యర్థించారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తామో చెప్పటానికి రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఆ వేదికలు చాలా చక్కగా ఉపయోగపడ్డాయి. ఊరూరా తిరిగి కృత్రిమ ప్రచారం చేయటానికి బదులు ఒకే చోట విజ్ఞులైన ఓటర్లను కూడగట్టి వారి ముందు తమ పార్టీ ఎజెండా, వ్యక్తిగత ప్రణాళిక కూడా చెప్పుకోవటానికి అభ్యర్థులకు అవకాశం ఇచ్చిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థకి రాజకీయ పార్టీలతోపాటు మీడియా సంస్థలు కూడా సహకరించాయి. మీడియాకి కూడా ఇది ఒక కొత్త ప్రయోగం. అప్పటి దాకా వారి మీద వీరు, వీరి మీద వారు ఆరోపణలు చేసుకుంటే రాసిన పత్రికలు.. చాలా హుందాగా, మర్యాదగా నిర్మాణాత్మక విమర్శలు చేసుకుంటూ, ప్రజలకు ఏం చేస్తామో అభ్యర్థులు వివరించిన ఉమ్మడి వేదికలను ప్రముఖంగా ఆదరించాయి. విస్తృత ప్రచారం కల్పించాయి. మొత్తంగా ఈ ప్రయోగం చాలా సక్సెస్ అయి ఒక ఒరవడి దిద్దింది.

**నేరచరితులు వెల్లడి**

అలాగే నేరచరితుల జాబితా ప్రకటించే చర్య కూడా సాహసోపేతమైనది. అప్పటిదాకా మనకు ఇష్టం ఉన్నా లేకున్నా ముక్కు మూసుకుని ఓటు వేయాల్సి వచ్చేది. కండబలం, డబ్బు, మద్యంతో కూడిన ఎన్నికలను చూశాము. అలాగే ఎంతోమంది నేరచరితులు ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేస్తున్నా నోరు మెదపకుండా వారికి ఓటేసిన సందర్భాలు అనేకం. కానీ అన్ని సాంప్రదాయ పార్టీలలోని నేరచరితులను గుర్తించి వారిని ప్రకటించటం దేశంలో మొట్టమొదటిసారి లోక్‌సత్తా ఉద్యమసంస్థకే సాధ్యమైంది. ఇది ఏదో అల్లాటప్పాగా చేసింది కాదు. శాస్త్రీయంగా, చట్టబద్ధంగా, పకడ్బందీగా వివరాలను సేకరించి, విశ్లేషించి చేసినది. ఇందుకు మీడియావారితోపాటు అధికారికంగా, అనధికారికంగా పలువురు సహకరించారు. పోలీస్ స్టేషన్ల రికార్డులతో మొదలుపెట్టి కోర్టులు ఇచ్చిన తీర్పులను, అలాగే కోర్టుల్లో నలుగుతున్న కేసులను సేకరించి బయటపెట్టిన మొట్టమొదటి బహిరంగ చర్య అది. ఆనాడు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో 45 మంది నేరచరితులు పోటీ చేస్తున్నారని సాక్ష్యాధారాలతో లోక్‌సత్తా ప్రకటించటం తెలుగునాటే



కాకుండా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అందులో ఒక్కరు కూడా తాము నేరచరితులము కాదని, తమ పేరును ఎందుకు ప్రకటించారని లోక్‌సత్తాను ప్రశ్నించలేదు. కేసుల వివరాలు సహా పూర్తి రికార్డులతో వారి నేరచరిత్ర సమాచారాన్ని లోక్‌సత్తా పత్రికలకు విడుదల చేసింది. దాన్ని ఎవరూ ఛాలెంజ్ చేయలేదుగానీ.. ఇంకా కొంతమంది మిగిలిపోయారు, ఆ నేరచరితుల పేర్లను కూడా ప్రకటిస్తే బాగుండేదనే సూచన వచ్చింది. అలాంటి వారి వివరాలను సాక్ష్యాధారాలతో ఇస్తే తప్పక ప్రకటిస్తామని లోక్‌సత్తా వారికి తెలియజేసింది. లోక్‌సత్తా చేసిన ఈ సాహసోపేత ప్రయత్నాన్నే సాక్ష్యంగా చూపుతూ ఏడీఆర్ అనే సంస్థ సుప్రీంకోర్టులో పిల్ వేసింది. ఆ తర్వాత అందులో లోక్‌సత్తా కూడా ఇంప్లీడ్ అవటం, విధిగా నేరచరితులకవివరాల వెల్లడికి చట్టం చేసేలా రాష్ట్రపతి అబ్దుల్ కలాం సాయంతో జేపీ పోరాడటం, చివరికి సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ వివరాల్ని వెల్లడించాలనే చట్టనిబంధన రావటం జరిగింది.

**ఈనాటి 'నోటా' గురించి నాటి బ్యాలెట్ పేపర్ల కాలంలో..**

వివిధ రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు తమకు నచ్చటం లేదని, అలాంటి వారికి ఓటు వేయటం ఇష్టం లేక తాము పోలింగ్ బూత్‌లకు దూరంగా ఉంటున్నామని చెప్పేవారి సంఖ్య మన దేశంలో తక్కువేమీ కాదు. బ్యాలెట్ పేపర్లు ఎక్కువగా ఉపయోగించిన అప్పటి కాలంలో, ఎవరైనా అలా ఓటు వేయకపోతే దొంగ ఓట్లు వేస్తుండేవారు. ఈ నేపథ్యంలో లోక్‌సత్తా ఒక పరిష్కార మార్గాన్ని ప్రతిపాదించింది. అదేమిటంటే, పోలింగ్ బూత్‌కైతే వెళ్లండి, అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఆ బ్యాలెట్ పేపర్ మీద ఎవరికీ వేయకుండా పెన్ను లేదా పెన్సిల్‌తో ఇన్‌టూ గుర్తు పెట్టమని చెప్పింది. అభ్యర్థులు నచ్చలేదని మీరు పోలింగ్ బూత్‌లకు వెళ్లకపోతే మీ ఓటును మీ బదులు వేరొకరు వేసే అవకాశముండటంతోపాటు.. ఓటు హక్కును వినియోగించకపోతే ప్రభుత్వాలను విమర్శించే ప్రజాస్వామిక హక్కు ఉండదని నచ్చచెప్పింది. దొంగ ఓట్లను అరికట్టటానికి, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టటానికి లోక్‌సత్తా ఇచ్చిన ఈ పిలుపునకు కూడా ప్రజానీకం పెద్దఎత్తున స్పందించారు. ఒక పరిధి దాటి 'నోటా'ను పరిష్కారంగా భావిం చకూడదని, వయోజనులందరూ ఉత్సాహంతో ఓటింగ్‌లో పాల్గొ నేందుకు నిర్దిష్ట సంస్కరణలు తీసుకురావాలన్నది లోక్‌సత్తా విధానం.

**తప్పుల తడకగా ఓటర్ల జాబితా సర్వే - పరిష్కారం చూపిన లోక్‌సత్తా**

ఇక మరొక ఎన్నికల సంస్కరణను కూడా లోక్‌సత్తా ప్రతిపాదించింది. ఆనాడు ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉండటం, దొంగ ఓట్లకు కావలసినన్ని లొసుగులుండటం, అర్హులైనవారికి ఓటు వేసే అవకాశం లేకపోవటం వంటి వన్నీ క్షేత్రస్థాయి సర్వే చేసి గణాంకాలతో సహా ప్రకటించింది. ప్రతి జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాల్ని చేపట్టింది. దీనివల్ల పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల్లో తప్పులు 40 నుంచి 15.9శాతానికి, గ్రామ ప్రాంతాలలో 15 నుంచి 5శాతానికి తగ్గాయి. లోక్‌సత్తా చేసిన ప్రయత్నాన్నే నమూనాగా తీసుకుని ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాల్లో తప్పుల సవరణను తరచూ నిర్వహించాల్సిన కార్యక్రమంగా రూపొందించింది. ఓటర్ల జాబితాలలో ప్రజలు తేలిగ్గా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు, అవసరమైన మార్పులు చేసేందుకునేందుకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు పోస్టాఫీసులలో ఓటర్ల జాబితాల ఏర్పాటుకు లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చేసిన ప్రయత్నాలు 2008లో కొంతమేర ఫలించాయి. ప్రజలు విదేశాల్లో ఉన్నా కూడా ఎప్పుడు కోరుకుంటే అప్పుడు ఓటర్లుగా నమోదయ్యేందుకు ఏర్పాట్లు వచ్చేస్తున్నాయంటే అది లోక్‌సత్తా సుదీర్ఘ కృషి ఫలితమే.

**క్రియాశీల పౌరుల ఉద్యమమే**

**జనశిక్షణ - కళాజాత**

సమాజంలో ఉన్న సామాన్య పౌరులను విషయ పరిజ్ఞానంతో సంఘటితంగా కృషి చేసే క్రియాశీల పౌరులుగా తయారు చేయటానికి రతన్ టాటా ట్రస్ట్‌తో కలసి "జనశిక్షణ" పేరుతో కార్యక్రమాన్ని లోక్‌సత్తా ప్రారంభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు లక్షా పాతిక వేల మంది క్రియాశీల పౌరులకు వెయ్యి గ్రామాలకు పైగా తిరిగి శిక్షణనివ్వడం జరిగింది. దీనిలో భాగంగానే 'కళాజాత' కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రంలోని సుమారు 500 మండలాలలో ప్రజాకళాకారుల ప్రదర్శనల్ని నిర్వహించారు.

ప్రజాస్వామ్య సంస్కరణల్లో భాగమైన ఎన్నికల సంస్కరణలు, న్యాయ, పోలీసు సంస్కరణలు, అవినీతికి వ్యతిరేకంగా పారదర్శక, జవాబుదారీ పాలనకోసం, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుని విధానాల్లో మార్పు తీసుకురావటం కోసం ఉద్యమాలు, కార్యక్రమాలు నూతన రాజకీయ సంస్కృతితో చేస్తూ తెలుగునాట క్రమంగా సంస్థాపరంగా లోక్‌సత్తా బలపడింది. జిల్లాలవారీ సంఘాలను విస్తృతం చేసి రాష్ట్రంలో ప్రతి మండలానికీ సంఘం ఉండేలా ఏర్పాటు చేసింది. రాజకీయ సంస్థల్లో తాను కోరుతున్న అంతర్గత ప్రజాస్వామ్యాన్ని లోక్‌సత్తాలో ఎన్నికల ప్రక్రియ ద్వారానే చేసి చూపింది. ప్రజాస్వామ్యయుతంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ శాఖలకు 2002లో ఎన్నికలు నిర్వహించింది. మొదట గ్రామ, ఆ తర్వాత పట్టణ, తర్వాత జిల్లా, రాష్ట్ర విభాగాలకు వరుసగా ఎన్నికలను జరిపింది. నూతన ఒరవడితో ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. సంస్థాగత నిర్మాణం తర్వాత ప్రజాస్వామ్య సంస్కరణల ఉద్యమ కార్యక్రమాల్ని ఉధృతం చేసింది.

**స్థానిక ప్రభుత్వాల ప్రజాప్రతినిధులకు శిక్షణ**

2001 సంవత్సరంలో తెలుగునాట గ్రామ పంచాయతీ మొదలుకొని

మండల జిల్లా పరిషత్‌ల దాకా ఎన్నికలు జరిగాయి. స్థానిక ప్రభుత్వాల సాధికారతను కీలక ఎజెండాగా కలిగిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ.. ఆ ఎన్నికలలో గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాసమస్యలపై పరిష్కారాలతో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించింది. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత అంటే ఏమిటి, ఎందుకు అది ప్రజలకు అత్యవసరం తెలియచెప్తూ ప్రచారం చేసింది. గ్రామాల్లోని బడుగు బలహీన వర్గాలు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం స్థానిక ప్రభుత్వాల్లో ఉంటుందని వివరించింది. అప్పుడున్న రిజర్వేషన్ల ప్రకారం మహిళలకు 33 శాతం, బడుగు బలహీన వర్గాలకు 60 శాతానికిపైగా రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. అదే సమయంలో నిరక్షరాస్యులైన గ్రామీణులు వీటిని సద్వినియోగం చేసుకుని ఎన్నికల్లో నెగ్గినా వారికి పాలనాపరమైన అంశాలపై పట్టు ఉండటం లేదని గుర్తించింది. దానివల్ల గ్రామాల్లో ఉన్న పెత్తందార్లు లేక అధికారులు వారిని తప్పుదోవ పట్టించే అవకాశాలున్నాయని భావించింది. అందుకే స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం మొదటగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. దానిలో భాగంగానే రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో మాస్టర్ ట్రైనీలుగా రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా ప్రతినిధులు శిక్షణ పొందారు. అలా శిక్షణ పొందిన ప్రతినిధులు స్థానిక ప్రభుత్వాలలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సర్పంచ్ నుంచి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ వరకు శిక్షణనందించారు. ఈ రకంగా స్థానిక ప్రభుత్వాల సాధికారతకు కార్యక్రమాల్ని ప్రారంభించి విస్తరించింది లోక్‌సత్తా. ప్రతి కార్యక్రమంలో విలువైన సాహిత్యాన్ని లోక్‌సత్తా ఉచితంగా లేదా నామమాత్రపు ధరతో కరదీపికలుగా అందించింది.

**హైదరాబాద్ ఎన్నికల్లో ఉమ్మడి వేదికలు**


2002లో జరిగిన హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీహెచ్) ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో లోక్‌సత్తా పాల్గొంది. హైదరాబాద్ నగర ఓటర్ల జాబితాలోని డొల్లతనాన్ని ఆధారాలతో బయటపెట్టింది. దీంతో సవరించిన ఓటర్ల జాబితా విడుదల చేశాక హైదరాబాద్ ఎన్నికలు జరిపారు. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలకు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. ఆ సందర్భంగా కార్పొరేషన్ మేయర్లకు, మునిసిపల్ ఛైర్ పర్సన్ అభ్యర్థులకు ఎన్నికల ఎజెండాపై ఉమ్మడి వేదికల్ని నిర్వహించింది. తమ పార్టీ విధానాలు, స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యేకించి ఇస్తున్న హామీలు వంటి వాటిని ప్రజల ముందుంచేందుకు ఈ వేదికలు అభ్యర్థులకు ఉపయోగపడగా, ప్రజల్లో కూడా ఓటుహక్కు వినియోగంపై అవగాహనకు తోడ్పడ్డాయి.

**ప్రజల మేనిఫెస్టో**

పట్టణ ప్రాంతాల ఎన్నికల్లో మరో ముఖ్యమైన అంశాన్ని లోక్‌సత్తా వెలుగులోకి తెచ్చింది. ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజాసమస్యల వివరాలను ప్రజల నుంచే సేకరించటం జరిగింది. వీటికి రాజకీయ పార్టీలు చూపించాల్సిన పరిష్కారాలు ఏమిటి అని సదస్సుల్లో చర్చించి ఆ పరిష్కారాల్ని ప్రజా మేనిఫెస్టో రూపంలో చిన్న బుక్‌లెట్లుగా ప్రకటించటం జరిగింది. రాజకీయ పార్టీలు తమ మునిసిపల్ ఎజెండాను ప్రకటించకముందే ఈ పని చేసింది. ఆ తర్వాత ఆయా రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులకు వీటిని అందజేసి తమ వైఖరిని తెలియజేయమని లోక్‌సత్తా కోరింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు వందకు పైగా మునిసిపాలిటీల్లో ఈ కార్యక్రమాల్ని నిర్వహించటం జరిగింది.

**స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం**
**2003లో కోటి సంతకాల సేకరణ ఉద్యమం**

స్థానిక ప్రభుత్వాలలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కేవలం శిక్షణనిస్తే సరిపోదని లోక్‌సత్తా గుర్తించింది. ఆ ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలంటే విధులు, నిధులు, సిబ్బంది సహా అధికారాలను




కల్పించాలని స్పష్టం చేసింది. ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన స్థానిక ప్రభుత్వాలకు పునరుజ్జీవనం కలిగించేందుకు ఉద్యమించింది. ఈ ఉద్యమంలో కేవలం ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాల్గొంటే సరిపోదని, ప్రజల భాగస్వామ్యం కీలకమని భావించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణను ప్రకటించింది. అంతకుముందు రామజన్మభూమి కోసం దేశవ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించిన ఉద్యమం మాత్రమే రికార్డుగా ఉండేది. కానీ అప్పటికి కేవలం ఏడు కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనే, ఆ ఒక్క రాష్ట్రంలోనే జాతీయ రికార్డును లోక్‌సత్తా బద్దలు కొట్టింది. స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం లోక్‌సత్తా మొదలుపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమంలో కోటి 10 లక్షల మందికిపైగా పాల్గొని మద్దతు పలికారు. ఇది దేశంలోకెల్లా అతి పెద్ద సంతకాల సేకరణ ఉద్యమంగా మారింది. స్థానిక ప్రభుత్వం అంటే 'ఇంటి ముందు ప్రభుత్వం, కంటి ముందు పాలన' అన్న లోక్‌సత్తా నినాదం తెలుగునాట గల్లీల్లో, మార్కెట్లలో ఎక్కడబడితే అక్కడ మారుమోగింది. దూరంగా ఉన్న మంచివాడి కంటే, దగ్గరగా ఉన్న చెడ్డవాడితో పనిచేయించుకోవటం మనకు ముఖ్యమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. 'స్థానిక ప్రభుత్వాలకు అధికారం ఇవ్వండి, మా గురించి మేం ఆలోచించుకునే అవకాశం ఇవ్వండి' అని ప్రజల చేత డిమాండ్ చేయించింది. మా ఓటు, మా అధికారం అంటూ ఎంపీ,

ఎమ్మెల్యేల రాజ్యాన్ని నిర్వహించింది. చట్టసభల్లో శాసనాలు చేయటం మీ పని, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో రోజువారీ సేవలను అందించటం, అభివృద్ధి చేయటం స్థానికుల పని అని వారికి మనవి చేసింది. స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు తప్పు చేస్తే గల్లా పట్టుకుని నిలదీయవచ్చని, కానీ మీకు సంబంధం లేని స్థానిక అంశాలపై జోక్యం చేసుకోవద్దని ఎమ్మెల్యే, ఎంపీలను కోరింది. మా పన్నుల డబ్బుతో మా పనుల్ని మేమే చేసుకుంటామని స్థానిక ప్రజల తరపున లోక్‌సత్తా ప్రకటించింది. ఇలా స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం కోటి సంతకాల లక్ష్యాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయటమేకాకుండా, లక్ష్యాన్ని మించి ప్రజల మద్దతును కూడగట్టింది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వందలాది సదస్సులను నిర్వహించింది. స్థానిక ప్రభుత్వాల తాజా ప్రజాప్రతినిధులతోపాటు మాజీ ప్రతినిధులు, సమాజంలోని మేధావులు, న్యాయకోవిదులు, ప్రముఖులు ఇలా ఎందరినో వీటిల్లో భాగస్వాములను చేసింది. ఇలా సేకరించిన కోటీ 10 లక్షల సంతకాలతో కూడిన డిమాండ్లను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర రెడ్డిలకు సమర్పించింది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, విధులను బదలాయిస్తామని ఇద్దరూ పోటీపడి హామీ ఇచ్చారు. ఆ తర్వాత రాష్ట్రం నలుమూలల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాది మందితో హైదరాబాద్ లలితకళా తోరణంలో భారీ సదస్సును నిర్వహించి 'స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిస్తారా? పదవుల నుంచి దిగిపోతారా?' అనే ప్రశ్నను నినాదంగా మలచింది లోక్‌సత్తా.

**దాపరికంలేని పాలన కోసం 'సమాచార హక్కు చట్టం' (ఆర్‌టీఐ)**

పాలనా సమాచారం హక్కుగా పొందాలని, ప్రజాస్వామ్యంలో ప్రభువులైన




ప్రజల వద్ద సేవకులైన పాలకులు రహస్యాల్ని దాచకూడదని తొలినుంచీ లోక్‌సత్తా పోరాడుతూ వచ్చింది. 2001లోనే సమాచార హక్కు చట్టం నమూనాను తయారుచేసి పార్లమెంటు, అసెంబ్లీలకు సమర్పించింది. తెలుగు ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఈ చట్టం గురించి వివరించింది. 2002లో సమాచార స్వేచ్ఛ హక్కు చట్టం రావటానికి లోక్‌సత్తా కారణభూతమైంది. కానీ ఈ చట్టం చాలదు, హక్కుగా సమాచారం కావాలని గట్టిగా గళం వినిపించింది. 2004లో అరుణారాయ్ వంటి ఇతర ప్రజాస్వామిక మిత్రులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేయటంతోపాటు అవసరమైన లాబీని కూడా చేసింది. ఢిల్లీ నుంచి గల్లీ వరకూ సంతకాల సేకరణతో అవసరమైన పెద్దలను కలిసి ఒప్పించింది. దీంతో 2005లో యూపీయే ప్రభుత్వం దిగి వచ్చి చట్టాన్ని తేవటానికి అంగీకారం తెలిపింది. ఈ చట్టంలోని ప్రతి పదాన్నీ హైదరాబాద్‌లోని లోక్‌సత్తా కార్యాలయంలో జయప్రకాష్ నారాయణే రాశారు.

**వార్షిక విద్యాస్థితి నివేదిక (అసర్) సర్వేలో లోక్‌సత్తా**

విద్యలో ప్రమాణాల గురించి విస్తృత స్థాయిలో దృష్టి పెట్టింది లోక్‌సత్తా. 2001-2002 విద్యాసంవత్సరం నుంచి మొదలైన సర్వశిక్షా అభియాన్ పథకం ఫలితాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థ చేస్తున్న ప్రయత్నాన్ని లోక్‌సత్తా ప్రోత్సహించింది.




దేశవ్యాప్తంగా 600 గ్రామీణ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలోని 6 నుంచి 14 ఏళ్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెద్ద సంక్లిష్టతలు లేని ప్రశ్నలతో అంచనా వేసేందుకు ఈ సంస్థ ప్రయత్నం మొదలుపెట్టింది. వార్షిక విద్యాస్థితి నివేదిక (అసర్) పేరుతో రూపొందే ఈ నివేదికలకు 2005, 2006లో తెలుగునాట లోక్‌సత్తాయే బాధ్యతలు తీసుకుంది. తొలి అసర్ నివేదికను కూడా జేపీయే అప్పటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న మాంటెక్ సింగ్ అహ్లువాలియాతో కలిసి ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో విడుదల చేశారు. రాష్ట్రంలో అసర్ సమన్వయకర్తగా పనిచేసే అవకాశం నాకు లభించింది. లోక్‌సత్తా వలంటీర్లు ఒక ఉద్యమంలా అన్ని జిల్లాల్లో పాల్గొన్నారు. 2006లో లోక్‌సత్తా రాజకీయ పార్టీగా కూడా విస్తరించింది. దీంతో ఆ తర్వాత గత 16 సంవత్సరాలుగా ఈ సర్వేలో లోక్‌సత్తా తరపున బండారు రామ్మోహనరావు, జనబలం వర్కింగ్ ఎడిటర్ డి.సోమసుందర్ మాస్టర్ రిసోర్స్ పర్సన్స్‌గా రాష్ట్రవ్యాప్త సర్వేలో పాల్గొనే డీఎడ్ అభ్యర్థులకు శిక్షణనిస్తున్నారు. అలాగే ప్రతి సంవత్సరం ఢిల్లీలో ఇంగ్లిష్‌లో విడుదల చేసే అసర్ నివేదికలను తెలుగులోకి అనువదించి అందిస్తున్నారు. ఈ సర్వే వివరాల్ని అనేక సమావేశాల్లోనే కాకుండా, అసెంబ్లీలో కూడా జేపీ పలుమార్లు ప్రస్తావించి విద్యావ్యవస్థను బాగుచేయమని డిమాండ్ చేశారు. ప్రతి పర్యటనలో అవకాశముంటే ఆస్పత్రితోపాటు స్కూలు సందర్శించటం, అసర్ తాజా వివరాల్ని, పీసా సర్వేను ప్రస్తావించటం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే మొట్టమొదటిసారిగా విద్యాప్రమాణాలను మెరుగుపరచటంపై దృష్టిపెట్టేలా జాతీయ నూతన విద్యావిధానాన్ని మలచటంలో కూడా లోక్‌సత్తా తన వంతు కృషి చేసింది.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## 2022 ఆగస్టు నెల 15, ఆజాదీకా అమృత్ మహోత్సవ శుభ సందర్భం!

## భావిభారత స్వచ్ఛ రాజకీయ ప్రతిపాదన జాతికి అంకితం!!

## మనది ఏకైక ఓటర్ల జాతి! ఈ ప్రజాస్వామ్య యుగంలో ఓటర్లే ప్రభువులు !

జుగాడ్... సమస్యలోనే పరిష్కారం కనిపెట్టే ఒక ఆలోచనా విధానం! అందుబాటులోనున్న పరిమిత ఆర్థిక వనరులతో మరియూ టెక్నాలజీతో ప్రాణంపోసుకునే పక్కా లోకల్ పరిష్కారం. జుగాడ్ సూత్రాలపై వందకు వంద శాతం స్వావలంబన దిశలో ఒకదేశాన్ని నిర్మించవచ్చు. 'జుగాడ్ జీవులే దమ్మున్న జీవులు' అంటుంది జుగాడ్ఓటర్ల 50:50 సంకల్పం.

విజ్ఞతగల ఓటర్లందరూ (1) ద్వంద్వార్థాలతో కూడిన మాటలతో ఒకరినొకరు వంచించుకోకూడదు (2) పరస్పర వైవిధ్యాలతో కూడిన భావజాలాల వరదల్లో కొట్టుకుపోకూడదు (3) పత్రికల్లోనూ, టీవీ ఛానళ్లలోనూ అదేపనిగా "దుష్ట రాజకీయాల్ని" అలవోకగా విశ్లేషించే స్వతంత్ర వ్యక్తుల వశీకరణ వ్యూహాలకు లొంగిపోకూడదు. "మనిషి స్వేచ్ఛాయుత మనుగడకూ, డబ్బుకూ మధ్యగల అవినాభావ సంబంధాన్ని గుర్తించాలి. డబ్బు సంపాదనకే అలవాటుపడ్డ మన చేతుల మీదుగా జీవితంలో ఒకేఒకసారి రెండువేలో, అయిదువేలో, లేదా 10 వేల రూపాయలు కానీ విరాళమిచ్చి మనపార్టీని నిర్మించుకోడానికి మన మనసు అంగీకరించకపోయినా, ఈమానసిక బలహీనతను అధిగమించ గలిగిన విశాల హృదయులే దమ్మున్న జుగాడ్ ఓటర్లు! కార్యకర్తలుగా ప్రజాసేవకూ, రాజ్యాధికారానికీ నిజమైన అర్హులు! పార్టీలమధ్య "నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం ముఖ్యం.

"ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనంచేసి, అప్రజాస్వామికంగా నిరంకుశంగా వ్యక్తుల ఇష్టానుసారంగా నడిచే పార్టీలలో ఏ పార్టీ గెలిచినా ఓడిపోయేది ప్రజలే, కాబట్టి పార్టీలనూ రాజకీయాలనూ చట్టబద్ధంగా ప్రజాస్వామికీకరణం చేయడం అతి ముఖ్యమైన అంశం" అని "నేటి యువతరపు ఓటర్ల జాతిపిత"గా అభివర్ణించదగిన డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అనే అత్యంత జనాకర్షణ కలిగిన ఒక IAS విశ్రాంత మేధావి ఎప్పుడో తీర్మానించారు. అందుచేత,

MLA నియోజకవర్గం ప్రాతిపదికగా సాలీనా 50 శాతం బడ్జెట్ నిధులు కేటాయిస్తూ, నిరంకుశ అధినేతల బెడదలేని, ప్రతిపాదిత హింసరహిత పార్టీవ్యవస్థలో ఓటు మీ స్థిరాస్తి. డబ్బు మాత్రం మన చరాస్తి. విరాళదాతలు ఏపార్టీకయినా ఓటువేసుకోవచ్చు. పార్టీ డబ్బు ఓటర్ల స్వయం నియంత్రణలో ఖర్చు (50+25+15+10) పెడదాము. ఏదోవిధంగా డబ్బుసంపాదనకై పార్టీలో దూరే కార్యకర్తలకు స్థానం ఉండదు. అంతేకాదు మీయొక్క కులం,మతం,ప్రాంతం, ధూమపానం, మద్యపానం, ఆహారపుటలవాట్ల విషయాలలో రాజ్యాంగ విరుద్ధంగా పార్టీ జోక్యం చేసుకోదు కానీ, సెక్యూలరిజం, చట్టబద్ధ మెజార్టీపాలన, సంస్కరణలూ, రిజర్వేషన్లవంటి విషయాలలో స్పష్టమైన నిర్వచనాలతో పాటు సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా నియంత్రణ ఉంటుంది. అంతర్గత ప్రజాస్వామ్యయుతంగా పార్టీ పదవులకై జుగాడ్ ఓటర్లు ప్రతీ మూడేళ్లకొకసారి విధిగా ఎన్నికలు జరుపుకోలేని పక్షంలో పార్టీ డబ్బు దేశరక్షణ నిధికి పోతుంది.

Please contact: (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:

పదివేల రూ.. విరాళమిచ్చిన భావిభారత భాగ్య విధాతలు : M.Parthasarathy (A Jugaad Voter and Karyakarta) (2) K.Subrahmanyam (3) Col.P.V.Ramanarao (4) U.Subba Rao (5) C.K.Murthy (6) Syed Ansari (7) Smt.D.Kasturi (8) K.Srinivas Murthy (9) Dr.Vamsi Raj

ADVT

### ఇతర రాష్ట్రాలలో లోక్‌సత్తా

ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఢిల్లీ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకల్లో కూడా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వేళ్లూనుకోవటమే కాకుండా



పలు ఉద్యమాలను చేసింది. ఢిల్లీ నగరంలో ఇప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 'పరివర్తన' సంస్థ ద్వారా నిర్వహించిన 'హమారా పైసా, హమారా హిసాబ్' ఉద్యమంలో కూడా లోక్‌సత్తా పాల్గొంది. అలాగే సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారేతో కలిసి పలు కార్యక్రమాల్లో పనిచేసింది. అవినీతి నిరోధక కమిషన్ పేరుతోనో, లోక్‌పాల్ పేరుతోనో జాతీయ స్థాయిలో అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పాటుకు 1997 నుంచి ప్రయత్నిస్తున్న లోక్‌సత్తా కర్ణాటకలో చేసిన 'సాకు' ఉద్యమం, విదేశాల్లోని పీపుల్ ఫర్ లోక్‌సత్తా 'దండి పాదయాత్ర' కార్యక్రమాల నుంచి రూపుదిద్దుకున్న ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ ఉద్యమం నుంచే అన్నా బృందం నేతృత్వంలో లోక్‌పాల్ ఆందోళన రూపుదిద్దుకుంది.

### శిక్షణా కార్యక్రమాలు

లోక్‌సత్తా ప్రధాన నినాదం 'సమస్యలపై పరిజ్ఞానంతో కూడిన పోరాటం'! 'పరిజ్ఞానం - సంఘటితం - ఉద్యమం". విషయ పరిజ్ఞానంతో సంఘటితంగా ఉద్యమించాలని లోక్‌సత్తా మొదటి నుంచీ ప్రజలను కోరుతోంది. అందుకు అనుగుణంగా వివిధాంశాలపై అవగాహనను పెంచేందుకు శిక్షణా కార్యక్రమాల్ని ఏర్పాటు చేసింది. లోక్‌సత్తా ఉద్యమ సంస్థకు మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచిన మాతృసంస్థ ఎఫ్.డి.ఆర్ (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ - ప్రజాస్వామ్య పీఠం) ద్వారా లోక్‌సత్తా కార్యకర్తలకే కాకుండా సమాజ సేవలకు కూడా శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. హైదరాబాద్ కొత్తపేటలో ఏర్పాటు చేసిన "ప్రజాస్వామ్య శిక్షణా కేంద్రం" ద్వారా వరుసగా ఐదు సంవత్సరాల పాటు శిక్షణను నిర్వహించింది. సామాజిక రాజకీయ ఆర్థిక అంశాలపై నిష్ణాతులైన వారు బోధించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఎలా అప్‌డేట్ చేసుకోవాలి, కొత్తగా సమాచారాన్ని తెలుసుకోవటానికి విశ్లేషణలో గీటురాళ్లు ఏమిటి వంటివి వివరించారు. వసతి, భోజన సదుపాయాలు కల్పించి మూడు రోజులకు తగ్గకుండా ప్రతి బ్యాచ్‌కీ శిక్షణ నిర్వహించారు. విషయ పరిజ్ఞానం కోసం లోక్‌సత్తా ఎన్నో పుస్తకాలను ప్రచురించింది. 'జనబలం' మాసపత్రికతోపాటు 'లోక్‌సత్తా టైమ్స్' అనే పక్షపత్రికను తీసుకొచ్చింది. లోక్‌సత్తా సాహిత్యం తెలుగు, ఇంగ్లీషులో కొన్ని వేల పేజీలుంటుంది. ఇవి కాక జేపీ ప్రసంగాలు, వివిధ కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు, ట్వీట్లు వంటివి కలిపితే డేటా అనంతంలా తయారవుతుంది.

### నల్లడబ్బు లేకుండా పార్టీలకు విరాళాలు

2003లో తెహల్కా కుంభకోణాన్ని అవకాశంగా మలచుకుని అన్ని పార్టీలనూ ఒప్పించి నిజాయతీ రాజకీయానికి నిజాయతీ డబ్బు అందేలా చేయటానికి పార్టీల విరాళాల చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఈ చట్టం వల్లే లోక్‌సత్తా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ రాగలిగాయి. కానీ అరుణ్ జైట్లీ సహా అనేకమంది స్వయంగా ఒప్పుకున్నట్టు, లోక్‌సత్తా, ఆప్ తప్ప ఏ పార్టీ ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేయలేదు.

### మరుగుదొడ్ల నిర్మాణం-స్వచ్ఛభారత్

స్థానిక ప్రభుత్వాల ప్రాధాన్యతతోపాటు వాటి విధుల్లో పారిశుద్ధ్యానికి తద్వారా ఆరోగ్యానికి అమిత ప్రాధాన్యతనిచ్చే లోక్‌సత్తా 1997 నుంచి మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఒక ఉద్యమంగానే గుర్తించింది. మనదేశంలో టాయిలెట్లకన్నా ఎక్కువ టీవీలు ఉన్నాయనేది లోక్‌సత్తా పాప్యులర్ డైలాగుల్లో ఒకటి. జేపీ తాను స్కూలు పాఠాలు చదువుకున్న గొడవర్రులో ప్రత్యేకించి చొరవ తీసుకుని మరుగుదొడ్లు నిర్మించారు. లోక్‌సత్తా సీనియర్ నేతలు కొందరు కూడా ఈ ఉద్యమం నుంచే వచ్చారు. అందుకే లోక్‌సత్తా 2014లో స్వచ్ఛభారత్ ఉద్యమాన్ని వెంటనే సమర్థించి అందులో పాల్గొన్నది. అయితే స్వచ్ఛభారత్ రూపకల్పన లోపభూయిష్టం కావటంతో ఎన్ని కోట్ల ప్రచారం జరుగుతున్నా, మీడియా, సెలబ్రిటీలు ఊదరగొడుతున్నా ఆశించిన ఫలితం రాలేదు. స్వచ్ఛభారత్‌ను స్థానిక ప్రభుత్వాల సాధికారతతో సమన్వయం చేసి ప్రజల రోజువారీ భాగస్వామ్యంతో నిర్వహించాలని, తర్వాతి దశలో సామాజిక స్వచ్ఛభారత్‌ని జోడించాలని కొన్ని నిర్మాణాత్మక సూచనల్ని లోక్‌సత్తా చేసినా పాలకులు వ్యక్తిగత ప్రచారానికి, ఆధిపత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు.

### ఫిరాయింపులను కట్టడి చేసేందుకు 91వ రాజ్యాంగ సవరణ

ఫిరాయింపులకు అంతకుముందున్న చట్టాన్ని బలోపేతం చేసి కనీసం మూడింట రెండొంతుల మంది ఉంటేనే చట్టసభలో చీలిక వర్గంగా గుర్తించాలనే నిబంధనతో 91వ రాజ్యాంగ సవరణను తీసుకురావటంలో లోక్‌సత్తా కీలక పాత్ర పోషించింది. అయితే, అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్ చేతుల్లో కాకుండా ఎన్నికల సంఘం చేతుల్లో ఉంచాలన్న లోక్‌సత్తా ప్రతిపాదనను మాత్రం ఈ సవరణలో చేర్చలేదు. చివరకు అదే 91వ రాజ్యాంగ సవరణను నీరుగారుస్తోంది. ఈ సవరణను మార్చేందుకు లోక్‌సత్తా ప్రయత్నిస్తున్నా, బరితెగించి ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్న అధికార పార్టీలను ఎదుర్కోవటానికి ప్రజాబలం సరిపోవటం లేదు.

**పరోక్ష పన్నులు తేలిక చేశాం**

సబ్బు బిళ్ల దగ్గర్నుంచి ప్రజలకు భారంగా, అవినీతిమయంగా మారిన సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్ తదితర పరోక్ష పన్నుల విధానాన్ని సరళతరం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాధికారులు, పౌరసమాజ ప్రముఖులతో లోక్‌సత్తా హైదరాబాద్, ముంబయిలో విస్తృత సదస్సులు నిర్వహించి విలువైన సూచనల్ని రూపొందించింది. దీనివల్ల పన్నుల సేకరణలో కీలక సవరణలు వచ్చి ఆర్థిక వ్యవస్థ ప్రజానుకూలంగా బలపడింది.

**విద్యుత్ సంస్కరణల్ని చేసి చూపిన లోక్‌సత్తా**

విద్యుత్‌రంగంలో ప్రధాన సమస్యలుగా ఉన్న అవినీతి, పంపిణీ నష్టాల్ని అరికట్టటం ఎలాగో లోక్‌సత్తా స్వయంగా చేసి చూపింది. 2004లో పశ్చిమ గోదావరి జిల్లా కళ్లచెర్వు గ్రామంలో పైలట్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్తు పంపిణీ నష్టాల్ని 30 శాతం నుంచి 16శాతానికి లోక్‌సత్తా తగ్గించింది. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో అవినీతి లేకుండా రైతులకు వెంటనే సరఫరా జరిగేలా చేసింది. విద్యుత్ రంగంలో వికేంద్రీకరణ చేపడితే పంపిణీలో నష్టాలు తగ్గి భారీగా ప్రజాధనం ఆదాకావటంతోపాటు అవినీతి తగ్గుతుందని, ప్రతి గ్రామంలో ఇద్దరకు ఉద్యోగాలు కూడా వస్తాయని, వ్యవసాయ ఫీడర్లను వేరు చేస్తే గ్రామాలకు 24గంటలూ విద్యుత్తు అంది ఉపాధి పెరుగుతుందని లోక్‌సత్తా అప్పటి ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చింది. బీజేపీ అగ్రనేత అరుణ్‌జైట్లీ స్వయంగా లోక్‌సత్తా కార్యాలయానికి వచ్చి ఈ వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ అవే విద్యుత్ సంస్కరణల్ని అమలు చేయటం, ఆయన ప్రధాని కావటంలో ఆ విజయగాథలు కూడా కీలకపాత్ర పోషించటం తెలిసిందే.

**జాతీయ ఆరోగ్య మిషన్**

ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయాల్సిన కచ్చితమైన పనుల్లో అందరికీ నాణ్యమైన వైద్యం, విద్య అందించటం కీలకమని తొలి నుంచీ పోరాడుతున్న లోక్‌సత్తా ఇందులో భాగంగా 2005లో జాతీయ ఆరోగ్య మిషన్‌ను సాధించింది. అయితే ఈ మొత్తం విధానాన్ని అమలుచేయకుండా రెండు ముక్కలు చేసి జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌గా మార్చి కొంతమేర అమలుచేశారు. జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్‌ని ఇప్పుడిప్పుడు అమలు చేస్తున్నారు. కానీ ఇది కేవలం లోక్‌సత్తా ఆశించిన వైద్య, ఆరోగ్య లక్ష్యంలో పదిశాతం మాత్రమే.

**పాడిరంగంలో మ్యాక్స్ చట్టం రద్దును తిప్పికొట్టాం**

పాలఉత్పత్తి రంగంలో సహకార సంస్థలు, రైతులు లాభపడటానికి కారణమైన మ్యాక్స్ చట్టాన్ని రద్దు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం చేసిన ప్రయత్నాల్ని న్యాయపోరాటంతో లోక్‌సత్తా అడ్డుకుంది. చిత్తూరు, కడప డెయిరీలను నాశనం చేసి సొంత డెయిరీలను ఏర్పాటు చేసుకున్న, ప్రోత్సహించిన ఆ నాయకుల బాటలోనే తెలంగాణ ప్రభుత్వం 2016లో జీవో 28ని జారీ చేసినా లోక్‌సత్తా ప్రయత్నంతో పక్కనపెట్టింది.

సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి 97వ రాజ్యాంగ సవరణ స్వతంత్ర భారత్‌లో గొప్ప రాజ్యాంగ సవరణల్లో ఒకటిగా పరిగణించదగ్గ 97వ సవరణను లోక్‌సత్తా 2012లో సాధించింది. దీనివల్ల ప్రజలు ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాజ్యాంగం ఇచ్చిన హక్కులతో సొంతంగా సంఘాలుగా ఏర్పడి తమ ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకోగలిగే అవకాశం ఏర్పడింది. 1995లో డా॥ వర్గీస్ కురియన్ స్ఫూర్తితో, డా॥ జేపీ చొరవతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం ఈ సవరణకు మూలం. 97వ రాజ్యాంగ సవరణలో కేంద్రప్రభుత్వం అనవసరంగా జొప్పించిన కొన్ని పదాలను లొసుగులుగా ఉపయోగించుకుని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాల హక్కులకు తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నా సహకార సంఘాల స్వతంత్ర ప్రతిపత్తికైతే గ్యారంటీని లోక్‌సత్తా సాధించింది. ప్రజల్లో కాస్త చైతన్యం పెరిగితే చాలు, సహకార వ్యవస్థను పాలకులు తాకనైనా లేరు.

**మోన్‌శాంటో విత్తనాల ధరల్ని తగ్గించగలిగాం**

గుత్తాధిపత్యంతో మోన్‌శాంటో విత్తనాల కంపెనీ అమెరికా, చైనా వంటి దేశాలలో కంటే 10-15 రెట్లు ఎక్కువగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇష్టమొచ్చినట్టు ధరల్ని పెంచినప్పుడు 2006లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయింది. దీంతో మోన్‌శాంటో విత్తనాల ధరల్ని తగ్గించాల్సి వచ్చింది.

**ఢిల్లీ మాత్రమే ఈ దేశానికి కేంద్రబిందువు కాకూడదనే..**

ప్రపంచ తొలి పదిమంది ప్రజామేధావులలో ఒకరుగా విజ్ఞులు భావించే జేపీ సివిల్ సర్వీసు అధికారిగానే కొత్త భావాల్ని, ఆధునిక పరిష్కారాల్ని ప్రతిపాదించేవారు. అధికారాన్ని వికేంద్రీకరించి జిల్లా యూనిట్‌గా జిల్లా ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే ఆయనకు జేపీ సూచించారు. పూర్తి స్థాయి రాజకీయ సంస్కరణోద్యమానికి లోక్‌సత్తాను ఏర్పాటు చేసే సమయానికి కూడా ఆ భాష, విధానాలు ఈదేశానికి చాలా వింతగా, కొత్తగా ఉండేవి. ఆ సమయంలో ఢిల్లీ నుంచి పనిచేస్తే మీకు చాలా పేరు వస్తుంది, జాతీయస్థాయిలో వేగంగా ఎదగగలుగుతారు అని చాలామంది ప్రముఖులు జేపీకి సలహా ఇచ్చినా మనదేశం ఢిల్లీ కేంద్రంగా మాత్రమే పనిచేయకూడదనే భావనతో హైదరాబాద్‌ను తన కార్యక్షేత్రంగా జేపీ ఎంచుకున్నారు. భారత్‌కి ఢిల్లీ ఎంతో, హైదరాబాద్ కూడా అంతేనని అప్పటికీ, ఇప్పటికీ జేపీ చెప్పే మాట.

**రాజకీయ పార్టీగా లోక్‌సత్తా**

రాజకీయ నాయకుల గురించి మాట్లాడటం ఒడ్డున కూర్చుని రాళ్లేసినట్లు తేలికే, రాజకీయాల్లోకి దిగితే తెలుస్తుంది అని

కొందరు విమర్శించారు. ఆ విమర్శలకు సమాధానమిస్తూ లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. 'రాజకీయం అత్యంత పవిత్రమైన వ్యాసంగం, రాజకీయ పార్టీ అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ' అని లోక్‌సత్తా బహిరంగంగా ప్రకటించింది. అందుకు అనుగుణంగానే ఓ పక్క ఉద్యమంగా లోక్‌సత్తా




కొనసాగుతుండగానే, మరోపక్క అందులోని కొందరు పెద్దలతో కలసి లోక్‌సత్తా పార్టీని స్థాపించారు. దాదాపు పదేళ్ల లోక్‌సత్తా ఉద్యమం తర్వాత 2006లో అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. రాష్ట్ర, జాతీయ పార్టీగా ఎన్నికల కమిషన్ ద్వారా నమోదు చేయబడినది. 2006 నుంచి స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు, 2009, 2014లో రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసింది. డబ్బు, మద్యం పంచకుండా, ప్రలోభాలు, భావోద్రేకాలు లేకుండా, బహిరంగ చర్చ ప్రమాణాలను పాటిస్తూ కేవలం సుమారు రూ.5 లక్షల ఖర్చుతో 2009లో జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. చట్టసభల చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే ముద్ర వేశారు. పార్టీకి అన్నిచోట్లా 10 శాతం ఓట్లు నిలకడగా పడకపోవటం, డబ్బు రాజకీయాలను తట్టుకుని నిలబడలేక నిజాయతీ సంపాదనాపరులు చితికిపోతుండటంతో 2014 తర్వాత లోక్‌సత్తా పార్టీ ఎన్నికల రాజకీయాలకు తాత్కాలిక విరామం ప్రకటించింది. కానీ ప్రజా ఉద్యమాలలో ఇప్పటికీ ముందే ఉంది. విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన, అవినీతి అంతానికి చట్టాలు, ఎన్నికల సంస్కరణలపై లోక్‌సత్తా చేస్తున్నంత లోతైన రాజకీయ కృషి జాతీయ స్థాయిలో ప్రధాన పార్టీలు కూడా చేయటం లేదు. ఉద్యమ సంస్థగా, పార్టీగా ఏ రూపంలోనైనా ప్రజాస్వామ్య సంస్కరణలను సాధించటం లోక్‌సత్తా లక్ష్యం.

### ఆదాయ వ్యయ వివరాలను ప్రజల ముందుంచిన తొలిపార్టీ లోక్‌సత్తా

పార్టీల విరాళాలకు పన్ను మినహాయింపు చట్టాన్ని 2003లో లోక్‌సత్తా సాధించినా రాజకీయ పార్టీలు దొంగ లెక్కలే చెబుతూవచ్చాయన్నది వాస్తవం. ఇలాంటి పరిస్థితుల్లో 2006లో రాజకీయ పార్టీగా వచ్చిన లోక్‌సత్తా తన ఆదాయవ్యయ వివరాలను ఆడిట్ చేయించి 2007 నుంచి వెబ్‌సైట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రజల ముందుంచింది. ఇలా విరాళాలు, ఖర్చుల వివరాలను అందించిన తొలి పార్టీ భారత్‌లో లోక్‌సత్తాయే. ఆ తర్వాత ఏటా వరసగా లోక్‌సత్తా అందిస్తూండటంతో ఆ తర్వాత అన్ని పార్టీలూ అనుసరించాయి. అయితే కొంతకాలం క్రితం ప్రవేశపెట్టిన బాండ్ల విరాళం పద్ధతిలోని లొసుగులు, హుండీ విరాళాల్ని తీసుకుంటూండటం వల్ల పార్టీలు ఇప్పటికీ లెక్కలేని ధన రాజకీయం చేస్తున్నాయని చిన్న పిల్లలకు కూడా అర్థమవుతుంది.

### మద్యనియంత్రణోద్యమం

మద్యాన్ని నిషేధించే ఆకర్షణీయ ప్రచారోద్యమంతో అధికారంలోకి రావచ్చేమోగానీ అది ప్రజలకు చివరికి నష్టమే చేస్తుందని గుర్తించిన లోక్‌సత్తా తెలుగునాట కఠిన మద్యనియంత్రణోద్యమానికి 2007లో శ్రీకారం చుట్టింది. బెల్టుషాపులనూ, ప్రజలు డిమాండ్ చేసిన చోట అధికారిక మద్యం షాపులనూ తొలగించాలంటూ జేపీ గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం దళితవాడ నుంచి చేపట్టిన మూడు రోజుల పాదయాత్ర ఉద్యమానికి ఎంతో ఊపునిచ్చింది. బెల్టుషాపులు లేవని మొదట బుకాయించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలో బెల్టు దుకాణాలను చూపించాక ఒప్పుకోక తప్పలేదు. సిటిజన్ అరెస్టుల ద్వారా బెల్టుషాపుల నిర్వాహకులపై పోరాటం, మద్యనియంత్రణకు పరిమిత మద్యం దుకాణాల ఏర్పాటు, గ్రామాలలో మహిళల కమిటీలకే మద్య నియంత్రణాధికారాలు వంటి డిమాండ్లతో రాజకీయ పోరాటం చేసింది. ప్రజల్లో చైతన్యం వచ్చిందిగానీ ఎన్నికల్లో మద్యం పంచిన పార్టీలే గెలుస్తుండటం, మద్యమే ప్రభుత్వాలకు పెద్ద ఆదాయ మార్గం కావటంతో ఇంకా ఆ లక్ష్యం కోసం పోరాటం సాగుతూనే ఉంది.

### ప్రతి ముగ్గురులో ఒకరు బీసీ - మహిళలకు 50శాతం ప్రాతినిధ్యం - ప్రత్యామ్నాయ మహిళా రిజర్వేషన్ బిల్లు రూపకల్పన

కుల రాజకీయాలు చేసే పార్టీలకు భిన్నంగా లోక్‌సత్తా నూతన ప్రజాస్వామ్య సంస్కృతితో 2009లో చేసిన ఎన్నికల టికెట్ల కేటాయింపులో ప్రతి ముగ్గురు అభ్యర్థులలో ఒక వెనకబడిన వర్గానికి (బీసీ) చెందినవారు. అణగారిన కులాల సంఘాల నేతలను పిలిపించి ప్రజల పట్ల ప్రేమ ఉన్న సమర్థ నాయకులను నాకివ్వండి, వారి కోసం అదనంగా ప్రచారం చేసి మరీ గెలిపించే ప్రయత్నం చేస్తాను అని చెప్పిన నేత జేపీ! అలాగే పార్టీ పదవుల్లో కూడా ప్రజాస్వామ్యయుతంగానే మహిళలకు 50శాతం, బలహీనవర్గాలకు దామాషా ప్రకారం అవకాశం కల్పించిన పార్టీ లోక్‌సత్తా. మహిళా నాయకులు అత్యధికంగా లోక్‌సత్తా కమిటీల్లోనే కనిపిస్తారు. చట్టసభలలో మహిళలకు 33శాతం

రిజర్వేషన్లకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఆచరణాత్మకంగా మార్చి యోగేంద్ర యాదవ్, మధు కిష్వర్ వంటి వారితో కలిసి ప్రత్యామ్నాయ మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సత్తా రూపొందించింది. ఆ చట్టం అమల్లోకి రావటం కంటే ముందే.. మహిళలకు రాజకీయ పార్టీలు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేయటమే కాకుండా, తన వంతుగా పోటీకి ముందుకొచ్చిన మహిళలందరికీ ఎన్నికల్లో టికెట్లనిచ్చింది లోక్‌సత్తా.

**అసెంబ్లీలో ఒకే ఒక్కడు**

లోక్‌సత్తా పార్టీ తరపున 2009లో గెలిచింది ఒక్కడే అయినా, రాష్ట్రంలో రాజకీయమంతా గందరగోళంగా ఉండి అసెంబ్లీయే స్తంభిస్తున్నా ప్రజల తరపున, కూకట్‌పల్లి నియోజకవర్గ, రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం గళం విప్పిన ఒకే ఒక్కడు జయప్రకాష్ నారాయణ్. లోతైన చర్చ, ప్రసంగాలతోపాటు.. వాకౌట్లు వంటి ధోరణులు లేని నిరసన పద్ధతులతో అసెంబ్లీ గౌరవాన్ని పెంచారు జేపీ. చట్టసభలలో ఇంత ఒత్తిడి, రాజకీయ ప్రకంపనల మధ్య సమర్థవంతంగా పనిచేసిన దాఖలాలు స్వతంత్ర భారతదేశ రాష్ట్రాల్లోగానీ, పార్లమెంటులోగానీ కనిపించవు. 'వన్ మ్యాన్ విత్ కన్విక్షన్ ఈజ్ ఎ మెజారిటీ'.

**రిజర్వేషన్లపై విధానమున్న ఏకైక ఉద్యమం, పార్టీ లోక్‌సత్తా**

రిజర్వేషన్లను కొనసాగించాలనో, తొలగించాలనో, వాటిని ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందాలనో తప్ప వాటిపై చర్చ చేసి ప్రజల మధ్య చిచ్చును ఆర్పే ప్రయత్నాన్ని ఈదేశంలోని ఏ రాజకీయ ఉద్యమం, పార్టీ చేయటం లేదు. కాపు రిజర్వేషన్లు కావచ్చు, గుజ్జర్లు–మీనాల వివాదం కావచ్చు, పాటీదార్ల ఉద్యమం కావచ్చు, దళిత క్రైస్తవులకు కోటా కావచ్చు.. రిజర్వేషన్లపై నిర్దిష్టమైన సంస్కరణలను లిఖితపూర్వకంగా ప్రకటించిన ఏకైక ఉద్యమం, పార్టీ లోక్‌సత్తా. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్ల కొడుకులకు రిజర్వేషన్లు ఇవ్వకూడదని, పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పోటీ పరీక్షల్లో అదనంగా కొన్ని మార్కుల్ని కలపాలని, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించాలని రిజర్వేషన్ల సంక్షోభానికి పరిష్కారాలుగా లోక్‌సత్తా ప్రతిపాదించింది. అదనపు మార్కులు కలపటానికి కొన్ని గీటురాళ్లను సూచించి వీటిపై చర్చను ఆహ్వానించింది.

**జిల్లా ప్రభుత్వాల ఆవిష్కరణ**

జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుకు ఐఏఎస్ అధికారిగా ఉన్నప్పటి నుంచీ ప్రయత్నిస్తున్న జేపీ లోక్‌సత్తా పార్టీని ఏర్పాటుచేశాక 2009లో జిల్లా ప్రభుత్వాలను లాంఛనంగా ఆవిష్కరించారు. కలకత్తా కమిషనర్‌గా అసాధారణ ప్రభావంతో స్థానిక ప్రభుత్వాల సాధికారతకు సంకేతంగా నిలిచిన సుభాష్ చంద్రబోస్ జన్మదినోత్సవం జనవరి 23ని జిల్లా ప్రభుత్వాల దినోత్సవంగా ప్రకటించారు. కూకట్‌పల్లిలో జిల్లా ప్రభుత్వాలను ప్రకటిస్తూ తెలుగునాట అన్ని జిల్లాల పతాకాలను కూడా ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇచ్చి, తలసరి కేటాయింపుతో వాటిని జిల్లా ప్రభుత్వాల పరిధిలోకి తేవటం, పాలనకు, రాజకీయానికి అంతిమంగా జిల్లాను యూనిట్‌గా చేయటం జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు లక్ష్యం. మహాఅయితే కొత్త జిల్లాలను ఏర్పాటు చేయటమేతప్ప జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుకు మాత్రం సాంప్రదాయ పాలకులకు ఇంకా చేతులు రావటం లేదు.

**స్థానిక న్యాయాలయాల చట్టాన్ని అందించిన లోక్‌సత్తా**

పూర్తిగా లోక్‌సత్తా చొరవ వల్లే 2009లో ఈదేశంలో స్థానిక న్యాయాలయాల చట్టం వచ్చింది. మహిళల భద్రతకు, ప్రజాస్వామ్యానికి మూలమైన న్యాయాన్ని తేలిగ్గా తక్కువ ఖర్చుతో అందరికీ అందించటానికి ఎంతో ఉపయోగపడే ఈ స్థానిక కోర్టుల అమలుకు యూనియన్ ప్రభుత్వం ముందుకొచ్చినా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపటం లేదు. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాదులకు డిమాండ్ తగ్గుతుందనే అనవసర భయాలు కూడా ఈ చట్టం అమలును అడ్డుకుంటున్నాయి. మహిళలపై అత్యాచారాల దాకా నేరాలు రాకుండా వేధింపుల దశలోనే నిరోధించేందుకు ఈ కోర్టులు ఉపయోగపడతాయి. కేసులు వారంలోగా పరిష్కారమవుతాయి. రూ.2లక్షల లోపు సివిల్ కేసులు కూడా నెలల వ్యవధిలో పరిష్కారమవుతాయి.

**సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల ప్రక్షాళనకు ఎన్‌జేఏసీ**

ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ లేని రీతిలో మనదేశంలో జడ్జీలను జడ్జీలే నియమించుకునే అప్రజాస్వామిక వ్యవస్థను ప్రక్షాళన చేసి నియామకాల్లో పారదర్శకతను పెంచేందుకు లోక్‌సత్తా మచ్చలేని సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కలిసి రూపొందించిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని 2014లో సాధించింది (99వ రాజ్యాంగ సవరణ). 14 ఏళ్ల లోక్‌సత్తా కృషితో రూపొందిన బిల్లుని పార్టీ శత్రుత్వాల మధ్య కూడా పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించినా, గతానికి భిన్నంగా తక్కువ సమయంలోనే సగానికిపైగా రాష్ట్రాల శాసనసభలు ధృవీకరించినా సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగసభలా వ్యవహరించి ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పే సాహసాన్ని మోదీ ప్రభుత్వం, పార్లమెంటు చేయలేకపోయాయి. ఎమర్జెన్సీ సమయంలో, నీట్ వంటి కేసుల్లో తాను ఇచ్చిన తీర్పులు తప్పు అని అంగీకరించిన సుప్రీంకోర్టు ఎన్‌జేఏసీ విషయంలో కూడా ఇచ్చిన తీర్పును సవరించుకోవాల్సి వస్తుందనటంలో సందేహం లేదు.

న్యాయసంస్కరణల్లో భాగంగా ఎన్‌జేఏసీతోపాటు న్యాయమూర్తులపై ఆరోపణలను విచారించేందుకు జ్యుడీషియల్ అకౌంటబిలిటీ చట్టాన్ని కూడా లోక్‌సత్తా ప్రతిపాదించింది. అందరికీ సమాన న్యాయం అందించే న్యాయవ్యవస్థ సక్రమంగా లేకుంటే అది ప్రజాస్వామ్యం అవదు.

న్యాయసంస్కరణలలో భాగంగా ఎన్‌జేఏసీ, జ్యుడీషియల్

అకౌంటబిలిటీ చట్టంతోపాటు సమర్థులైన యువత న్యాయమూర్తులుగా వచ్చేందుకు ఐఏఎస్, ఐపీఎస్‌ల తరహాలో ఇండియన్ జ్యుడీషియల్ సర్వీసు (ఐజేఎస్)ని కూడా లోక్‌సత్తా ప్రతిపాదించింది. వీటికి తోడు కింది కోర్టులలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచటం, న్యాయ విచారణ పద్ధతుల్ని సులభతరం చేయటం, స్థానిక న్యాయస్థానాలను బలోపేతం చేయటం, నేరపరిశోధనలో పోలీసు యంత్రాంగాన్ని సంస్కరించటం వంటివి చేస్తేనే మనం నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నట్టు.

**2జీ లైసెన్సుల రద్దు- వేలం ద్వారా సహజ వనరుల కేటాయింపు వల్ల దేశానికి లక్షల కోట్ల ఆదాయం**

స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద కుంభకోణంగా 2010లో బైటపడ్డ 2జీ స్పెక్ట్రం లైసెన్సుల కేటాయింపుపై క్షేత్రస్థాయిలో పోస్టుకార్డులు, రూ.1 మనియార్డర్ల ఉద్యమం చేయటంతోపాటు దేశంలోని సుప్రసిద్ధులను ఒకచోట చేర్చి లోక్‌సత్తా చేసిన న్యాయపోరాటం వల్ల ఆ లైసెన్సుల్ని 2012లో సుప్రీంకోర్టు రద్దు చేసింది. దాంతోపాటు లోక్‌సత్తా కోరినట్టు సహజ వనరుల కేటాయింపును విధిగా వేలం పాటల ద్వారా పారదర్శకంగా చేయాలని ఆదేశించటం, నరేంద్ర మోదీ ప్రభుత్వం వేగంగా స్పందించటం వల్ల స్పెక్ట్రం, బొగ్గు వంటి వనరుల వేలం ద్వారా ఈదేశానికి లక్షల కోట్ల ఆదాయం లభిస్తోంది.
గాలి జనార్థనరెడ్డికి కేటాయించిన ఓబుళాపురం ఇనప గనుల్లో దోపిడీ ఏమీ లేదని 2008లో అక్కడికెళ్లి వచ్చిన అఖిలపక్ష నేతలు త్రేన్‌మని తేల్చారు. 2009లో జేపీ శాసనసభ్యుడయ్యాక ఇదే చర్చ వచ్చినప్పుడు బహిరంగ వేలం ద్వారా గనుల కేటాయింపు చేయాలని చెప్పినా నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వినలేదు. ఆరోజు వారు నిజాయతీగా, ప్రజల పట్ల ఏమాత్రం ప్రేమతో వ్యవహరించి ఉన్నా 2జీ తీర్పు కంటే ముందే తెలుగు ప్రజలకు సహజ వనరుల ద్వారా బోలెడు ఆదాయం సమకూరి ఉండేది, కోర్టులకెళ్లాల్సిన పనిలేకుండానే దేశానికి తెలుగు ప్రాంతం మార్గం చూపిఉండేది.

**లోక్‌సత్తా పార్టీ 'అవినీతి వ్యతిరేక కమిషన్'**

అవినీతి అంతానికి జాతీయ స్థాయిలో అవినీతి వ్యతిరేక కమిషన్/లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని 1997 నుంచి పోరాడుతున్న లోక్‌సత్తా ఆ క్రమలోనే 2007 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం డిసెంబర్ 9న పార్టీ తరపున అవినీతి వ్యతిరేక కమిషన్‌ని ఏర్పాటు చేసింది. మాజీ లోకాయుక్త జస్టిస్ రామానుజన్‌ను కమిషన్ సారథిగా నియమించి ప్రజల నుంచి ఫిర్యాదులకు ప్రత్యేక నంబర్‌ను కేటాయించింది. భూ దందాల నుంచి అనేక కేసులు రావటం మొదలైనా కమిషన్ బాధ్యులు వెనుకంజ వేయటంతో అది పరిమిత ఫలితాలనే సాధించింది.

**'లీడర్' సినిమాకు స్ఫూర్తినిచ్చిన అవినీతి నిరోధక చట్ట సవరణ**

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి శాసనసభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన పదిరోజుల్లోనే రాష్ట్రంలో అవినీతి అంతానికి బలమైన చట్టాన్ని 2009 జూన్‌లో అసెంబ్లీ ముందుంచారు. ఒకరి అవినీతిపై ఇంకొకరు తీవ్ర ఆరోపణలు చేసుకుని 2008లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి మరీ అవినీతిపై చర్చించిన వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు నిజంగా రాజకీయ అవినీతిని అంతం చేయాలంటే ఈ చట్ట సవరణ కీలక ఆయుధమవుతుందని జేపీ అసెంబ్లీలోను, బైట పదేపదే విజ్ఞప్తి చేసినా వారు విననట్టు నటించారు. ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, స్వతంత్ర ప్రాసిక్యూషన్, ఏసీబీకి స్వయంప్రతిపత్తినిచ్చి బలమైన లోకాయుక్త పరిధిలోకి తేవటం, అవినీతిపరుల ఆస్తుల జప్తు వంటి కీలక సవరణలు లోక్‌సత్తా బిల్లులో ఉన్నాయి. ఇది మాస్ మీడియానూ ప్రభావితం చేసిన బిల్లు. ఈ బిల్లుతోనే భల్లాలదేవుడి తొలి చిత్రం 'లీడర్' వచ్చింది.

**లోక్‌పాల్ రథయాత్ర**

అవినీతి అంతానికి నినాదాలతోనే కాదు, విధానాలతో 1997 నుంచీ పోరాడుతున్న రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా. అందులో భాగంగా కేంద్రంలో అవినీతి నిరోధక కమిషన్, రాష్ట్రాల్లో బలమైన లోకాయుక్త, జిల్లాల్లో అంబుడ్స్‌మన్‌లను ప్రతిపాదించింది. నేర దర్యాప్తు సంస్థలైన ఏసీబీలు, సీబీఐకి జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తిని డిమాండ్ చేసింది. ఇవేవీ లేకుండా సర్వరోగ నివారిణి అంటూ లోక్‌పాల్ ఉద్యమాన్ని ప్రారంభించినా ఆ ఉద్యమానికి లోక్‌సత్తా మద్దతు తెలిపింది. అయితే గుడ్డిగా ప్రజలు ఆ చట్టానికి మద్దతివ్వటం మున్ముందు ప్రమాదం కాబట్టి అవగాహన పెంచేందుకు లోక్‌పాల్ రథయాత్ర పేరుతో తెలుగు నాట, దేశంలోని పలుప్రాంతాల్లోనూ జయప్రకాష్ నారాయణ్ విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

**లోక్‌పాల్ రూపకల్పన**

అవినీతి నిరోధక కమిషన్ పేరుతోనో, లోక్‌పాల్ పేరుతోనో జాతీయ స్థాయిలో అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పాటుకు 1997 నుంచి ప్రయత్నిస్తున్న లోక్‌సత్తాకు కర్ణాటక లోక్‌సత్తా 'సాకు' ఉద్యమం, విదేశాల్లోని పీపుల్ ఫర్ లోక్‌సత్తా 'దండి పాదయాత్ర' కార్యక్రమాల నుంచి రూపుదిద్దుకున్న ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ ఉద్యమం లోక్‌పాల్ నిర్మాణానికి ఒక అవకాశంగా మారింది. లోక్‌పాల్‌పై క్షేత్రస్థాయిల్లో ప్రజల్లో అవగాహన పెంచుతూనే మరోవైపు జన లోక్‌పాల్‌లోని లోపాల్ని తొలగించి లోక్‌పాల్ బిల్లును యూనియన్ ప్రభుత్వానికి లోక్‌సత్తా అందించింది. ప్రస్తుతం వచ్చిన లోక్‌పాల్ చట్టంలోని 80శాతం అంశాలు జేపీ రూపొందించినవే. అయితే ఆర్‌టీఐలోలా కేంద్రంలో బలమైన లోక్‌పాల్‌లా రాష్ట్రాల్లోనూ బలమైన లోకాయుక్తలను అదే చట్టంతో అందించాలని లోక్‌సత్తా చేసిన ప్రయత్నానికి ఆంధ్ర ప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలు సహకరించకపోటంతో బలమైన లోకాయుక్త కోసం ఇంకా పోరాటాన్ని కొనసాగించాల్సి వస్తోంది.

**లోక్‌సత్తా వల్లే స్థానిక నిధులు రూ.2,87,000 కోట్లకు పెరిగాయ్**

మాటలెక్కువ, విషయం తక్కువతో 73, 74వ రాజ్యాంగ సవరణలు విఫలమైనందున స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం నుంచి నేరుగా నిధులిచ్చేలా చేసేందుకు లోక్‌సత్తా చేసిన అలుపెరగని పోరాటం వల్ల 14వ ఆర్థిక సంఘం ఆ నిధుల్ని ఐదంకెల నుంచి ఆరంకెలకు పెంచింది. ఇప్పుడు స్థానిక ప్రభుత్వాలకు రూ. 2,87,000కోట్లు విడుదలవుతున్నాయి. కేంద్రం నుంచి రాష్ట్రాలకు పెరిగిన నిధుల్లో కనీసం 33శాతం స్థానిక ప్రభుత్వాలకే కేటాయించాలని, అందుకోసం ఇప్పుడిస్తున్న నిధుల్ని కనీసం మూడు రెట్లు పెంచాలని, రాష్ట్రాల విచక్షణ ద్వారా కాకుండా నేరుగా, విధిగా నిధుల్ని మూడో అంచె ప్రభుత్వాలకు ఇవ్వాలనే డిమాండ్లతో కృషి చేస్తున్నాం.

**విదేశాల్లో భావాల వ్యాప్తి**

లోక్‌సత్తా ప్రారంభం తెలుగు నేల మీదే అయినప్పటికీ భావాలు దేశవ్యాప్త పరిష్కారాలు. అంతర్జాతీయంగా కూడా వ్యవస్థాపకుడు జేపీ ఎవరో తెలియకుండానే లోక్‌సత్తాకు అభిమానులు ఏర్పడ్డారు. పలు దేశాల్లో బృందాలుగా, 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' సంస్థగా సంఘటితమయ్యారు. బలమైన భావాలే మార్పునకు బీజాలు కాబట్టి ఆ అమృత బీజాల్ని నాటటానికి ఆధునిక సమాచార సాధనాల్ని వినియోగించుకోవటంతోపాటు దేశవ్యాప్తంగా అసంఖ్యాక పర్యటనలు చేసి అనేక ప్రాంతాలలోని విద్యాలయాలలో, సంస్థలలో, కార్యక్రమాల ద్వారా జేపీ తన భావాల్ని వివిధ వర్గాల ప్రజలతో, ముఖ్యంగా విద్యార్థులు, యువతతో పంచుకున్నారు. మార్పు మహోద్యమంలో ఎన్నారైలను భాగస్వాములను చేసేందుకు విదేశాలలోనూ సభలను నిర్వహించారు.


**రాజకీయ అవినీతికి కళ్లెం వేసే దామాషా ఎన్నికల పద్ధతి కోసం..**

ఒక్క ఓటుతో గెలుపోటములు తారుమారయ్యే ఎన్నికల వ్యవస్థ, ఓటును సద్వినియోగం చేసుకోవనివ్వని అవిద్య, పేదరికం, వివక్ష, కులం, మతం, ప్రాంతం వంటి భావోద్వేగాలు, అవినీతి ప్రభుత్వోద్యోగులు మనదేశంలో ఎన్నికలలో డబ్బు ప్రవాహాన్ని పెంచుతున్నాయని, రాజకీయ అవినీతిని మూలమని, దీనికి విరుగుడుగా దామాషా ఎన్నికల పద్ధతిని లోక్‌సత్తా ప్రతిపాదించింది. ఓట్ల శాతాన్ని బట్టి సీట్లు ఇచ్చేలా మన పరిస్థితులకు తగ్గ దామాషా ఎన్నికల పద్ధతి కోసం లోక్‌సత్తా చేసిన ప్రయత్నాలు 2004లో కమ్యూనిస్టులు కలిసిరాకపోవటం వల్ల తృటిలో విఫలమయ్యాయి. ఇప్పుడు వారూ కలిసివస్తున్నారు. అందరినీ కలిపి దామాషా ఎన్నికల వ్యవస్థను, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఇతర ఎన్నికల సంస్కరణలను తీసుకురావటానికి వీలున్న ప్రతి అవకాశాన్నీ లోక్‌సత్తా ంాగించుకుంటోంది.

**జన రాజకీయ యాత్ర, సురాజ్య ఉద్యమం,**

**సురాజ్య జన చైతన్య యాత్ర**

గత పాతిక సంవత్సరాలుగా ఇలా రకరకాల పేర్లతో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లో




తిరిగారు. ప్రజలను చైతన్యవంతం చేయటానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించాము. మనకి 1947లో స్వరాజ్యం వచ్చిందిగానీ సురాజ్యం రాలేదంటూ సురాజ్యానికి కావలసిన ఎజెండాపై పార్టీల మధ్య ఏకాభిప్రాయ సాధనకు హైదరాబాద్‌లో మూడు రోజుల సురాజ్య దీక్ష కూడా జేపీ నిర్వహించారు. బ్లాక్‌మెయిల్ కోసం కాకుండా కొన్ని లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కలిగించటంలో భాగంగా నిరాహార దీక్షను సాధనంగా ఉపయోగించి చూపిన సందర్భమిది. పార్లమెంటులో ఒక్క సభ్యుడు కూడా లేకుండా కొన్ని కీలక రాజ్యాంగ సవరణలను, చట్టాలను, పలు విధానపరమైన మార్పులను లోక్‌సత్తా సాధించి చూపింది.

**కృష్ణా కరకట్టల బలోపేతానికి నిధులు తేగలిగాం**

2009లో కృష్ణా నదికి 25లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు వరద నష్టం నివారణ చర్యల్లోనే కాకుండా సహాయపునరావాస చర్యల్లో కూడా లోక్‌సత్తా పాలుపంచుకుంది. బాధితులకు ఆహారపదార్థాలు, మందులు, దుస్తులు, మంచినీరు వంటి తక్షణావసరాల్ని అందించటంతోపాటు వరద ధాటికి దెబ్బతిన్న తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలోని నాలుగు గ్రామాలను (కేశవరం, దొడ్డిపాడు/పూలతోట, దక్షిణ చిరువోలులంక, వెంకటాజుపాలెం) దత్తత తీసుకుని అక్కడ పాఠశాలను పునర్నిర్మించటం, రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు, చిన్న ఎత్తిపోతల పథకం ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మద్యనియంత్రణ వంటి కార్యక్రమాలను చేసింది. వరద నష్టంపై ప్రధానమంత్రిని కలిసి, కేవలం 10-11 లక్షల క్యూసెక్కుల వరదను మాత్రమే తట్టుకునే అవకాశమున్న కృష్ణా కరకట్టల మరమ్మతుకు నిధులను జేపీ సాధించారు. పంట సీజన్లపై ప్రభావం చూపుతున్న వాతావరణ మార్పులపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు ఆవశ్యకతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అయితే కరకట్టల బలోపేతానికి నిధుల్ని ఇప్పటికీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వినియోగించుకోకపోవటం వల్ల జరుగుతున్న నష్టం ఇటీవల వరదల సమయంలో స్పష్టంగా కనిపించింది.

**తెలంగాణపై అన్ని ప్రాంతాల్లో ఒకే మాట**

రాష్ట్ర విభజనకు 2009లో తెలంగాణ ఉద్యమం మొదలయ్యాక అసాధారణ రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా ఏరోజూ

లోక్‌సత్తా మాట మార్చలేదు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లాగా ప్రాంతానికో మాట చెప్పలేదు. నది ఇవతల, నది ఆవల ఒకే మాట, ఒకే విధానం చెప్పింది. పార్టీలో గందరగోళం చెలరేగినా ఇరు ప్రాంతాల నాయకులనూ కలిపి కమిటీలు వేసి పరిష్కరించుకోమనే జేపీ చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు కూడా ఇదే రీతిలో నిబద్ధతతో వ్యవహరించినా, రాష్ట్రం ఏర్పాటు మౌలికమైన విషయమంటూ భావజాల వైఫల్యాన్ని ప్రదర్శించాయి. కానీ లోక్‌సత్తా నిబద్ధతతోపాటు రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవమూ కాదు, సర్వరోగ నివారిణీ కాదు అని భావజాల ప్రామాణికతను కూడా ప్రదర్శించింది.

**ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అడిగింది లోక్‌సత్తాయే**

రాష్ట్రం విడిపోవాలనే వైఖరి తీసుకుని ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పొందిన పార్టీలు ప్రాంతాలవారీగా చీలిపోయి అధ్యక్షులు పలాయనం చిత్తగించినా, ఆదాయమున్న హైదరాబాద్‌తో తెలంగాణ విడిపోతే ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అసెంబ్లీలో అడిగినది, ప్రాంతాలకతీతంగా మాట్లాడింది జేపీ ఒక్కరే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికీ ఇవ్వటమంటే కష్టంగానీ.. రాయలసీమకు ప్రత్యేక హోదా ఇవ్వటం సాధ్యమని, ఈ హోదా వస్తే మహారాష్ట్ర నుంచి కన్యాకుమారి వరకు పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జేపీ ప్రతిపాదించారు. దాంతోపాటు వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు కూడా ప్రత్యేక పన్ను రాయితీలిచ్చి పారిశ్రామికాభివృద్ధితో యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వచ్చేలా చేయాలని జేపీ కోరారు. హైదరాబాద్ అండ లేదు కాబట్టి, ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా రాష్ట్రాన్ని యూనియన్ ప్రభుత్వమే విడదీసింది కాబట్టి రాష్ట్రం రెవిన్యూలోటును కోలుకునేంత వరకూ జాతీయ స్థాయి ప్రభుత్వమే భర్తీ చేయాలన్నారు. నాయకుడంటే ప్రజల ఆకాంక్షలను గౌరవించటంతోపాటు గాలిమరలా కాకుండా దిక్సూచిలా వ్యవహరించాలని ఆచరణలో చూపారు. పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అంతకుముందు శ్రీకృష్ణ కమిటీకి నివేదిక ద్వారా కూడా లోక్‌సత్తా సూచించింది, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించింది లోక్‌సత్తా ఒక్కటే. చివరకు పార్లమెంటులో కూడా జేపీ సూచించిన పరిష్కారాలనే అధికార యూపీయే, ప్రతిపక్ష బీజేపీ సమర్థించాయి. రాయలసీమకు ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక రాయితీల్ని సూచించగా అత్యుత్సాహంతో మొత్తం రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడిగి ఆచరణసాధ్యంకాని పరిస్థితితో ప్రజలకు నష్టం చేశారుగానీ, మిగిలిన విషయాల్లో దాదాపు లోక్‌సత్తా చెప్పినవన్నీ యథాతథంగా చట్టంలో ఏర్పరిచారు. రెవిన్యూలోటు భర్తీ, పోలవరం పూర్తి, కోస్తాంధ్రలో జాతీయ సంస్థల ఏర్పాటు, తెలంగాణలో విద్యుత్తు ప్రాజెక్టు వంటి లోక్‌సత్తా సూచనలన్నీ విభజన చట్టంలో ఉన్నాయి.

**ఎఫ్‌డీఐలపై అబద్ధాలు చెప్పనిది లోక్‌సత్తాయే**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లను పెద్దఎత్తున రావటం భారత్‌లో వ్యవసాయం, పరిశ్రమలకు కావలసిన మౌలిక వసతులకు అవసరమని, దీనివల్ల రిటైల్ గొలుసు దుకాణాలు పెరిగి రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని, ఉపాధి పెరుగుతుంది తప్ప తగ్గదని మొదటి నుంచీ సమర్థించింది లోక్‌సత్తాయే. ఎఫ్‌డీఐలను వ్యతిరేకించిన పార్టీ అధికారంలోకి రాగానే రక్షణ సహా పలు కీలకరంగాల్లో 100శాతం ఎఫ్‌డీఐలను ఆహ్వానించగా, ఇంకొన్ని పార్టీలు తమ ఎంపీల చేత రాజ్యసభలో ఎఫ్‌డీఐలకనుకూలంగా ఓట్లు వేయించాయి.

**అణు ఒప్పందంపై దేశప్రయోజనాల కోసం నిలబడింది లోక్‌సత్తా మాత్రమే**

ఎఫ్‌డీఐలలాగానే 2008లో పౌరఅణుఒప్పందంపై అన్ని రాజకీయ పార్టీలూ ప్రభుత్వాన్ని వ్యతిరేకించినా లోక్‌సత్తా బహిరంగంగా నిర్ద్వంద్వంగా సమర్థించటంతోపాటు ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేసింది. భిన్న ధృవాలమని చెప్పుకుంటూ ప్రజల ఓట్లు చీల్చే ప్రయత్నం చేసే బీజేపీ, కమ్యూనిస్టులు అత్యంత అనైతికంగా పార్లమెంటులో కేవలం ప్రభుత్వాన్ని కూలదోయటం కోసమే కలిసినప్పుడు ఎండగట్టి లోక్‌సత్తా విధానపరంగా ప్రభుత్వానికి అండగా నిలిచింది. ఇప్పుడు ఇదే బీజేపీ ప్రభుత్వం అణుఒప్పందాన్ని విస్తరించటానికి అణుకూటముల్లో సభ్యత్వానికి తహతహలాడుతోంది.

**జన్యుమార్పిడి పంటలపైనా మాటమార్చని రాజకీయం**

ఎవరో కొందరు సంపన్నులు తినే ఆహారం వేరు, కోట్లాది సామాన్య ప్రజలు తినే ఆహారం వేరు అనే రోజుల నుంచి అందరికీ పౌష్టికాహారం దిశగా వెళ్లే అవకాశాలు అందివచ్చినా.. ఇంకా పాత బూజుపట్టిన భావాలను వదిలించుకోలేనివారు జన్యుమార్పిడి పంటలను వ్యతిరేకిస్తుంటే, ఓట్ల కోసం సాంప్రదాయ పార్టీలు వారిని సమర్థిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 29 దేశాలలో 16 కోట్ల హెక్టార్లలో జన్యుమార్పిడి పంటల్ని పండిస్తున్నా, భారత్ సహా 59 దేశాలలో వాటిని వినియోగిస్తున్నారని లెక్కలు కనిపిస్తున్నా జన్యుమార్పిడిని వ్యతిరేకిస్తున్నవారి పక్షానే సుప్రీంకోర్టు నియమించిన కమిటీ 2012లో మొగ్గుచూపటంపై రైతుసంఘాలతో కలిసి లోక్‌సత్తా న్యాయపోరాటం చేసి సానుకూల ఫలితాన్ని సాధించింది. లోక్‌సత్తా చొరవ వల్లే అప్పటి కేంద్రప్రభుత్వం కూడా జన్యుమార్పిడి పంటల పరిశోధనలకు అనుకూలంగా వాదించింది. అరకొర పరిజ్ఞానంతో కాకుండా పదివేల ఏళ్ల అంటు వ్యవసాయ సంస్కృతిని, జన్యుపంటలతో 200 కోట్లమంది ప్రాణాలను కాపాడిన నార్మన్ బోర్లాగ్ వంటి వారి కృషిని, ఇక్రిశాట్ వంటి సంస్థల విధానాలను చూసి జన్యుమార్పిడి పంటలపై నిర్ణయాలు తీసుకోవాలని, అర్హతగల శాస్త్రవేత్తలు, నియంత్రణా సంస్థలు మాత్రమే జన్యుపంటల సురక్షితంపై సర్టిఫై చేయాలని లోక్‌సత్తా వాదించింది.

**వాన్‌పిక్ దోపిడీని అసెంబ్లీలో బట్టబయలు చేసిన లోక్‌సత్తా**

దక్షిణ కోస్తాంధ్రలో కృష్ణపట్నం, మచిలీపట్నం, వాన్‌పిక్ ఓడరేవుల నిర్మాణం పేరుతో ఏకంగా 348 కిలోమీటర్ల

తీరప్రాంతాన్ని కేంద్రానికి కూడా తెలియకుండా ఒకే గ్రూపు సంస్థకు శాశ్వత ప్రాతిపదికన ఎం.వో.యూల పేరుతో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం రాసిచ్చేయటంపై 2011, మార్చిలో జేపీ అసెంబ్లీలో లేవనెత్తి తన హేతుబద్ధ వాదనలు, సాక్ష్యాధారాలతో ఆ కుంభకోణాన్ని బైటపెట్టారు. ఈ అవినీతి డీల్ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నేవల్ బేస్ విస్తరణ కోసం తీసుకున్న స్థలానికి పరిహారంగా కేటాయించిన పోర్టు ఏర్పాటు చేయటానికి స్థలమే లేకుండా పోయింది. చక్రవర్తుల హయాంలోలా ఇంకెవరూ తీరంలోకి అడుగుపెట్టటానికి వీల్లేకుండా జరిగిన ఆ డీల్‌పై లోక్‌సత్తా బైటపెట్టిన ఆధారాలతో విచారణకు అన్ని పార్టీలు కూడా డిమాండ్ చేయటంతో చివరకు ప్రభుత్వం తలవంచింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అవినీతిపై విమర్శలతో ఈ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు కొందరు సభ్యులు ప్రయత్నించినా, 1995 నుంచి భూముల కేటాయింపులపై నిరభ్యంతరంగా విచారణ చేపట్టొచ్చని జేపీ స్పష్టంచేశారు.

**ప్రజాప్రయోజనాల సెజ్‌ల ఏర్పాటుకు నాందిపలికిన లోక్‌సత్తా**

బ్రిటీషు దొరల కాలంలోలా ప్రజల నుంచి భూముల్ని ఎడాపెడా లాక్కుంటున్న రోజుల్లో పరిశ్రమల కోసం ప్రజలు ప్రాణాలర్పిస్తున్న రోజుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల తరపున పోరాడి వారికి అప్పట్లో అత్యధిక నష్టపరిహారాన్ని ఇప్పించటంతోపాటు రోడ్డున పడ్డ వారందరికీ యాజమాన్యం చేతే శిక్షణ ఉద్యోగాలను ఇప్పించి 8,000 కుటుంబాలను పరిరక్షించారు జయప్రకాష్ నారాయణ్. ఇందుకోసం గుమాస్తా నుంచి ముఖ్యమంత్రి వరకూ ఎందరినో కలిసి ఎన్నో వ్యయప్రయాసలకోర్చారు. ఈ నమూనాయే క్రమంగా ఈదేశంలో ప్రజాప్రయోజనాల భూసేకరణ చట్టానికి నాంది పలికింది. సెజ్‌ల్ని గుడ్డిగా అంగీకరించటమో, వ్యతిరేకించటమో లోక్‌సత్తా చేయదు. సెజ్‌లకు సేకరించే భూమిని మార్కెట్ రేటుకంటే కొన్ని రెట్లు ఎక్కువ చెల్లించి కొనుగోలు చేయాలని, సెజ్ అభివృద్ధితోపాటు ఆ స్థలాన్ని అమ్మిన యజమాని కూడా అభివృద్ధి చెందేలా, లాభాలలో వాటా ఇవ్వాలని, అవసరమైతే శిక్షణనిచ్చి మరీ ఉద్యోగావకాశం కల్పించాలని, పునరావాసం చూపించాలని లోక్‌సత్తా నిర్దిష్ట సెజ్ విధానాన్ని రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించి చాలామేర ఫలితాలను సాధించింది. ఒక ఊరిలో భూమిని కొందరి నుంచే సేకరించినా ఆ ఊరంతా నిర్వాసితులయ్యే ప్రమాదముంటే అందరికీ పునరావాసం చూపించాలని లోక్‌సత్తా విధానం స్పష్టం చేస్తోంది.

**అమరావతిలోనూ రైతులకు కొంత పరిహారం ఇమ్మనే చెప్పాం**

భూ సేకరణ చట్టాన్ని కేంద్రం రాష్ట్రాల మీద రుద్దకుండా స్వేచ్ఛనివ్వాలని కోరే లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భూ సమీకరణ విధానాన్ని పూర్తిగా సమర్థించింది. అయితే పునరావాస ప్యాకేజీ విషయంలో విభేదించింది. రైతులకు అభివృద్ధి చేసిన స్థలాన్ని ఇవ్వటంతోపాటు ముందుగా వారికి ఎకరాకు కనీసం రూ.10లక్షల పరిహారం కూడా చెల్లిస్తే వారు మరోచోట తక్కువ ధరకే భూముల్ని కొనుక్కునే అవకాశముండేదని వాదించింది.

**ప్రాణహిత-చేవెళ్ల/ కాళేశ్వరంపై తీవ్ర వ్యతిరేకతల మధ్యే పోరాటం**

తెలంగాణకు వరదాయిని అంటూ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల వాస్తవానికి తెలంగాణకు గుదిబండ అవుతుందని, తెల్లఏనుగులాంటి ఆ ప్రాజెక్టు మీద వెచ్చించే డబ్బుతో తెలంగాణ ప్రాంతంలో 20లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయటంతోపాటు 10లక్షలమందికి శాశ్వత ఉపాధిని కల్పించవచ్చని లోక్‌సత్తా 2008 నుంచే పోరాడుతూ వచ్చింది. ఆ భారీ ఎత్తిపోతలకు 3,500 మెగావాట్ల విద్యుత్తు ఖర్చవుతుందని, నిర్వహణ వ్యయంతో కలుపుకుని ఎకరాకు రూ.2.5లక్షల పెట్టుబడి అవుతుందని, ఏరకంగా ఇది రైతుకు లాభసాటి అవుతుందని జేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తట్టెడు మన్ను తియ్యకుండా, ఒక్క ఇటుక పేర్చకుండా రూ.1000 కోట్లు కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ ఎలా ఇచ్చారని నిలదీశారు. తర్వాత తెలంగాణ ఉద్యమం వచ్చాక కూడా తెలంగాణ సెంటిమెంట్‌కు ప్రాణహిత-చేవెళ్ల సంకేతంగా పలువురు ఉద్యమకారులు భావించినా లోక్‌సత్తా ప్రజాప్రయోజనాల దిశగా తన పోరాటం కొనసాగించింది. చివరకు తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు కూడా జేపీ వాదనను సూర్యాపేట సభలో సమర్థించారు. ఆయన ముఖ్యమంత్రయ్యాక రీడిజైన్ చేసి కాళేశ్వరం పేరుతో మళ్లీ అదే తరహాలో గుదిబండల్లాంటి ఎత్తిపోతల పథకాలను ప్రారంభించటం ప్రజల దురదృష్టం. ఆటనియమాలు మారకుండా ఆటగాళ్లు మారితే ప్రయోజనం ఉండదు గదా!

**కేంద్ర అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని 17ఎపై పార్లమెంటు సభ్యులను అప్రమత్తం చేసిన లోక్‌సత్తా**

జాతీయ స్థాయిలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టం, 1989కి ప్రతిపాదించిన సవరణలలో ప్రభుత్వోద్యోగులను విచారించాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలని, అదే లంచం ఇచ్చిన పౌరుల్ని మాత్రం వెంటనే అరెస్టు చేయొచ్చని చేసిన 17ఎ ప్రతిపాదన అవినీతిపై పోరును ఎలా నీరుగారుస్తుందో హెచ్చరిస్తూ లోక్‌సత్తా ప్రభుత్వానికి, పార్లమెంటు సభ్యులకు, అన్ని పార్టీలకూ లేఖలు రాసింది. అధికారులకు జీతభత్యాలు పెంచి వారిని అండతో దేశాన్ని ఏలాలి, ప్రజలు కేవలం ఓటుబ్యాంకులే అనుకుంటే చివరకు దేశం తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించింది. అయితే అన్ని పార్టీలూ ఏకమై ఆ ప్రజావ్యతిరేక సవరణను ఆమోదించాయి.

**ప్రకృతి శాపం కాదు.. పాలకుల పాపమే.. స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య**

మార్కెట్ దోపిడీని అరికట్టి రైతుకి లాభసాటి ధర లభించేలా సంస్కరణల కోసం "స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య" పేరిట లోక్‌సత్తా నిర్మాణాత్మక కృషి చేసింది. తనకు ఎక్కువ ధర లభిస్తున్నప్పుడు రైతు దేశంలోని ఏ ప్రాంతంలోనైనా పంటను

తీసుకెళ్లి అమ్ముకోవచ్చు, చేతనైతే అరెస్టు చేయండి అంటూ వేలాది రైతులతో కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు బియ్యం మూటల్ని భుజాన పెట్టుకుని వెళ్లి జేపీ అమ్మారు. అప్పటిదాకా రైతులను పక్క జిల్లాలో కూడా పంటలు అమ్మకూడదని దబాయిస్తున్న ప్రభుత్వం కిమ్మనలేదు. దీంతో పంటల మార్కెటింగ్‌పై ఆంక్షలు తొలగి తెలుగునాట ఒక్క సీజన్‌లోనే ఒక్క బీపీటీ వెరైటీ ధాన్యం రైతులకే రూ.3,600 కోట్ల మేర లాభం చేకూరిందని అంచనా. అలాగే లోక్‌సత్తా కృషి వల్లే ఆహారధాన్యాల ఎగుమతులపై ఆంక్షల్ని 2011లో కేంద్రప్రభుత్వం తొలగించింది. బియ్యం ఎగుమతుల్లో భారతదేశం కొద్దికాలంలోనే నెంబర్‌వన్ అయింది. ఒడిదుడుకులున్నా ఇప్పటికీ ఆహారధాన్యాల ఎగుమతులు ఆగకుండా కొనసాగుతున్నాయి. ఈ ఒరవడిలోనే రైతులకు మార్కెట్ సంకెళ్లను తెంచుతూ 2020లో కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ చట్టాల్ని, సవరణల్ని తీసుకొచ్చింది. ఎన్నికల రాజకీయాల కోసం వీటిని రద్దు చేసినా, రైతులు, దేశ ప్రయోజనాల కోసం త్వరలోనే వీటిని పట్టాలెక్కించక తప్పదు.

**ఉచితాలపై సకాలంలో స్పందించింది లోక్‌సత్తాయే**

ఆహారానికి అవసరమైన బియ్యం వంటి వాటిని ఉచితంగా ఇస్తామనే ఎన్నికల హామీలను చర్చించవచ్చని, కానీ కలర్ టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు వంటి వాటి ప్రజలకు మేలు జరగకపోగా ప్రలోభాలతో ఓట్లు వేసే అవకాశముందని, విద్య, ఆరోగ్యం వంటి కనీసావసరాలకు నిధులు తగ్గుతాయని, తక్షణం చర్య తీసుకోవాలని కోరుతూ 2008లో కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ హామీలపై, 2009లో తెలుగుదేశం హామీలపై ఎన్నికల సంఘానికి జేపీ లేఖలు రాశారు. ఆనాడు ఎన్నికల సంఘం స్పందించి ఉంటే 2016లో తమిళనాడులో పార్టీలు ఇష్టమొచ్చినట్టు హామీలిచ్చేవి కావు. ప్రజలను మత్తులోకి నెట్టే పనులు కాకుండా వారి జీవితాల్ని బాగు చేసే రాజకీయం ఎజెండాగా మారేది. పొరుగున ఉన్న శ్రీలంక సంక్షోభాన్ని చూశాక ఇప్పుడు మితిమీరిన ఉచితాలు, అప్పుల వల్ల నష్టమేంటో మన వద్ద కూడా కొంత తెలిసొచ్చింది. జాతీయ స్థాయి ప్రభుత్వం కదిలింది. దీనికితోడు సుప్రీంకోర్టు కూడా కొంత చొరవ తీసుకోవటంతో ఒక మంచి వాతావరణంలో ఉచితాల కట్టడి దిశగా చర్చ మొదలైంది. జాతీయ స్థాయి ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా తనకున్న అధికారాన్ని ఉపయోగించి తాత్కాలిక పథకాలకు–అభివృద్ధికి మధ్య సమతుల్యతను సాధించేలా ఉచితాలను ఒక పరిధిలోకి నియంత్రించాలి. అప్పుల నియంత్రణకు ఇప్పటికే అమల్లో ఉన్న ఎఫ్‌ఆర్‌బీఎం చట్టాన్ని, దాంతోపాటు కొత్తగా ఉచితాల నియంత్రణను సమర్థంగా, రాజకీయ విమర్శలకు అతీతంగా అమలు చేసేందుకు ఆ బాధ్యతను జాతీయ ఆర్థిక సంఘానికో, మరో స్వతంత్ర సంస్థకో అప్పచెప్పాలని యూనియన్ ప్రభుత్వాన్ని లోక్‌సత్తా కోరింది.

**రాజకీయాల్లో ధన ప్రభావంపై జాతీయ సదస్సు - హైదరాబాద్ డిక్లరేషన్**

రాజకీయాల్లో డబ్బు ప్రభావంపై అనేక సదస్సుల్ని, కార్యక్రమాల్ని లోక్‌సత్తా గత కొన్నేళ్లలో నిర్వహించింది. స్వయంగా ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా పోటీ చేసింది. 2020 జనవరిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) పేరుతో జాతీయ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించింది. "మనీ పవర్ ఇన్ పాలిటిక్స్" థీమ్‌తో జరిగిన ఈ సదస్సులో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతోపాటు కేంద్ర,



రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు, మేధావులు, విదేశాల నుంచి వచ్చిన అధ్యయనకారులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు. సొంత డబ్బుతో రిజిస్ట్రేషన్ చేసుకుని మరీ యువత వచ్చారు. భారత ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తోంది, లోపాలకు పరిష్కారాలేమిటి? అనే ప్రయత్నంలో భాగంగా లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ నిర్వహించిన మొదటి జాతీయ సదస్సు ఇది. ధన రాజకీయాల ప్రభావాన్ని తగ్గించటానికి 'హైదరాబాద్ డిక్లరేషన్' పేరుతో సమగ్ర పరిష్కారాల్ని ఇందులో వెలువరించి ప్రభుత్వాలకు పంపారు.

**చట్టబద్ధపాలనపై ఐడీఏడబ్ల్యూ ద్వితీయ సదస్సు**

ఐడీఏడబ్ల్యూ ద్వితీయ సదస్సును వర్చువల్‌గా 'చట్టబద్ధపాలన'పై 2021 ఫిబ్రవరిలో నిర్వహించారు. ఒక రాజకీయ ఉద్యమ నేపథ్యమున్న సంస్థ చట్టబద్ధపాలన అంశం మీద ఇంత విస్తృత సదస్సు నిర్వహించటం బహుశా భారతదేశ చరిత్రలో ఇదే ప్రథమం. 9 రోజులు – 15 సమావేశాలు – వివిధ రాష్ట్రాలు, బ్రిటన్, అమెరికా, స్పెయిన్ నుంచి పాల్గొన్న 50కి పైగా నిష్ణాతులతో మారథాన్‌లా సదస్సు జరిగింది. ఎఫ్‌డీఆర్ అధ్యయన బృందం రూపొందించిన '21వ శతాబ్దంలో చట్టబద్ధపాలన' చర్చా పత్రంలోని అంశాలపై వీరంతా చర్చించారు. సమన్యాయానికి ఆచరణాత్మకంగా ఏం చేయవచ్చో విలువైన అభిప్రాయాల్ని అందించారు. ఈ మొత్తం అభిప్రాయాల

సారాంశం.. న్యాయవ్యవస్థను ఆధునిక ప్రజాస్వామ్య అవసరాలకనుగుణంగా వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద ఆధారపడేలా సంస్కరించటం. సదస్సులో పాల్గొన్న ఉద్దండులు వివిధ అంశాలపై కొంత భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసినా స్థూలంగా ఏకాభిప్రాయానికొచ్చారు. తదనుగుణంగా 12 పరిష్కారాలతో 'చట్టబద్ధపాలనపై హైదరాబాద్ డిక్లరేషన్ 2021'ను విడుదల చేశారు. ఇందులో.. ఆధునిక సమాజ సవాళ్లకనుగుణంగా తగినంత మంది పోలీసు సిబ్బంది, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసు శిక్షణ ప్రారంభంలోనే ప్రత్యేక తర్ఫీదు, ఆధునిక అవసరాలకు తగ్గట్టు ఫోరెన్సిక్ వసతుల విస్తృత పెంపు, పోలీసుల్లో శాంతి భద్రతల విభాగం నుంచి నేర పరిశోధనా విభాగాన్ని వేరు చేసి రాజకీయ



జోక్యం లేకుండా జవాబుదారీతనంతో స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఏర్పాటు, మూడేళ్లకు పైబడి శిక్ష పడే అవకాశమున్న నేరాల్ని ఆ సంస్థ పరిధిలోకి తేవటం, జిల్లా స్థాయిలో బలమైన ప్రాసిక్యూషన్ వ్యవస్థ, విచారణ సులభంగా, తక్కువ ఖర్చుతో ఉండేలా క్రిమినల్ ప్రొసీజర్ చట్టాల సవరణ, న్యాయవ్యవస్థ వైపు నుంచే కాకుండా సమాజ అనుభవాల నుంచి కూడా సంస్కరణల్ని రూపొందించటంలో భాగంగా స్టే ఉత్తర్వులకు కాలవ్యవధి, తీర్పులిచ్చే తేదీని ముందుగానే ప్రకటించటం వంటి చర్యలు, జడ్జిల సంఖ్య, జీతభత్యాలు, మౌలిక సౌకర్యాల పెంపు, స్థానిక కోర్టుల ఏర్పాటు, పాలనా వ్యవహారాలు చూడటానికి జ్యుడీష యల్ మేనేజర్లు, క్లర్కుల వ్యవస్థ, రాజ్యాంగ కోర్టుల్ని ప్రాథమి కంగా రాజ్యాంగ అంశాల బాధ్యతకు పరిమితం చేయటం ద్వారా పటిష్ఠ పరచటం, శాశ్వత రాజ్యాంగ బెంచ్‌ల ఏర్పాటు, అత్యుత్త మ సామర్థ్యమున్న యువత జడ్జిలుగా ఎంపికయ్యేలా అఖిల భారత సర్వీసు, అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదులను పరిష్కరిం చేందుకు ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయ ప్రమాణాలు, జవాబు దారీ వ్యవస్థ ఏర్పాటు ఉన్నాయి. ఈ డిక్లరేషన్‌లోని అంశాలను కూడా ప్రభుత్వాలకు పంపి అమలుకు లోక్‌సత్తా కృషి చేస్తోంది.

**ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని తెలిసినా ప్రజాప్రయోజనాల వైపే మొగ్గు**

ప్రజాస్వామ్యంలో నాయకుడంటే ప్రజలు కోరుకున్నది చేయటం మాత్రమే కాదు, ప్రజలు తిరస్కరిస్తున్నా వారికి మంచిదైన పనిని చేయటం అని లోక్‌సత్తా భావిస్తుంది. అందుకు కొల్లేరు పోరాటాలు, రాష్ట్ర విభజన ఉద్యమాలు మచ్చుకు ఉదాహరణలు. కొల్లేరులో పర్యావరణం ముసుగులో ప్రజల పొట్టగొట్టే చర్యలకు ప్రభుత్వం, ప్రధాన మీడియా పాల్పడినప్పుడు, ప్రజలూ కలిసిరానప్పుడు కూడా 2006లో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి ముందు స్థానికులకు ఉపాధి కల్పించాలనే జేపీ వాదించారు. తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో పలుమార్లు తనను అడ్డుకున్నా, దుర్భాషలాడినా, రాజకీయంగా తీవ్ర నష్టం జరుగుతున్నా రాష్ట్ర విభజన విషయంలో సామరస్యంగా పరిష్కారానికే జేపీ కట్టుబడి వ్యవహరించారు.

**లోక్‌సత్తా పేటెంట్ పదాలు**

ఒక నూతన భావజాలాన్ని తయారుచేసి తానే వేదికను నిర్మించి తానే ప్రచారం చేసిన నాయకులు ప్రపంచ చరిత్రలో చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటివారిలో లోక్‌సత్తా జేపీ ఒకరు. బర్మాలో ఆంగ్‌సాన్ సూచీలాంటి గొప్ప ప్రజాస్వామ్యయోధురాలికి కూడా వెనకన కొంత కుటుంబ నేపథ్యం కలిసివచ్చింది. జేపీ బహుముఖ సామర్థ్యంతో లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని నిర్మించారు. అందులోని ప్రతి అక్షరాన్నీ స్వయంగా రాసుకున్నారు. అనేక కొత్త భావజాల పదాల్ని, వాక్యాల్ని రూపొందించారు, వాడుకలోకి తెచ్చారు. ప్రజలే ప్రభువులు-పాలకులు సేవకులే, కొత్త తరానికి కొత్త రాజకీయం, వ్యక్తిసుఖాన్ని సమాజహితాన్ని సంధానం చేయటం, మంచి రాజకీయాన్ని మించిన పవిత్ర వ్యాసంగం లేదు, చెడ్డ రాజకీయానికి విరుగుడు మరింత మంచి రాజకీయమే వంటివి లోక్‌సత్తా పేటెంట్ స్థాయిలో ప్రాచుర్యం పొందాయి.

**విధానాలను ఫిరాయించకుండా, వాటి సాధనకు అన్ని పార్టీలతో అంటకాగిన లోక్‌సత్తా**

లోక్‌సత్తా కాంగ్రెస్ ఏజెంటని, తెలుగుదేశంతో కలిసి పనిచేస్తుందని, వైకాపాతో లోపాయికారీ ఒప్పందం ఉందని, బీజేపీతో అంటకాగుతుందని, కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసిందని ఇలా రకరకాల విమర్శలు. ఇంతమందితో కలిసి పనిచేయటమంటే లోక్‌సత్తా కచ్చితంగా ఈదేశం కోసమే పనిచేస్తుందని వేరే రుజువులక్కర్లేదు. దేశ ప్రయోజనాల కోసమే యూపీయే-1 ప్రభుత్వ హయాంలోని జాతీయ సలహామండలి (ఎన్ఏసీ)లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పనిచేశారు. అందులో పనిచేయటాన్ని అవకాశంగా వినియోగించుకునే ఆయన జాతీయ ఆరోగ్య మిషన్, స్థానిక న్యాయాలయాల చట్టం, ఉపాధి హామీ, సహకార సంఘాల స్వయంప్రతిపత్తి వంటి కీలక చట్టాల్ని అందించారు. రెండో పరిపాలనా సంస్కరణల సంఘంలో (ఏఆర్‌సీ)లో పనిచేసి ఆధునిక భారత్‌కు కావలసిన అనేక పాలనా సంస్కరణల్ని అందించారు. అలాగే ప్రస్తుత రాష్ట్ర, యూనియన్ ప్రభుత్వాలకు కూడా అడిగినా అడక్కున్నా లోక్‌సత్తా తన సహాయ సహకారాల్ని అందిస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం మనది, పార్టీ వారిది. ప్రతి పక్ష పార్టీలకు కూడా జేపీ నిర్మాణాత్మక సూచనలనిస్తుంటారు.

### ప్రజలందరికీ 'జేబుఖర్చులేని నాణ్యమైన ఆరోగ్యం' అందించే సమగ్ర విధానం

మన ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం వల్ల ఏటా 5.5 కోట్ల మంది ప్రజలు కొత్తగా పేదరికంలోకి జారిపోతున్నారు. ఈ సంఖ్య తెలంగాణలో 19 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 26 లక్షలుగా ఉంది. మన ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం వల్లే కొవిడ్ కాలంలో లక్షల మంది అకాల మరణం బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో, జాతీయాదాయంలో కేవలం 2శాతం లోపు ఖర్చుతో అందరికీ ఆరోగ్యాన్ని అందించటంతోపాటు దాదాపు 2 కోట్ల ఉద్యోగాలను అందించే సమగ్ర ఆరోగ్య విధానాన్ని 2021లో ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించి ప్రభుత్వాలకు అందచేసింది, ప్రజల ముందుంచింది. దీంట్లో భాగంగా ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్లు, పట్టణాల్లో ప్రయివేటు నర్సింగ్ హోంల భాగస్వామ్యం, పెద్ద జబ్బులకు ఆధునీకరించిన ప్రభుత్వాస్పత్రుల్లో ప్రయివేటు నిపుణుల సేవలను కూడా భాగం చేస్తూ వైద్యం చేసే వ్యవస్థ ఉంటుంది. డాక్టర్ల మధ్య పోటీ ఉండి ప్రజలకు ఎంత నాణ్యమైన సేవలందిస్తే వైద్యులకు అంత ఆదాయం పెరుగుతుంది. ఈ విధానం అమల్లోకి వస్తే కోట్ల మందికి ఎటువంటి వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్య ఆరోగ్యం అందుతుంది, దేశ ఉత్పాదక శక్తి పెరుగుతుంది. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా చేసిన నిశ్శబ్ద కృషిలో ఇంకా పలు బహుముఖ అంశాలున్నాయి. అయినా చేయాల్సింది ఎంతో ఉంది. ఇప్పటి వరకూ సాధించిన వాటిలో కూడా ప్రభుత్వాల ఉదాసీనతో, కోర్టులు కొట్టివేయటమో వంటి కారణాల వల్ల కొన్ని సంస్కరణల అమలు కోసం ఇంకా పనిచేయాల్సి ఉంది. ఉదాహరణకు, పార్టీ ఫిరాయింపుల చట్టం, పార్టీల విరాళాల సేకరణ, స్థానిక కోర్టులు, ఎన్‌జేఏసీ, లోక్‌పాల్, పౌర సేవల చట్టం, జాతీయ విద్యావిధానం అమలు, సహకార సంఘాల చట్టం మొదలైనవి.

లోక్‌సత్తా సాధించిన విజయాలు ఒక సంస్థ విజయాలు కావు.. అవి ప్రజావిజయాలు. అందుకే వాటిని ప్రజలకే అంకితం చేస్తున్నాం. ప్రజలను చైతన్యపరుస్తూ, వారిలో అవగాహన పెంచుతూ, అదే సమయంలో ప్రభుత్వాలను, రాజకీయ వ్యవస్థను స్పందింపచేసేందుకు కృషి చేస్తూ దేశ రాజకీయానికి కొత్త ఒరవడి దిద్దిన లోక్‌సత్తా ప్రస్తుతం ప్రజాస్వామిక సంస్కరణలపై సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువమందిని, ముఖ్యంగా యువతను చేరుకునే ప్రయత్నం చేస్తోంది. లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో పనిచేస్తున్న మనమందరం అలుపెరగని బాటసారుల్లా మరింత స్ఫూర్తితో ముందుకు పోవటానికి మార్గాలను సుగమం చేసుకోవాలని, కొత్త తరం నాయకులను తయారుచేయాలని ఆశిస్తున్నాం. అభినందనలు.

## విద్యాప్రమాణాలను పెంచేందుకు డిజి కంటెంట్ ఉమ్మడి వేదికగా ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా

విద్యను బాగుచేయటానికి తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో అనేకమంది ఎంతో ఆర్తితో కృషి చేస్తున్నారని, పాఠశాల విద్యాప్రమాణాలను పెంచటానికి అలాంటివారి సేవలను ప్రభుత్వాలు ఉపయోగించుకోవాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ అన్నారు. కాకినాడలో డిజిటల్ కంటెంట్ తయారుచేస్తున్న ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలతో జేపీ సమావేశమై ప్రాథమికంగా చర్చించారు. విద్య అంటే మౌలిక వసతులు మాత్రమే కాదని, విద్యార్థులకు విద్యాసామర్థ్యాలు పట్టుబడటం అసలు లక్ష్యమని ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని.. ఈ దిశగా తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో ఒక పరిపక్వ వాతావరణం ఏర్పడుతోందన్నారు. కాకినాడలో ఇది మరింత ప్రస్ఫుటంగా ఉందని అందువల్ల డిజి కంటెంట్ నెట్‌వర్కింగ్ కార్యాచరణను ఇక్కడ్నుంచి ప్రారంభిద్దామని అన్నారు. దేశంలో పాఠశాల విద్యలో దాదాపు 25.5 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని.. ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా కాకినాడ నుంచి తెలుగు రాష్ట్రాలకు, ఆ తర్వాత దేశానికి ఎంత విస్తరించగలిగితే అంత మేర విద్యాప్రమాణాల కోసం కృషి చేద్దామన్నారు. కమ్యూనికేట్ చేసే భాషా సామర్థ్యం, కాన్సెప్ట్‌ని అర్థం చేసుకుని సమస్యల్ని పరిష్కరించగలగటం, తార్కిక విశ్లేషణ, అన్వయించే శక్తి .. విద్యార్థుల్లో వీటిని పెంపొందించటం ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని, పరీక్షల్లో మార్కులు వగైరాలు ఆ తర్వాతి అంశాలని అన్నారు. ఒకరు చెప్పిందే ఇంకొకరు చెప్పకుండా, నాణ్యతపరంగా రాజీ లేకుండా మంచి కంటెంట్ వీడియోలను, పి.పి.టిలను, ప్రాక్టికల్ అనుభూతుల కోసం కరదీపికలను తయారుచేద్దామని సమావేశంలో చర్చ అనంతరం నిర్ణయించారు. డిజిటల్ కంటెంట్ నెట్‌వర్క్ వేదికగా ఎఫ్‌డీఆర్ కృషి చేయటానికి అవసరమైన సంస్థాగత, కంటెంట్ వివరాలను అందించాలని, వెంటనే పని ప్రారంభించాలని ఉపాధ్యాయులను, సంస్థలను జేపీ కోరారు. తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి నిబంధనలకు అనుగుణంగానే ఉందని, అయితే పలు స్కూళ్లలో సమతూకం లేదని, అందువల్ల స్కూళ్లను విలీనం చేయడం మంచిదేనని జేపీ అన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త ఉప్పలపాటి మాచిరాజు, రాష్ట్ర సమన్వయ సభ్యుడు ఎస్.ఎస్.ఆర్ జగన్నాథరావు, వి.ఎ.వి రామకృష్ణ, వినయ్ హోనాక్, రవిశంకర్, ఎం. పద్మామణి, ఆకుల శ్రీనివాస్, రమేష్, వెంకటరావు, బి.వి.బి.ఎల్ నారాయణ, వెంకన్నబాబు, వి.ఆదిత్య, హనుమాన్, జగన్నాథరాజు, రాజేష్ రాందాస్, రామకృష్ణరాజు, పడాల సూర్యప్రసాద్, చంద్రు జానకి, రాంప్రసాద్, సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా ఉద్యమం..25 ఏళ్ల ప్రస్థానం

**శిరమని నరేష్**

**భారత ప్రజాస్వామ్యాన్ని సమూలంగా సంస్కరించాలి అనే మహోన్నత ఆశయంతో ప్రారంభించిన లోక్‌సత్తా ఉద్యమానికి ఈ ఆగస్ట్ 3వ తేదీతో 25 ఏళ్ళు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో లోక్ సత్తా ఆవిర్భావం, విస్తరణ, రాష్ట్ర దేశ రాజకీయాలు, పాలనావిధానాలపై లోక్‌సత్తా చూపిన ప్రభావం గురించి ఒక్కసారి సింహావలోకనం చేసుకునే ప్రయత్నం ఇది.**

ఐఎస్ఎస్ అధికారిగా మంచి పేరున్న డా.జయప్రకాశ్ నారాయణ్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నారు అనే వార్త 1996లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది..దేశంలో పెరుగుతున్న అవినీతి పై కలత చెందుతున్న ఎంతోమంది మేధావులు, మధ్యతరగతి బుద్ధిజీవులలో ఒక ఆశని రేకెత్తించింది. ఐఏఎస్ కు రాజీనామా చేసాక, జెపి, మరికొంతమంది ప్రముఖులతో కలిసి ప్రజాస్వామ్యపీఠం అనే అధ్యయన సంస్థని ప్రారంభించారు. ఈనాడు పత్రికలో 'భవిష్యత్ భారతం' శీర్షికలో డా.జెపి రాసిన వ్యాసాలు, ఈటీవీలో ప్రతిధ్వని చర్చా కార్యక్రమంలో డా.జెపి వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. డా.జెపి, రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాలలో సదస్సులు నిర్వహిస్తూ, ఈ ఉద్యమం కోసం కలసివచ్చే వ్యక్తులు, సంస్థలను గుర్తించడం మొదలుపెట్టారు. ఈ ఉద్యమానికి లోక్‌శక్తి అనే పేరు పెట్టాలని జెపి అనుకున్నారు. అదే సమయంలో కర్ణాటకలో సీనియర్ నాయకుడు రామకృష్ణ హెగ్డే లోక్‌శక్తి పేరుతో ఒక రాజకీయపార్టీని ప్రారంభించడంతో, డా.జెపి తన ఉద్యమ సంస్థకి లోక్‌సత్తా అని పేరు పెట్టారు.

1997 ఆగస్ట్ 3 న హైదరాబాద్ లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో లోక్‌సత్తా ఆవిర్భావ సదస్సు జరిగింది. రిటైర్డ్ ఎయిర్ చీఫ్ మార్షల్ లతీఫ్, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య సహా ఎంతోమంది ప్రముఖులు, 23 జిల్లాల ప్రతినిధులతో లోక్‌సత్తా ఉద్యమ సన్నాహక సదస్సు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది.

1997 ఆగస్ట్ నుండి 1998 వరకు సంస్థాగత నిర్మాణం, రాష్ట్ర స్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు చేపట్టాల్సిన కార్యక్రమాల రూపకల్పన కోసం కేటాయించారు. ప్రభుత్వ కార్యాలయాలలో సేవలు పొందడం మన హక్కు అనే నినాదంతో, స్వరాజ్యం పేరుతో ఒక గొప్ప పుస్తకాన్ని తీసుకొచ్చారు. జనన ధృవీకరణ పత్రం నుండి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ దాకా, దాదాపు 100 ప్రభుత్వ సేవల గురించి సమగ్ర సమాచారాన్ని ఈ




పుస్తకంలో పొందుపరచారు. 1998 అక్టోబర్ 2 న ఈ పుస్తకం ఆవిష్కరణ చేయడంతో పాటు, లోక్ సత్తా మొట్టమొదటి ప్రజానిఘా కార్యక్రమం చేపట్టింది. అదే పెట్రోల్ బంకులలో తనిఖీ. జెపి సహా వందలమంది కార్యకర్తలు హైదరాబాద్ లో పెట్రోల్ బంకుల్లో కొలతల్లో జరుగుతున్న మోసాలు, కల్తీలని మీడియా సాక్షిగా నిరూపించారు. దీనితో అలర్ట్ అయిన ప్రభుత్వ యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకులపై తనిఖీలు చేసింది. కొన్నిటిని సీజ్ చేసింది కూడా. లోక్ సత్తా చేసిన ఈ ఉద్యమం ఫలితంగా పెట్రోల్ బంకుల్లో మూడు మార్పులు వచ్చాయి. 1.పెట్రోల్ బంకు వారు ప్రతిరోజూ, ఒక వినియోగదారుడి సమక్షంలో లీటర్ కొలతపాత్రలో పెట్రోల్ నింపి, కొలత సరిగ్గా ఉందని నిర్ధారించాలి. ఆ వినియోగదారుని పేరు, తనిఖీ చేసిన సమయం బోర్డుపై ప్రదర్శించాలి. 2. ఫిల్టర్ పేపర్ సహాయంతో పెట్రోల్ నాణ్యతని పరీక్షించుకునే అవకాశం వినియోగదారులకి కల్పించడం . 3.ఏ వినియోగదారుడు అయినా కొలతపాత్ర తీసుకుని వెళ్లి దానిలో పెట్రోల్, డీజిల్ నింపించి కొలత సరిగ్గా ఉందా లేదా అని చెక్ చేసుకునే అధికారం కల్పించడం. ఈ మూడు మార్పులు వచ్చాయి.ఈ మూడు మార్పులు దాదాపు పదేళ్ళు అమలు జరిగాయి.వీటి ద్వారా ప్రజలకి వందలకోట్ల రూపాయల ప్రయోజనం కలిగింది. దీని తర్వాత కొంత కాలానికి డిజిటల్ మీటర్లు వచ్చాయి. తర్వాత క్రమేణా కొత్త తరహా మోసాలు మొదలయ్యాయి. కానీ, ఓ ఐదేళ్ళ క్రితం వరకు కూడా ఆటో డ్రైవర్లు లీటర్ బాటిల్ లో డీజిల్/పెట్రోల్ నింపించి చెక్ చేసుకునేవారు. హైదరాబాద్ లో ఒక దుర్ఘటన జరిగాక బాటిల్స్ లో పెట్రోల్ పోయకూడదు అని పోలీసులు ఆంక్షలు పెట్టారు. అయితే, లోక్ సత్తా 1998 లో చేసిన పెట్రోల్ బంకుల తనిఖీ కారణంగా కొన్నేళ్ళపాటు కొలతల్లో మోసాలు గణనీయంగా తగ్గాయి. ఇప్పుడు మళ్ళీ



పెట్రోల్ బంకుల్లో మోసాలు పెరిగాయని వార్తలు వస్తున్నాయి. లోక్ సత్తా కార్యకర్తలు ఇప్పుడు కూడా ఈ తనిఖీ కార్యక్రమం చేపడితే, ఉద్యమానికి ఒక ఊపు వస్తుంది.

ప్రభుత్వం అందించే ప్రతి సేవకి, సేవ పొందాలి అంటే పౌరులు ఏమి చేయాలి అనేది స్పష్టంగా పౌరులకి తెలపాలని, ఉద్యోగులు ఆ సేవ ఎన్ని రోజులలోపు అందించాలి అనే కచ్చితమైన గడువు ఉండాలని, గడువు లోపు సేవ అందించ లేకపోతే పౌరులకి నష్టపరిహారం ఉద్యోగులకి జరిమానా ఉండాలని..దీనికోసం ప్రతి ప్రభుత్వ శాఖ సిటిజెన్ చార్టర్ ప్రకటించి అమలు చేయాలని లోక్ సత్తా ఉద్యమించింది. ఈ ఉద్యమ ఫలితంగా దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలు సిటిజెన్ చార్టర్స్ ప్రకటించాయి. పౌరులకి నష్టపరిహారం మాత్రం కొన్ని శాఖలే ప్రకటించాయి.

ప్రజలే ప్రభువులు అనే లోక్ సత్తా నినాదం, రాష్ట్రంలో పెద్ద మార్పే తీసుకొచ్చింది. ప్రభుత్వాలు నడిచేది తమ పన్నుల డబ్బుతోనే అని ప్రజలు అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు. ప్రజాప్రతినిధులని, ప్రభుత్వ ఉద్యోగులని నిలదీసే ధైర్యాన్ని ప్రజలకి కలిగించింది. అందుకే, ఇప్పుడు ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ప్రజలు అవి తమ హక్కు అని అనుకుంటున్నారు తప్ప, ప్రభుత్వ అధినేతల ఔదార్యం అని అనుకోవడం లేదు. విద్య, ఆరోగ్యం, ఉపాధి ఈ మూడు అంశాలలో తప్ప, ఇతర ఏ సంక్షేమ పథకము ఓట్లు తెస్తుంది అనే గ్యారంటీ లేని పరిస్థితి వచ్చింది.

మన దేశంలో పెరుగుతున్న అవినీతికి మూలం మన ఎన్నికల వ్యవస్థ అని బలంగా విశ్వసించే లోక్ సత్తా, ఎన్నికల నిఘా పేరుతో 1999లో ఒక పెద్ద సంచలనానికి తెరతీసింది. అలహాబాద్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎన్నికల నిఘావేదికను లోక్ సత్తా ఏర్పాటు చేసింది. నేరచరిత ఉన్నవారికి రాజకీయ పార్టీలు టిక్కెట్లు ఇవ్వవద్దు అంటూ అన్ని పార్టీలకి లేఖలు రాసింది. లోక్ సత్తా ఇది మీ సత్తా అనే నినాదం ఊరూరా మారుమోగింది. ప్రముఖ సినీనటుడు నాగార్జునతో లోక్‌సత్తా రూపొందించిన వీడియో ప్రకటనల ద్వారా లోక్‌సత్తా పేరు ప్రతి ఇంటికి చేరింది.

ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేరచరితుల జాబితాని లోక్‌సత్తా విడుదల చేయడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకి దారితీసింది. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి తమ ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు,నేరచరిత్రను ప్రజల ముందు ఉంచాలి అనే డిమాండ్ ఊపందుకుంది. సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు అయింది. అభ్యర్థులు తమ చరిత్ర చెప్పాల్సిందే అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుని నీరుగార్చాలని రాజకీయపార్టీలు ప్రయత్నం చేసాయి. కేంద్రప్రభుత్వం కూడా నేరచరితులకి వత్తాసుపలుకుతూ ఒక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఇది బ్లాక్ ఆర్డినెన్స్ అంటూ ఈ ఆర్డినెన్స్ ప్రతుల దహనానికి అప్పటి లోక్‌సత్తా రాష్ట్ర సమన్వయకర్త డీవీవీఎస్ వర్మ పిలుపు నిచ్చారు. భారత ప్రభుత్వంచిహ్నం ఉన్న ఆర్డినెన్స్ ప్రతుల్ని దహనం చేయడం తప్పంటూ కొందరు లోక్‌సత్తా ప్రతినిధులు అభ్యంతరం చెప్పారు. ప్రభుత్వ చిహ్నం ఉన్న మొదటి పేజీ మినహా మిగిలిన పేజీలు దహనం చేద్దాం అని వర్మ సూచించారు. చివరికి హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డినెన్స్ ప్రతుల్ని చింపడం ద్వారా జెపి నిరసన వ్యక్తం చేస్తే, డివివిఎస్ వర్మ మాత్రం ప్రతుల దహనం చేసారు. ఈ ఆర్డినెన్స్ పై సంతకం చేయొద్దు అంటూ జెపి నేతృత్వంలో దేశంలోని 25 మంది ప్రముఖులు అప్పటి రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇలా ఎన్నో ప్రయత్నాల ఫలితంగా, చివరికి సుప్రీం కోర్టు తీర్పుతో, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అఫిడవిట్ దాఖలు చేయడంతో పాటు, ఆ వివరాలను కనీసం రెండు పత్రికల్లో ప్రకటనల రూపంలో ఇవ్వాలనే నిబంధన అమల్లోకి వచ్చింది. లోక్‌సత్తా ఉద్యమం ప్రభావం కారణంగా, హత్యలు మానభంగాలు లాంటి తీవ్ర నేరారోపణలు ఉన్నవారికి పార్టీలు టిక్కెట్లు ఇవ్వడం బాగా తగ్గింది. ఈ ఎన్నికల నిఘాలో భాగంగానే మనదేశంలోనే తొలిసారిగా, 100కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులతో ఉమ్మడి వేదికల పేరుతో బహిరంగ చర్చలు నిర్వహించింది లోక్‌సత్తా.

1997నుండి లోక్‌సత్తా కార్యకలాపాలు కేవలం మేధావులు, మిడిల్ క్లాస్,విద్యావంతులు కేంద్రంగా సాగేవి. లోక్‌సత్తా ఉద్యమాన్ని ఒక ప్రజాఉద్యమంగా తీర్చిదిద్దే బాధ్యతను జెపి, డివివిఎస్ వర్మ కు అప్పగించడంతో లోక్ సత్తా రూపం మార్చుకోవడం మొదలుపెట్టింది. హాల్ మీటింగ్స్ స్థానంలో బహిరంగ సభలు, రోడ్ షో లు, పాదయాత్రలు లాంటివి లోక్ సత్తా చేపట్టింది. ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన భండారి అంకయ్య లోక్‌సత్తా లక్ష్యాలను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు పాటలు, పల్లెసుద్దులు సహా ఇతర కళారూపాలు సిద్ధం చేయించారు. టాటా ట్రస్ట్ వారి సహకారంతో జనశిక్షణ పేరుతో ప్రజలకు ప్రజాస్వామ్యంపై అవగాహన పెంచే ఒక బృహత్తర కార్యక్రమాన్ని లోక్‌సత్తా రూపొందించి అమలు

చేసింది. 75వేలమంది పౌరులకి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకోగా,లక్ష్యాన్ని మించి 80వేల మందికి పైగా పౌరులకి ప్రజాస్వామ్యంగురించి,, ఎన్నికల సంస్కరణల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా లోక్‌సత్తా గ్రామాలకు కూడా విస్తరించింది. 2005 నాటికి ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాలలో లోక్‌సత్తా శాఖలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో ఉన్న మొత్తం 1100 మండలాలకు గాను 400 మండల కేంద్రాలలో, 1500కి పైగా గ్రామాల్లో లోక్‌సత్తా ప్రజాసంఘాలు ఏర్పడ్డాయి.

**కోటి సంతకాల సేకరణ**

లోక్ సత్తా రూపొందించి అమలుచేసిన అతి పెద్ద కార్యక్రమం కోటి సంతకాల సేకరణ. "ఇంటిముందు ప్రభుత్వం కంటిముందు పాలన అనే నినాదంతోబీ స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం,73,74 రాజ్యాంగసవరణల అమలు కోసం 2003 లో ప్రజాఉద్యమాన్ని ప్రారంభించింది. రాజకీయపార్టీలకి అతీతంగా సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లని కలుపుకుని 'స్థానికప్రభుత్వాల సాధికారతా సమాఖ్య'ను ఏర్పాటు చేసింది. 2003 రిపబ్లిక్ డే ని లిటిల్ రిపబ్లిక్స్ డే గా ప్రకటించి, ప్రభుత్వ అధికారులకి బదులుగా, గ్రామాలలో సర్పంచులు, జిల్లా కేంద్రాల్లో జిల్లా పరిషత్ చైర్మన్లు జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చింది. తర్వాత దేశ చరిత్రలో తొలిసారిగా కోటి సంతకాల ఉద్యమం ప్రారంభించింది లోక్ సత్తా. మూడు నెలల పాటు, సంతల్లో, పుంతల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ లలో సంతకాల సేకరణ కొనసాగింది. దీనికి ముగింపుగా హైదరాబాద్ లలితకళాతోరణంలో 12వేలమంది ప్రజలతో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ ఉద్యమ ప్రభావాన్ని అర్థం చేసుకున్న రాష్ట్రప్రభుత్వం లోక్ సత్తా ప్రతినిధులని చర్చలకు ఆహ్వానించింది. అప్పటిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్థానిక ప్రభుత్వాలకి కొన్ని అధికారాలు బదలాయించేందుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపారు.

**ఎన్నికల సంస్కరణలకోసం 'వోట్ ఇండియా'**

చట్టసభలకు దామాషా పద్ధతి ఎన్నికలు, రాష్ట్ర ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక సహా కొన్ని కీలకమైన ఎన్నికల సంస్కరణల కోసం డా.జెపి జాతీయ స్థాయిలో చాలా కృషి చేసారు. లోక్ సత్తా ఉద్యమాన్ని మహారాష్ట్ర, తమిళనాడు సహా కొన్ని రాష్ట్రాలకు విస్తరించడంతో పాటు, ఇతర రాష్ట్రాలలో ఉన్న భావసారూప్యత గల సంఘాలతో కలిసి 'వోట్ ఇండియా' పేరుతో ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించే ప్రయత్నం చేసారు. సోనియాగాంధీ, ఎల్.కె అద్వానీ సహా జాతీయ పార్టీల నాయకులతో సంప్రదింపులు జరిపారు. ఒక వామపక్ష పార్టీకి చెందిన కీలకనేత సరైన సమయంలో, సరైన లక్ష్యం కోసం తన పలుకుబడిని వినియోగించకపోవడంతో, ఈ ప్రయత్నాలు అన్నీ విఫలం అయ్యాయి. జాతీయ స్థాయిలో ఉన్న కీలకనేతలను ఒప్పించినా, చిన్న చిన్న మార్పులు తీసుకురాగలం తప్ప, పెద్ద సంస్కరణలు కావాలంటే,నాయకులకి ఓట్ల భాషలోనే సమాధానం చెప్పాలని డా.జెపి నిర్ణయించుకోవడంతో లోక్ సత్తా పార్టీకి అంకురార్పణ జరిగింది.

**లోక్ సత్తా పార్టీ ఆవిర్భావం:**

2006 అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావం జరిగింది. కేవలం కొద్దిమంది కార్యకర్తలు, నాయకులు మాత్రమే ఉద్యమసంస్థలో మిగిలిపోయారు. లోక్‌సత్తా పార్టీ ఎజెండాలో విద్య, ఆరోగ్యం అనేవి కీలకమైన అంశాలు. ప్రజలకి త్వరగా అర్థం అయ్యే అంశాలు. అయితే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్, ఫీజు రీ ఇమ్బర్స్మెంట్, ఆరోగ్య శ్రీ పథకాల పేరుతో విద్య ఆరోగ్యం అనే అజెండాని తనకి అనుకూలంగా మలచుకున్నారు. వైఎస్సార్ ప్రభుత్వం మీద సానుకూలత ఉండడం, తెదేపా రూపంలో బలమైన ప్రతిపక్షం, సామాజిక న్యాయం పేరుతో మూడో ప్రత్యామ్నాయంగా ప్రముఖ సినీ నటుడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని స్థాపించడంతో..సంస్కరణల ఎజెండాతో ఎన్నికల బరిలో దిగిన లోక్‌సత్తా పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. రైతు స్వరాజ్య వేదిక పేరుతో ధాన్యం అమ్మకాలపై ఉన్న ఆంక్షలని తొలగించేందుకు పోరాటంచేసి విజయం సాధించడం, మధ్యనియంత్రణ కోసం ముఖ్యంగా బెల్ట్ షాపుల తొలగింపు కోసం మహిళలతో ఉద్యమాలు చేయడం తప్ప పెద్దగా ప్రభావం చూపలేకపోయింది.

2009 నుండి రాష్ట్ర విభజన అనే ఎమోషనల్ ఎజెండా, తెలంగాణ ఉద్యమ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తుండడంతో లోక్ సత్తా పార్టీ, ఉద్యమం బలహీనపడ్డాయి. అయితే, 2014 ఎన్నికల తర్వాత డా.జెపి ఎన్నికల రాజకీయాలకు విరామం ప్రకటించడంతో, తిరిగి లోక్ సత్తా ఉద్యమ సంస్థ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఇంగ్లాండ్‌లో ఎన్‌హెచ్‌ఎస్ తరహాలో అందరికీ ఆరోగ్యం పేరుతో జేపీ నూతన ఆరోగ్య విధానానికి రూపకల్పన చేసారు. జాతీయ స్థాయిలో దీని అమలకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా సంప్రదింపులు జరుగుతున్నాయి.

25 ఏళ్ల ఉద్యమ ప్రయాణంలో ఆటుపోట్లు, ఉత్థానపతనాలు సహజం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ప్రయాణ వాహనాలు మారి ఉండొచ్చు కానీ, ప్రయాణ గమ్యం మాత్రం మారలేదు. ప్రజల్ని ప్రభువులుగా నిలబెట్టాలనే లక్ష్యం మారలేదు. విద్య, ఆరోగ్యం, ఉపాధి అనే మూడు రంగాలలో సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, దామాషా పద్ధతి ఎన్నికలు, ముఖ్యమంత్రులకి ప్రత్యక్ష ఎన్నిక ఈ లక్ష్యాల కోసం లోక్‌సత్తా పోరాడుతూనే ఉంటుంది. లోక్ సత్తా లక్ష్యాల సాధన కోసం జనబలం పత్రిక ద్వారా, సోషల్ మీడియా ద్వారా, ప్రచారం కొనసాగుతూనే ఉంటుంది.

# అందరికీ ఆరోగ్యం పై చర్చ జరగాలి

## అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా పుస్తకం

## సీపీఐ, సీపీఎం నేతలకు అందజేత






ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా దేశంలోని, రాష్ట్రంలోని ప్రజల అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అతి తక్కువ వ్యయంతో అందించేందుకు లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానంపై రాష్ట్రంలోని అన్నిపార్టీలు చర్చించాలని లోక్ సత్తాపార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకి, సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తో పాటుగా సీనియర్ నేతలతో సమావేశమై ఈ పుస్తకాన్ని అందజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ గందరగోళంగా ఉందని, ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా అందరికీ ఆరోగ్యం అందని ద్రాక్ష లా ఉందని విమర్శించారు. ఆరోగ్య శ్రీ కేవలం కొన్ని వర్గాల వారికి మాత్రమే నని,డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేసిన సూచనలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే రాష్ట్రంలో ని ప్రజలు అందరికీ ఆరోగ్యం ఉచితంగా అందుతుందని అందుకే జేపీ రాసిన నమూనా పై పార్టీలు రాజకీయాలకి అతీతంగా చర్చించాలని భీశెట్టి బాబ్జి కోరారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ సీనియర్ నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగా అజయ్ తదితరులు పాల్గొన్నారు. తప్పనిసరిగా పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారని భీశెట్టి బాబ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధి ఇప్పలవలస గోపాలరావు పాల్గొన్నారు..

### ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యాన్ని అడ్డుకోవాలి



ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన వివాదాస్పద కొఠియా గిరిజన భూముల్లో ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యం గా ప్రవేశించి చేస్తున్న అరాచకాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్న దొరని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈ మేరకు సచివాలయంలో ఆయన్ని కలసి వినతిపత్రం అందచేశారు. అనంతరం బాజ్జీ మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వం ఏపీ భూ భాగంలో ఉన్న గంజాయి భద్ర వద్దనున్న అంగన్వాడీ భవనాన్ని కూల్చివేయడం. అడ్డగోలుగా సరిహద్దు గేటుని ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ అధికారులు కొఠియా వివాదాస్పద గ్రామాల్లో పర్యటించి మన గిరిజన గ్రామాలు ఏవో తేల్చి చెప్పాలని భీశెట్టి బాబ్జి కోరారు.త్వరలోనే లోక్ సత్తాపార్టీ బృందాలు కొఠియా గ్రామాల్లో పర్యటించి గిరిజనులకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు.




## అందరికీ నాణ్యమైన విద్య, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత..

# స్వతంత్ర భారతంలో నారాయణ గురు మార్గం

మతాన్ని ఆధునీకరించి ఆధ్యాత్మికతకు కొత్త అర్థాన్నివ్వటంతోపాటు దానికి విద్యను జోడించి కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన నారాయణ గురు తన జీవితకాలంలోనే ఆ ఉద్యమ ఫలితాలను చూసిన అరుదైన సంస్కర్త అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. 'మతం, సామాజిక న్యాయంపై నారాయణ గురు దార్శనికత'పై హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన జాతీయ సదస్సులో జేపీ పాల్గొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ శ్రీ నారాయణ గురు స్టడీస్ (కేరళ) సౌజన్యంతో గురు ధర్మ ప్రచారణ సభ, శ్రీ నారాయణ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. 1856లో నారాయణ గురు జన్మించారని, తన చుట్టూ ఉన్న సమాజంలో మార్పు కోసం ఆయన చేసిన కృషి వల్ల కేరళలో అణగారిన ఈళవ కులస్తుల జీవితంలో సంపూర్ణ మార్పు 1929 నాటికే కనిపించనారంభించిందని జేపీ అన్నారు. ఇలా జీవితకాలంలోనే తమ ఉద్యమ ఫలితాల్ని చూడటం ఆధునిక భారతంలో నారాయణ గురుకి, ఆ తర్వాత కొంతమేర పాండురంగ శాస్త్రి అథవాలె (స్వాధ్యాయ ఉద్యమం)కే దక్కిందన్నారు. పాండురంగ శాస్త్రి అథవాలె కొంకణ, గుజరాత్ తీరప్రాంతంలో కొన్నివేల గ్రామాలలో మౌలికమార్పుల కోసం కృషి చేసి విజయం సాధించారన్నారు. కానీ నారాయణ గురు అంతకంటే విస్తృతస్థాయిలో ఒక రాష్ట్రాన్ని, ఒక పెద్ద సమాజాన్ని ప్రభావితం చేశారన్నారు. ఉదార రాజ్యాంగం, రాజకీయంతో స్వతంత్ర భారత ప్రస్థానం మొదలైందని, కానీ వివక్ష లేకుండా అందరికీ అవకాశాలు అందించాలన్న మౌలిక ప్రజాస్వామిక లక్ష్యాన్ని కేవలం మాటలకు, నినాదాలకు పరిమితం చేశామని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశంలో చట్టం.. డబ్బు, పలుకుబడి ఉన్నవారికి చుట్టంగా ఉందని, నాణ్యమైన విద్య కేవలం డబ్బున్నవారు, తల్లిదండ్రులకు కాస్త చదువు, తెలివితేటలు ఉన్నవారి పిల్లలకు, కొందరు అదృష్టవంతులకు మాత్రమే అందుతోందని, సాధికారతకు కీలకమైన స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు లేవని.. ఇలాంటి పరిస్థితుల్లో కుల వివక్ష పోవటం, అందరికీ సమానావకాశాలు అందటం అసాధ్యమని అన్నారు. అందరికీ ఎదిగే అవకాశాలను అందించటానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న అపూర్వ కాలంలో ఉన్నామని, మన వంకర బుద్ధిని సరిచేసుకుంటే చాలన్నారు. అందరికీ నాణ్యమైన విద్య, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత.. ఈ మూడు పనులూ చేస్తే పుట్టిన పుట్టుకతో సంబంధం లేకుండా మన దేశంలో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందించగలమని, నారాయణ గురుకి నివాళులర్పించే అర్హతను సంతరించుకోగలమని జేపీ స్పష్టం చేశారు. డా॥ ఎ.సాయిబాబా గౌడ్ సభకు అధ్యక్షత వహించగా, రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఓయూ పూర్వ ఆచార్యుడు ప్రొ.గట్టు సత్యనారాయణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, మాజీ ఎంపీలు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, ఆచార్య ఆజ్మీరా సీతారాం నాయక్, తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, రిథితాంబరానంద, ఈద చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఇండియన్ డెమోక్రసీ 2.0

ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నవరంలో జరిగిన 11వ యంగ్ థింకర్స్ మీట్‌లో 'ఇండియన్ డెమోక్రసీ 2.0'పై ప్రసంగిస్తున్న జయప్రకాష్ నారాయణ్. టిబెట్ మాజీ ప్రధానమంత్రి లోబ్సాంగ్ సంగే, అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తదితరులు హాజరయ్యారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th Aug, 2022 Posting Date 15 &16th of every month





# ప్రజలకు ఖర్చు లేకుండా, ప్రభుత్వానికి భారం కాకుండా.. నాణ్యమైన ఆరోగ్యం - ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా విధానం

ప్రజలు ఆరోగ్య సమస్యలకు తమకు నచ్చిన డాక్టర్ వద్దకు వెళ్లగలిగేలా, ఎటువంటి ఖర్చూ లేకుండా వైద్య పరీక్షలు, సేవల్ని, మందుల్ని పొందగలిగేలా, ప్రభుత్వానికి మరీ ఎక్కువ ఆర్థిక భారం కాకుండేలా మన ఆరోగ్య విధానం ఉండాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఇలాంటి సమగ్ర ఆరోగ్య విధానాన్నే లోక్‌సత్తా రూపొందించిందని, జీతాల పద్ధతిలో కాకుండా మార్కెట్ పోటీ పద్ధతి ప్రకారం వైద్యులకు చెల్లింపు వల్ల ప్రజలకు నాణ్యమైన సేవలు అందటంతోపాటు డాక్టర్లకు కూడా గణనీయమైన ఆదాయం వస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన రీతిలో కాకుండా లోక్‌సత్తా ప్రతిపాదించిన పద్ధతిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తే ప్రజలకు నిజంగా ఆరోగ్యం అందుతుందన్నారు. ఇందులోని ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఇతర వినూత్న ఏర్పాట్ల వల్ల ప్రజలు-వైద్యుల మధ్య అంతరం తగ్గుతుందన్నారు. మనకున్న బలాల వల్ల ఈ మొత్తం ఆరోగ్య విధానాన్నీ జీడీపీలో కేవలం అదనంగా 0.4% కేటాయింపుతో అమలు చేయవచ్చన్నారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవం, లోక్‌సత్తా రజతోత్సవం సందర్భంగా కాకినాడలోని ఐఎంఏ భవనంలో సమగ్ర ఆరోగ్య విధానంపై నిర్వహించిన సదస్సులో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భరోసా లేకుండా గత 75 ఏళ్లుగా ఒక అవ్యవస్థ నడుస్తోందని, దీనివల్ల పేదరికం నిరంతరం కొనసాగుతుండటంతోపాటు ప్రజల ఉత్పాదక శక్తి తగ్గుతోందని, దేశాభివృద్ధి పరిమితమవుతోందని అన్నారు. డాక్టర్ల మీద దాడులకు కూడా ప్రభుత్వాల ఆరోగ్య విధానంలోని వైఫల్యాలే కారణమన్నారు. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ప్రతిపాదించిన ఆరోగ్య విధానం ఈ మొత్తం సమస్యల్నీ పరిష్కరిస్తుందని జేపీ వివరించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త ఉప్పలపాటి మాచిరాజు, ఐఎంఏ కాకినాడ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్‌తోపాటు నగరానికి చెందిన 30 మంది ప్రముఖ వైద్యులు, 150 మందికిపైగా వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



కాకినాడలో టీచర్లతో సమావేశమైన ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**